TARAJYOTHI TELUGU DAILY

# తారాజ్యోతి

తెలుగుదిన పత్రిక

చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్

బుధవారం, సెప్టెంబర్ 02, 2026 | సంపుటి - 20 | సంచిక 334 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## యధావిధిగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్

### సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధించిన హైకోర్టు




హైదరాబాద్ : కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. పథకాల అమలుపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం రద్దు చేసింది. పథకాలపై స్టే విధించడాన్ని సవాల్‌చేస్తూ ప్రభుత్వం దాఖలుచేసిన అప్పీలుపై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. ఈ పథకాల నిమిత్తం ప్రభుత్వం 2014 నుంచి జారీ చేసిన 8 జీవోలను సవాల్‌చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రభుత్వం తరువాయి 2లో

# పెన్షన్లతో ఆర్థిక భరోసా



**ఇప్పటి వరకూ రూ. 75 వేల 503 కోట్ల పెన్షన్లు ఇచ్చాం**

**మంచి కోసం సూచనలు, సలహాలు స్వీకరిస్తా**

**అభివృద్ధిని అడ్డుకుంటున్న గొడ్డలిపార్టీ**

**మీ దీవెనలు ఇలాగే ఉంటే ఇంకా అభివృద్ధి చేస్తా**

**మొగల్తూరు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో చంద్రబాబు**

భీమవరం : పెన్షన్లతో పేద కుటుంబాల్లో భరోసా నింపామని సిఎం చంద్రబాబు అన్నారు. ఇప్పుడు ఆయా కుటుంబాల్లో పెద్దలకు గౌరవం దక్కుతోందన్నారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించడానికి డ్వాక్రా సంఘాలను స్థాపించామని సీఎం తెలిపారు. తన తల్లికి వచ్చిన కష్టం ఎవరికీ రాకూడదని దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. ప్రస్తుతం మగవారితో సమానంగా ఆడవారు ఎదిగారని అన్నారు. భవిష్యత్తులో మగవారిని మించిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదని చెప్పుకొచ్చారు. వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు ఇస్తూ ఆదుకుంటున్నామన్నారు. 2లో

## చేనేతలకు సకాలంలో ఆప్కో చెల్లింపులు



**రెండేళ్లలో రూ.24.51 వస్త్రాలకు పేమెంట్లు**

**మొదటి ఏడాది రూ.18.02 కోట్ల మేర చెల్లింపులు**

**రెండో ఏడాది కూడా పూర్తిస్థాయిలో చెల్లింపులు**

**రూ.కోటీ 3 లక్షల మేర లివరీ బకాయిలు బ్యాంకు ఖాతాల్లో జమ**

అమరావతి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత రంగ అభివృద్ధికి, నేతన్నల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ వస్తోంది. ఒకవైపు రాష్ట్రంలో చేనేత క్లస్టర్లు, టెక్స్ టైల్స్ పార్కులు ఏర్పాటు చేస్తూనే, మరోవైపు నేతన్నలకు 365 రోజులూ ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఆప్కో ద్వారా చేస్తున్న చేనేత వస్త్రాలకు సంబంధించిన కొనుగోళ్లకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ చేనేత సహకార సంఘాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తోంది. 3లో

# కెసిఆర్‌కు ఎదురుగా వచ్చే దమ్ముందా?

**కెసిఆర్ అంటే అనుక్షణం భయంతో చస్తున్న రేవంత్**

**ఆంధ్రాకు నీరు తరలిస్తున్నా అడ్డుకోసి అసమర్థ సిఎం**

**మీడియా సమావేశంలో మండిపడ్డ జగదీశ్ రెడ్డి**

**మిర్యాలగూడ సభ నిర్వహించి తీరుతామని వెల్లడి**



**రాష్ట్రంలో నీటి సమస్యలు తీవ్రంగా మారుతున్నా ప్రభుత్వ పెద్దలు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అవినీతి సొమ్మును లెక్కించే పనిలో ఉన్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆరోపించారు. సూర్యాపేటలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు ఆయన వ్యక్తిత్వానికి అద్దం పడుతున్నాయని జగదీశ్ రెడ్డి అన్నారు.**

సూర్యాపేట : కేసీఆర్ అంటే అనుక్షణం భయంతోనే రేవంత్ రెడ్డి రోత మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్‌ను ఎక్కువగా గుర్తు చేసుకునే వారిలో రేవంత్ రెడ్డిదే ప్రథమ స్థానమని ఎద్దేవా చేశారు. 'కేసీఆర్‌కు ఎదురుగా వచ్చే దమ్ము నీకుందా?' అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డి సచివాలయానికి ఎన్నిసార్లు వచ్చారో లెక్కలు తీయడానికి సిద్ధమా? అని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. వెలిగొండ ప్రాజెక్టుపై మాట్లాడే దమ్ము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎందుకు లేదని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. కళ్లముందే నీరు కనిపిస్తున్నా తరువాయి 2లో



## జిడిపి వృద్ధిరేటు గణాంకాల గారడీ

**ధరలు మోత మోగిస్తుంటే..వృద్ధి ఎలా సాధ్యం**

**ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ జైరామ్ రమేశ్**

న్యూఢిల్లీ : భారత దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించిందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై రాజ్యసభ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. అవన్నీ ప్రచారార్భాటమేనని కొట్టిపారేశారు. గణంకాల గారడీతో మోదీ ప్రభుత్వం 2లో



## ఎంపీ ల్యాడ్స్ నిధులపై దుష్ప్రచారం

**ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదు**

**ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ నివేదికపై బండి**

కరీంనగర్ : ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై దుష్ప్రచారాలు తగవని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ విడుదల చేసిన నివేదికపై బండి స్పందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులను వినియోగించు కోవడంలో పార్లమెంట్ సభ్యులు పూర్తిగా వెనుకబడ్డారన్న ఆ సంస్థ నివేదిక సత్యదూరమని బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ కింద పంపిన ప్రతిపాదనలకు సంబంధించి

## కాంగ్రెస్‌లో చేరేందుకు ఎవరు ప్రయత్నించారు?



**కవిత దొంగచాటుగా కాంగ్రెస్‌లో ప్రవేశించే యత్నం చేయలేదా**

**ఎవరి స్వలాభం కోసం ఆమె విమర్శలు చేస్తున్నారో తెలుసు**

**కష్టకాలంలో మేము మాత్రమే కెసిఆర్‌ను వెన్నంటి ఉన్నాం**

**కవిత వ్యాఖ్యలపై మండిపడ్డ మాజీమంత్రి వేముల**

నిజామాబాద్ : కాంగ్రెస్‌లో చేరేందుకు పలువురిని కలిసి రాయబేరాలు నడిపిన కవిత తనను విమర్శించడం విడ్డూరంగా ఉందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కెసిఆర్‌కు నమ్మకబంట్లుగా ఉన్న వారిని విడదీసి పార్టీని బలహీన పర్చాలన్న ఎజెండాతో కవిత పనిచేస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై, ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. కవితను కేసీఆర్‌ను కలపడానికి ప్రయత్నం చేసిన, విడగొట్టడానికి ప్రయత్నం చేసిన విషయం కేసీఆర్‌కు బాగా తెలుసు. 2లో

## ఢిల్లీకి చేరిన కొండా పంచాయితీ

**హైకమాండ్ నుంచి సురేఖకు పిలుపు..!**

**కేసీ వేణుగోపాల్‌తో సురేఖ భేటీ చాన్స్!**

**రాజకీయ ప్రకంపనలు రేపుతున్నపరిణామాలు**

న్యూఢిల్లీ : తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మరోసారి రాజకీయ ఉత్కంఠ తీవ్ర స్థాయికి చేరుకుంది. మంత్రి కొండా సురేఖ కు.. ఢిల్లీ హైకమాండ్ నుంచి పిలుపు రావడం, ఆమె హస్తినకు బయల్దేరడం ఇప్పుడు పార్టీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి వచ్చిన పిలుపు నేపథ్యంలోనే ఆమె హస్తినకు వెళ్లినట్లు సమాచారం. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కొండా సురేఖ భేటీ కానున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్ కోసం కూడా కొండా సురేఖ ప్రయత్నించినట్లు సమాచారం. దీంతో కొండా సురేఖ విషయంలో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోందనే చర్చ జోరందుకుంది. తరువాయి 2లో

## స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

**డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి**

**దేశప్రజల సమిష్టి కృషితోనే జిడిపి వృద్ధిరేటు**

**దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం**

**ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ దేశ ప్రజలకు అభినందనలు**



న్యూఢిల్లీ : భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8 శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు చెప్పారు. 7.8 శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందని అన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తిసామర్థ్యాలు గొప్పవని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నా భారత్ వృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. భారత దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు దేశ ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని అన్నారు. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచరించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు తెలిపిన ఆయన.. తరువాయి 2లో

# యధావిధిగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్

కౌంటర్ దాఖలు చేయకపోవడంతో పథకాల అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 2014 నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలపై పిటిషన్ దాఖలైందన్నారు. ఈ పథకాల అమలు.. పిటిషనర్‌పై ఎలాంటి ప్రభావం చూపడంలేదని, అతని హక్కులకూ భంగం వాటిల్లలేదని, అంతేకాకుండా పథకం లబ్ధిదారు కూడా కాదన్నారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని పేర్కొన్నారు. షాదీ ముబారక్ లాంటి పథకాన్ని సుప్రీంకోర్టు అనుమతించిందని, అలాంటిదే కళ్యాణలక్ష్మి పథకమన్నారు. ఈ పిటిషన్ సింగిల్ జడ్జి వద్ద విచారణార్హం కాదని, ప్రభుత్వ విధాన నిర్ణయాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించే పరిధి ఈ డివిజన్ బెంచ్‌కు ఉందన్నారు. పథకం అమలుపై ఉన్న మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. స్టేను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

# జిడిపి వృద్ధిరేటు గణాంకాల గారడీ

ప్రజలను భ్రమల్లో ముంచెత్తు తోందని ఎంపీ జైరాం రమేశ్ ఆరోపించారు. దేశంలో పెట్టుబడులు, వినియోగం మందగించాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 'హై వోల్టేజ్' ధరల భారాన్ని సామాన్యులపై మోపుతోందని ఆరోపించారు.ముడిసరకుల ధరలు పెరగడంతో సామాన్యుల సొంతింటి కలలు కల్లలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరాభారం కేవలం వంటింటికే పరిమితం కాలేదని అన్నారు. రాగి వైర్ ధర రూ. 850 నుంచి రూ. 1,700 కి, అల్యూమినియం ధర రూ. 350 నుంచి రూ. 650 కి చేరిందని వెల్లడించారు. 1,000 చదరపు అడుగుల ఇంటికి వైరింగ్ ఖర్చు రూ. 50 వేల నుంచి లక్ష రూపాయలకు పెరిగిందని చెప్పారు. హోమ్ అప్లయెన్సెస్, ఎల్ఈడీ లైట్లు, ఫ్యాన్లు, సోలార్ ప్యానెళ్ల ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరిగాయని అన్నారు. స్విచ్ సాకెట్లు, మెయిన్ లైన్ కేబుల్స్, టైల్స్, కార్మికుల ఖర్చు ఇలా అన్నీ పెరిగాయని అన్నారు. ధరాభారం అన్ని వైపుల నుంచి ప్రజలకు పొంచిఉందని వ్యాఖ్యానించారు. ఇంత జరుగుతున్నా కూడా మోదీ ప్రభుత్వం మాత్రం వాస్తవాలను మరుగున పరిచి, గణాంకాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తూ ఉందని మండిపడ్డారు. త్రైమాసిక జీడీపీ గణాంకాలు దేశంలోని పరిస్థితుల్ని తప్పుగా చూపిస్తున్నాయని అన్నారు. వీక్ సెంటిమెంట్‌ను ప్రతిఫలించట్లేదని చెప్పారు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ 7.8 శాతం వృద్ధి సాధించడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. భారత్ ప్రగతిబాటలో దూసుకుపోతుంటే నిరాశావాదులు మాత్రం అసత్యాలను ప్రచారిస్తున్నారని విమర్శించారు. ఈ వృద్ధి రేటు భారతీయుల సమష్టి శక్తికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఈ వృద్ధి రేటును కొనసాగించేందుకు భారతీయులు దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా సూచించారు.

# ఎంపీ ల్యాడ్స్ నిధులపై దుష్ప్రచారం

పనుల పురోగతి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని పేర్కొన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీ ల్యాడ్స్ కింద రూ.17.50 కోట్లు కేటాయించగా.. అందులో ఇప్పటికే రూ.16.47 కోట్లు వినియోగించామని ఆయన స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన వివరాలను గణాంకాలతో సహా బండి సంజయ్ మీడియాకు వివరించారు. 'కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి గత మూడేళ్లలో కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, హైమాస్ట్ లైట్లు, సీసీ రోడ్ల నిర్మాణాల కోసం స్థానిక ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు 627 ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపాం. ఇందులో కరీంనగర్ జిల్లా నుంచి 313, హన్మకొండ నుంచి 39, జగిత్యాల నుంచి 45, రాజన్న సిరిసిల్ల నుంచి 151, సిద్దిపేట నుంచి 79 పనులకు సంబంధించిన ప్రతిపాదనలున్నాయి. వీటిలో 82.29 శాతం పనులకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఆమోదం తెలిపారు. మిగిలిన పనుల మంజూరు అంశం ప్రాసెస్‌లో ఉంది. మొత్తంగా కేంద్రం కేటాయించిన రూ.17.5 కోట్లలో 94.1 శాతం మేరకు అంటే రూ.16.47 కోట్ల నిధులకు సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని కేంద్ర మంత్రి వివరించారు. ఇందులో 16వ లోక్‌సభ సభ్యుడిగా కొనసాగిన బోయినపల్లి వినోద్ కుమార్ తన ఐదేళ్ల కాలంలో వినియోగించని రూ.2.5 కోట్లను సైతం తాను ఖర్చు చేసినట్లు బండి సంజయ్ తెలిపారు. వాస్తవానికి స్థానిక సమస్యల పరిష్కారానికి సంబంధించి కేంద్రం ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులు సరిపోవడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా నిధులను ఏటా పెంచాలని కోరుతూ ఇప్పటికే ఎంపీలు నుంచి కేంద్రానికి అనేక విజ్ఞప్తులు వెళ్తున్నాయని తెలిపారు. అయినప్పటికీ ఎంపీ ల్యాడ్స్ నిధులే ఖర్చు చేయడం లేదంటూ ఏడీఆర్ ఇండియన్ సంస్థ ప్రచారం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. 'ఎంపీ ల్యాడ్స్ నిధుల కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు అనేక దశలు ఉన్నాయని తెలిపారు. ఇవేవీ పట్టించుకోకుండా ఏకపక్షంగా పార్లమెంట్ సభ్యులు ఎంపీ ల్యాడ్స్ నిధులనే వినియోగించుకోవడం లేదని ఆరోపణ చేయడమంటే బట్ట కాల్చి మీద వేయడమేనని మండిపడ్డారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 7 నెలల సమయం ఉన్నప్పటికీ తన వద్ద ఎంపీ ల్యాడ్స్ నిధులే మిగలలేదని, ఆ నిధులకు సంబంధించిన ప్రతిపాదనల్ని ఎప్పుడో సంబంధిత జిల్లాల కలెక్టర్లకు పంపామని వివరించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం తన వద్దకు వచ్చే ప్రజల విజ్ఞప్తులను పరిష్కరించేందుకు అవసరమైన నిధుల కోసం సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్‌ను కూడా సేకరిస్తున్నామని విషయాన్ని ఆ సంస్థ గుర్తుంచుకోవాలన్నారు. ఇకనైనా ఎంపీ ల్యాడ్స్ నిధులకు సంబంధించి నగదు కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు దశలవారీగా వాస్తవాలను ఆ సంస్థ పరిగణనలోకి తీసుకుని, వాటిని ప్రజల ముందు ఉంచాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కోరారు.

# స్వల్ప నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

న్యూఢిల్లీ : దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో సెషన్‌లోనూ నష్టాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, హెల్త్‌కేర్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి మార్కెట్లపై ప్రభావం చూపించింది. అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ పెరిగిన ఉద్రిక్తతలు ఇన్వెస్టర్లను అప్రమత్తం చేశాయి. సెన్సెక్స్ 12.99 పాయింట్ల నష్టపోయి 76,944.28 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 24.60 పాయింట్లు తగ్గి 24,055.80 వద్ద ముగిసింది. నిఫ్టీకి 24,150–24,200 స్థాయి కీలక నిరోధంగా ఉంటుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. 24,200 పైన నిలకడగా ట్రేడైతే 24,300–24,400 స్థాయిల దిశగా పుంజుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అప్పటివరకు పైస్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి కొనసాగే అవకాశం ఉందన్నారు. మరోవైపు నిఫ్టీ 24,000 దిగువన నిలకడగా కొనసాగితే 23,900–23,800 ప్రాంతానికి పడిపోయే అవకాశముందని విశ్లేషకులు పేర్కొన్నారు. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, మారుతి సుజుకి ఇండియా, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లు అధికంగా నష్టపోయాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.39 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.23 శాతం క్షీణించాయి. రంగాల వారీగా చూస్తే హెల్త్‌కేర్, ఆటో, రియల్టీ, ఫార్మా సూచీలు వెనుకబడ్డాయి. ఎఫ్ఎంసీజీ, ఐటీ సూచీలు మాత్రం మెరుగ్గా రాణించి మార్కెట్‌కు కొంత మద్దతు ఇచ్చాయి. అమెరికా–ఇరాన్ ఉద్రిక్తతలతో ప్రపంచ ఆర్థిక పరిస్థితిపై ఆందోళనలు పెరిగాయని నిపుణులు తెలిపారు. సమీప కాలంలో ఇంధన మార్కెట్ల పరిణామాలు, ప్రపంచ వడ్డీ రేట్లపై అంచనాలు, వర్ధమాన దేశాల్లోకి పెట్టుబడుల ప్రవాహం మార్కెట్ దిశను నిర్ణయించే అవకాశం ఉందన్నారు.

# కెసిఆర్‌కు ఎదురుగా వచ్చే దమ్ముందా?

ఆ నీటిని ఆంధ్రా ప్రాంతానికి తరలిస్తుంటే అడ్డుకోలేని పరిస్థితికి ప్రభుత్వ అసమర్థత, అవినీతే కారణమని ఆరోపించారు. తనకు రాజకీయంగా ఎదగడానికి అవకాశం కల్పించిన మహబూబ్‌నగర్ జిల్లాకు రేవంత్ రెడ్డి ద్రోహం చేస్తున్నారని జగదీశ్ రెడ్డి విమర్శించారు. పాలమూరు ప్రాంతంలో మళ్లీ వలసలు పెరగడానికి ప్రభుత్వ విధానాలే కారణమవుతున్నాయని ఆరోపించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అన్యాయం జరుగుతున్నా జిల్లా మంత్రులు నోరు మెదపడం లేదని ఆయన మండిపడ్డారు. కళ్ల ముందే నీటి సమస్యలు కనిపిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలోని అనేక పట్టణాలు, పల్లెల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని జగదీశ్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 24 గంటల విద్యుత్, తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టామని, ప్రస్తుత ప్రభుత్వం కరెంట్, నీరు అందించడంలో విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, వైఫల్యాలపై రేపటి నుంచి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరుబాట ప్రారంభమవుతుందని జగదీశ్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యంగా రైతాంగ సమస్యలు, వ్యవసాయ సంక్షోభంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. ల్గ÷తాంగ సమస్యలు, వ్యవసాయ సంక్షోభంపై కేటీఆర్ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో భారీ రైతు సభ నిర్వహించనున్నట్లు జగదీశ్ రెడ్డి తెలిపారు. ఈ సభకు రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడానికి సిద్ధమవుతున్నారని చెప్పారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా మిర్యాలగూడలో కేటీఆర్ రైతు సభను నిర్వహించి తీరుతామని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు.

# స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

గతంలో చేసిన విజ్ఞప్తినే మరోసారి గుర్తుచేశారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, విదేశీ ప్రయాణాలు వద్దని, అవసరం లేకుండా బంగారం కొనొద్దని మరోసారి కోరారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వీడియో విడుదల చేశారు. దేశ ప్రజలకు అభినందనలు. 7.8? వృద్ధి గొప్ప విషయం. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు. అయినా భారత్ పురోగమిస్తోందని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు. పర్యటనల కోసం విదేశాలకు వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు దూరంగా ఉండండి. 'భారత్‌లోనే వివాహం చేసుకోండి' అనే మంత్రాన్నే మనం పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారాన్ని కొనడం మానుకోండి. స్థానికంగా తయారైన వస్తువులు, సేవలు ఎంత ఎక్కువగా ఎంచుకుంటే.. దేశం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే.. స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉందని మోదీ పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసిన 7 శాతం కంటే ప్రస్తుత వృద్ధి రేటు ఎక్కువ. అమెరికా– ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు, ఇంధన సరఫరాకు అవరోధాలు వంటి పరిస్థితులను తట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ రాణించడం విశేషం. ఈ వృద్ధిని దేశ ప్రజలు వేడుకలా నిర్వహించుకోవాలి. అదే సమయంలో వికసిత్ భారత్ దిశగా కృషి చేయాలి. 140 కోట్ల మంది ప్రజల ఐక్యత.. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రధాని అన్నారు.

# పెన్షన్లతో ఆర్థిక భరోసా

దేశంలో నాలుగు వేలు, ఆరువేలు, పదివేలు, పదిహేను వేలు పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రం ఏపీనే అని అన్నారు. ఇప్పటి వరకూ 75 వేల 503 కోట్ల రూపాయలను పెన్షన్లు ఇచ్చామని.. ఆ డబ్బుతో మూడు పోలవరం ప్రాజెక్ట్‌లు కట్టవచ్చన్నారు. ఆర్థిక అసమానతలు పోవాలని.. అందరికీ సంక్షేమం అందాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. 45 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎన్నోసార్లు నరసాపురం వచ్చానని..అనేక పాలనా సంస్కరణలకు నాంది పలికామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మొగల్తూరులో లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేసిన అనంతరం ప్రజావేదిక సభలో సీఎం మాట్లాడుతూ.. తనకు మొగల్తూరు కొత్తేమీ కాదన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఉపసభాపతి రఘురామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు. ప్రజా కార్యక్రమాల్లో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కోలుకోలేని విధ్వంసం జరిగిందని విమర్శించారు. అటువంటి పరిస్థితి నుంచి 94 శాతం సీట్లలో, 54 శాతం ఓట్లతో కూటమిని ప్రజలు గెలిపించారని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ఇంకా బాగా జరగాలి.. అందుకోసం సలహాలు, సూచనలు చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సంక్షేమం పేదవాడిని నిలబెట్టాలి.. తాత్కాలిక ఉపశమనం ఉండాలన్నారు. చైనా సామెతను ఉదాహరిస్తూ..చేపలు అందించడం కాదు..చేపలు పట్టించడం నేర్పాలని అన్నారు. ప్రతి ఒక్కరూ స్వయం సమృద్ధి సాధించాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. ఆడ బిడ్డలు ఎక్కడికి వెళ్లాలన్నా.. ఉచిత బస్సులు తెచ్చాం. దీపం పథకం ద్వారా 3 సిలిండర్లు ఇస్తున్నాం. పేదల సేవ కోసమే మొగల్తూరు వచ్చాను. సీఎం స్థాయిలో అనేక మార్పులు చేశాను. ఎంత సేవ చేసినా మీ రుణం తీర్చుకోలేను. అనేక సంస్కరణలకు నాంది పలికాం.. ప్రజా చైతన్య కార్యక్రమాలు తెచ్చాం. ఎన్నికల్లో మీరిచ్చిన తీర్పును ఎన్నటికీ మర్చిపోలేను. వైకాపా హయాంలో రాష్ట్రానికి కోలుకోలేని నష్టం జరిగింది. కూటమిగా ఏర్పడి రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడుతున్నాం. 45 సంవత్సరాలుగా వెనుకబడిన వర్గాలు తెదేపాని అంటిపెట్టుకునే ఉన్నాయి. ఆర్టీసీలో మహిళా కండక్టర్ల వ్యవస్థను తీసుకొచ్చాం. త్వరలో మహిళా డ్రైవర్ల వ్యవస్థను తీసుకొస్తాం. వడ్డెర సమాజిక వర్గానికి మైనింగ్ లీజులు పెట్టాం. గౌడ్ కులానికి మద్యంషాపులు కేటాయిస్తున్నాం. డీఎస్సీపై వైకాపా 350 కేసులు వేసింది. వైకాపా చేస్తోన్న ప్రచారాన్ని డీఎస్సీ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పింఛన్లు పెంచాం. పేదల పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. పేదలకు చేయూతనిస్తే ఏదైనా సాధించే సత్తా ఉంటుందని చంద్రబాబు అన్నారు. కొన్ని రోజుల్లో ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయని.. వాటిని మహిళలు నడపాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. డ్వాక్రా ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి అయ్యేలా చూస్తామని చెప్పారు. మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఆర్థిక సహాయాన్ని ఇవ్వడాన్ని తానే ప్రారంభించానని తెలిపారు. ఎలాంటి మంచి పనులు చేసినా అడ్డుపడుతున్నారని ప్రతిపక్షంపై మండిపడ్డారు. ఏజెన్సీలోని పిల్లలకు మెరుగైన విద్య అందిస్తే, ప్రపంచంలోనే మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు. వాటన్నింటికీ గొడ్డలి పార్టీ అడ్డుపడుతోందని విమర్శించారు. 'ఎంత అడ్డుపడినా నా ఆశయాన్ని ఆపలేరు' అని స్పష్టం చేశారు. డీఎస్సీని అడ్డుకోవడానికి 350 పిటిషన్లు వేశారని.. పారదర్శకంగా ఉద్యోగాలు ఇస్తే, కోడిగుడ్డుకు ఈకలు పీకుతున్నట్లు వ్యవహరిస్తున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీలో టీచర్లుగా ఎంపికైన వారు గొడ్డలి పార్టీని హెచ్చరించినా వారిలో మార్పులేదన్నారు. త్వరలో ఏసీ బస్సులు వస్తున్నాయని.. మహిళలు ఉచితంగా ఆ బస్సుల్లో ఎక్కే రోజులు రాబోతున్నాయని తెలిపారు. మహిళలు ఇంటిపైన సోలార్ పెట్టుకుంటే విద్యుత్ తయారు అవుతుందని.. దానివలన కొన్ని రోజుల్లో ఉచితంగా కరెంటు పొందవచ్చని సూచించారు. వేసవికాలంలో ఎండలు ఎక్కువ ఉంటాయి కాబట్టి.. ఏసీలు పెట్టుకోవచ్చని.. అదనంగా ఉండే విద్యుత్‌ను అమ్ముకోవచ్చ న్నారు. ప్రతి ఇంట్లో ఒక చిన్న పారిశ్రామికవేత్త రావాలని వన్ హౌస్– వన్ ఆంత్రప్రెన్యూర్ అనే పథకాన్ని తీసుకువచ్చినట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. అందరూ ప్రయత్నం చేస్తే మార్పు ఖచ్చితంగా వస్తుందని.. అనుకుంటే సాధించగలుగుతారని చంద్రబాబు అన్నారు. ఇప్పటికే 5 లక్షల 90 వేలు ఇళ్లు పూర్తి చేశామని.. మరో అయిదు లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. అప్పట్లో పరిశ్రమలను పారద్రోలారని.. కూటమి అధికారంలోకి వచ్చాక 22 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. బుధవారం గోదావరి నీటిని ఉత్తరాంధ్రకు తీసుకెళ్లబోతున్నామని.. చరిత్రను మార్చబోతున్నామని తెలిపారు. భవిష్యత్తులో గోదావరి, కృష్ణా, కావేరి నదులను అనుసంధానం చేస్తామని వెల్లడించారు. మూడేళ్లుగా కరెంటు ఛార్జీలు పెంచలేదని, తగ్గించామని సీఎం అన్నారు. వైసీపీ హయాంలో 9 సార్లు 32 వేల కోట్ల రూపాయల మేర ఛార్జీలు పెంచారని చెప్పారు. లక్షా 50 వేల కోట్లు విద్యుత్ నిమిత్తం అప్పులు చేశారని వివరించారు. రెండు రూపాయలకు కిలో బియ్యం ఇచ్చి పేదలను ఆదుకున్న యుగపురుషుడు ఎన్టీఆర్ అని గుర్తుచేశారు. యూనిట్ రూపాయిన్నరకే ఆక్వాకు కరెంటు ఇస్తూ.. రూ.1200 కోట్లు సబ్సిడీ ఇస్తున్నామని అన్నారు. కేరళంలో ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనునిత్యం ప్రజల గురించే ఆలోచిస్తున్నారని తెలిపారు. గొడ్డలి పార్టీకి వణుకు పుట్టిందని.. స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవం అయితే ఊరుకోమని అంటున్నారని చంద్రబాబు తెలిపారు. ప్రజలు ఏకగ్రీవం చేస్తే వారేం చేస్తారని ప్రశ్నించారు. ఆయారాం, గయారాంలకు చెక్ పెట్టేందుకే మున్సిపల్ ఎన్నికల్లో ప్రత్యక్ష ఎన్నికలను తీసుకువచ్చామన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు తీసుకువస్తే, మళ్లీ గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లిందని.. చిత్తుచిత్తుగా ఓడిపోతామనే భయంతో సర్ పేరుతో మళ్లీ కోర్టుకు వెళ్లారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉంటే చాలదని.. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఉండాలని అన్నారు. సమాజంలో కలుషితం పోవాలని తెలిపారు. జనవరి నుంచి సంజీవని పథకాన్ని తీసుకొస్తున్నామని.. అప్పుడు డాక్టర్లే ప్రజల దగ్గరకు వస్తారన్నారు. 'రాబోయే రోజుల్లో మీ ఫోనే మీకు సర్వస్వం. ఏ పని చేయాలన్నా ఫోన్ ద్వారా చేయవచ్చు. మీ అందరూ ఆనందంగా ఉండడానికి ఏమైనా చేస్తాను. దానిని మీరు కూడా ఉపయోగించుకోవాలి. గొడ్డలి పార్టీ కులాలు, మతాల పేరుతో రెచ్చగొడుతోంది. ప్రజలు కూడా ఆలోచించుకోవాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ఢిల్లీకి చేరిన కొండా పంచాయితీ

గత కొంతకాలంగా మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మితలకు సంబంధించిన వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. ఇటీవలే గీసుకొండలో సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తం కావడంతో పాటు.. పార్టీ క్రమశిక్షణ కమిటీ కూడా స్పందించింది. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలంటూ కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే తన కుమార్తె వ్యాఖ్యలకు, తనకు ఎలాంటి సంబంధం లేదని.. అవి ఆమె వ్యక్తిగత వ్యాఖ్యలు అంటూ.. మంత్రి కొండా సురేఖ.. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవికి తన వివరణ అందించారు. ఆ తర్వాత కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారానికి సంబంధించి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన నివేదికను టీపీసీసీ అధిష్ఠానానికి పంపినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల మధ్య ప్రస్తుతం కొండా సురేఖ ఢిల్లీ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. హైకమాండ్ పెద్దలతో జరిగే సమావేశంలో తనపై వచ్చిన ఆరోపణలు, కుమార్తె వ్యాఖ్యల వ్యవహారం, పార్టీ అంతర్గత పరిణామాలపై కొండా సురేఖ వివరణ ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. అయితే ఆమెపై ఎలాంటి చర్య తీసుకుంటారనే అంశంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. కొండా సురేఖ ఢిల్లీ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ వర్గాల్లో ప్రధానంగా రెండు రకాల చర్చలు వినిపిస్తున్నాయి. పార్టీ అధిష్ఠానం ఆమెకు కేవలం వివరణ కోరడంతో వ్యవహారాన్ని ముగిస్తుందా లేకపోతే.. పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన అంశంగా పరిగణించి ఏదైనా చర్య తీసుకుంటుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవేళ హైకమాండ్ నుంచి కఠిన నిర్ణయం వచ్చే పరిస్థితి ఉంటే మంత్రి పదవికి సురేఖ రాజీనామా చేసే అవకాశముందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎం రేవంత్ ఢిల్లీకి వెళ్లిన కొద్దిసేపటికే మంత్రి కొండా సురేఖ కూడా హస్తినకు చేరుకోవడంతో కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాలపై చర్చలు జరుగుతున్నాయనే ప్రచారం ఊపందుకుంది. అయితే కేబినెట్‌లో ఖాళీగా ఉన్న స్థానాల భర్తీ అంశం కూడా ఈ ఢిల్లీ పర్యటనలతో మరోసారి తెరపైకి వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో పార్టీ పెద్దలను కలుస్తుండటంతో కేబినెట్ విస్తరణపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. కొత్త మంత్రుల ఎంపిక, ఖాళీ స్థానాల భర్తీ, పార్టీకి సంబంధించిన ఇతర అంశాలపై హైకమాండ్‌తో చర్చలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే సమయంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కావడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఇండిగో విమానం ఇంజన్‌లో సాంకేతిక లోపం

న్యూఢిల్లీ,సెప్టెంబర్1 : గోవా నుంచి ఢిల్లీ బయలుదేరిన ఇండిగో విమానం ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. మంగళవారం ఉదయం 9.15 గంటలకు గోవా ఎయిర్ పోర్ట్ నుంచి విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఈ సాంకేతిక లోపం ఏర్పడింది. ఈ విషయాన్ని గుర్తించిన విమానం పైలట్ వెంటనే మనోహర్ ఎయిర్ పోర్ట్ అధికారులకు తెలియజేశారు. వారి అనుమతితో ఈ విమానాన్ని అత్యవసరంగా గోవా ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ చేశారు. దీంతో విమానంలోని ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్ నేపథ్యంతో గోవా ఎయిర్‌పోర్టులో అధికారులు ఫుల్ ఎమర్జెన్సీ ప్రకటించారు.

# కాంగ్రెస్‌లో చేరేందుకు ఎవరు ప్రయత్నించారు?

పార్టీ లైన్ దాటిన తర్వాత కేసీఆర్ కవితను పార్టీ నుంచి వేటు వేశారని అన్నారు. నేను, మా తండ్రి వేముల సురేందర్‌రెడ్డి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులం. 2001 తెలంగాణ ఆవిర్భావానికి ముందే టీఆర్ఎస్ పార్టీలో ఉన్నాం. టీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి అంటేనే టీఆర్ఎస్ పార్టీ. కవిత మధ్యలో వచ్చిండ్రు.. మధ్యలో పోయిండ్రని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీతో నేను మంతనాలు చేశానని అంటున్న కవిత.. ఇప్పుడు కష్టకాలంలో కేసీఆర్ వెంట ఉన్నది నేనా.. కవితనా? అసెంబ్లీలో, అసెంబ్లీ బయట, జిల్లాలో రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నది నేనా.. కవితనా? అని ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ఉన్న నేను కాంగ్రెస్‌లోని ఎవరితో మంతనాలు చేయలేదు. కవిత కాంగ్రెస్‌తో మంతనాలు చేయలేదని చెప్పగలరా? కవిత రహస్యంగా కాంగ్రెస్ నాయకులతో మంతనాలు చేయలేదని చెప్పగలరా? అని ప్రశ్నించారు. నిరాధారమైన ఆరోపణలు ఎవరి లాభం కోసం కవిత చేస్తున్నారు? స్వలాభం కోసం వ్యక్తిగత ప్రతిష్టలు దెబ్బతీసే విధంగా మాట్లాడడం కరెక్ట్ కాదు. నాపై నిరాధారమైన ఆరోపణలు చేసే హక్కు కవితకు లేదని అన్నారు. మొదటి నుంచి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తున్నారు. కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తుంది. ప్రత్యక్షంగా మా నాయకత్వాన్ని బలహీనపరిచి, పరోక్షంగా అధికార పార్టీకి కవిత న్యాయం చేస్తుందని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. కవిత సభలో కన్నీళ్లు పెట్టుకోవడంపై స్పందిస్తూ.. రాజకీయంగా సింపతిని గెయిన్ చేయడానికి అని అర్థం అవుతుంది. అది ఆమె విజ్ఞతకు వదిలేస్తున్నాం. కవిత చేసే ఈ పనుల వల్ల కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో బిడ్డగా ఆమె ఆలోచించడం లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్. ఆయనపైన, కేటీఆర్‌పైన విమర్శలు చేయగా లేనిది మాపై చేయడం పెద్ద ఆశ్చర్యాన్ని కలిగించలేదు. కానీ బాధగా అనిపించింది. సొంత లాభం కోసం కవిత మాట్లాడటం పెద్ద బాధగా అనిపించలేదని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కవితను రెండుసార్లు ఎమ్మెల్సీగా చేయడంలో నా పాత్ర ఏందో కేసీఆర్‌కు బాగా తెలుసు. కవితపై మొన్నటి వరకు కేసీఆర్ బిడ్డగా గౌరవం ఉండేది. నిన్నటి మాటలతో ఆ గౌరవాన్ని కవిత పోగొట్టుకుందని వ్యాఖ్యానించారు. ఇకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో లింబాద్రి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రయోజనాలను సూచించే 'బాకీ కార్డులకు' ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆ హామీలను అమలు చేస్తామని చెప్పిందని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల్లో అనేక హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల ద్వారా ఎంత మేర బాకీ పడిందో ప్రజలకు తెలియజేస్తూ, ఇచ్చిన హామీలను ఇకనైనా నెరవేర్చాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకు బీఆర్ఎస్ చేపట్టిన 'బాకీ కార్డుల పూజ' కార్యక్రమంలో రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు తదితర వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజల ముందుంచారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఏకాంత నిర్బంధాన్ని నిలిపివేయండి

## పాకిస్థాన్ హైకోర్టు కీలక ఆదేశం జారీ

## పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌కు ఊరట

న్యూఢిల్లీ,సెప్టెంబర్1 : పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీలకు ఇస్లామాబాద్ హైకోర్టు నుంచి పెద్ద ఎత్తున ఊరట లభించింది. రావల్పిండిలోని అడియాలా జైల్లో ఖైదులో ఉన్న వీరిని ఏకాంత నిర్బంధంలో ఉంచరాదని జైలు అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ ఖాదిమ్ హుస్సేన్ సోమ్రో నేతృత్వంలోని ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఇమ్రాన్ ఖాన్, బుష్రా బీబీలను ఏకాంత నిర్బంధంలో ఉంచుతున్నారంటూ దాఖలైన పిటిషన్లను విచారించిన న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఇమ్రాన్ ఖాన్ దంపతులను ఒంటరిగా ఉంచే పద్ధతికి స్వస్తి పలికి, జైలు నిబంధనల ప్రకారం సాధారణ సదుపాయాలు కల్పించాలి. ఇమ్రాన్, బుష్రా సమావేశం అయ్యేందుకు అవకాశం కల్పించాలి. జైలు నిబంధనల ప్రకారం కుటుంబ సభ్యులు ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతించాలి. ఆయన కుమారులతో ఫోన్లో మాట్లాడేందుకు తగిన ఏర్పాట్లు చేయాలి.ప్రతిరోజూ క్రమం తప్పకుండా వార్తాపత్రికలు, పుస్తకాలు అందజేయడంతో పాటు, జైలు నిబంధనలకు అనుగుణంగా సరైన వైద్య సదుపాయాలు కల్పించాలి.ఈ ఆదేశాల అమలుపై పూర్తి నివేదికను 15 రోజుల్లోగా సమర్పించాలని అడియాలా జైలు సూపరింటెండెంట్‌ను కోర్టు ఆదేశించింది. అవినీతి కేసుల్లో సుదీర్ఘ కాలంగా శిక్ష అనుభవిస్తున్న ఇమ్రాన్ ఖాన్, బుష్రా బీబీలకు జైల్లో సరైన వసతులు కల్పించడం లేదంటూ ఆయన కుటుంబ సభ్యులు కొద్దికాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో... హైకోర్టు నుంచి ఈ సానుకూల తీర్పు వెలువడటం గమనార్హం.

# హైడ్రా రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట

### సింగిల్ జడ్జ్ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు

హైదరాబాద్,సెప్టెంబర్1 : హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హై కోర్టులో ఊరట లభించింది. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసులో ఆయనపై సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆర్డర్‌ను డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. తదుపరి విచారణ నవంబర్ 3వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది. అప్పటి వరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ని మార్చాలనే సింగిల్ బెంచ్ ఆర్డర్‌ను తాత్కాలికంగా డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. తదుపరి ఆదేశాల వరకు లోతుకుంటా భూముల జోలికి వెళ్లవద్దని హై కోర్టు స్పష్టం చేసింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తరఫున హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ సీజే జస్టిస్ రాజీవ్ శక్దర్ వాదనలు వినిపించారు. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసుపై అప్పీల్‌కు హైడ్రా కమిషనర్ వెళ్లిన విషయం తెలిసిందే. ఇదే కేసులో రంగనాథ్‌ని తప్పించి మరో అధికారిని నియమించాలని సింగిల్ జడ్జి గతంలో తీర్పునిచ్చారు. ఈ క్రమంలోనే సింగిల్ జడ్జి తీర్పుని హైడ్రా కమిషనర్ రంగనాథ్ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు.

# చేనేతలకు సకాలంలో ఆప్కో చెల్లింపులు

2019–24 మధ్య నాటి ప్రభుత్వం ఆప్కో ద్వారా చేసిన కోనుగోళ్లకు సంబంధించి చెల్లింపులు ఏనాడూ సకాలంలో చేయలేదు. దీనివల్ల చేనేత సహకార సంఘాలకు ఆప్కో బకాయిలు పెరుగుతూ రాసాగాయి. దీనివల్ల చేనేత సంఘాలపై విపరీతమైన ఆర్థిక భారం పడసాగింది. చెల్లింపులు నిలిచిపోవడంతో నేతన్నలు కుటుంబాలు అర్థాకలితో అలమటించ సాగాయి.నేతన్నల కష్టాలను సీఎం చంద్రబాబునాయుడు, పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ తెలుసుకుని, అధికారంలోకి రాగానే, ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు తక్షణ చెల్లింపులు చేస్తూ వస్తున్నారు. సకాలంలో కొనులు చేసిన వస్త్రాలకు చెల్లింపులు చేయడం ద్వారా చేనేత సంఘాలపై ఆర్థిక భారం పడకుండా ఉండడంతో పాటు నేతన్నలకు నిత్యం ఉపాధి లభించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ వస్తోంది. లివరీ చెల్లింపులు సైతం చేస్తూ, చేనేత సహకార సంఘాలకు ఆసరాగా ఉంటోంది. చేనేతలు గౌరవప్రదమైన జీవనం సాగించడమే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం లక్ష్యం. ఇందులో భాగంగా ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు ఏప్రిల్ 2024 నుంచి ఏ నెల కానెల చెల్లింపులు చేస్తూ వస్తున్నారు. మొదటి ఏడాది చేనేత సహకార సంఘాల నుంచి ఆప్కో అధికారులు 18,03 కోట్ల విలువైన వస్త్రాలను కొనుగోలు చేశారు. ఇందుకు గానూ రూ.18.02 కోట్ల మేర చెల్లింపులు చేశారు. రెండో ఏడాదిలో కూడా పూర్తిస్థాయి చెల్లింపులు చేశారు. ఈ ఏడాది మార్చి వరకూ రూ.6.61 కోట్ల వస్త్రాలను చేనేత సంఘాల నుంచి కొనుగోలు చేయగా, పూర్తి స్థాయిలో ఆ సంఘాలకు చెల్లింపులు చేశారు. రెండేళ్లలో రూ.24.51 కోట్లను చెల్లించి, చేనేత సంఘాలపై ఆర్థిక భారం పడకుండా, నేతన్నలకు నిత్యం ఉపాధి ఉండేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

# రాయదుర్గంలో హిట్ అండ్ రన్ కేసు

### ఒకు మృతి..మరొకరికి తీవ్ర గాయాలు

### ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి కుమారుడు సందీప్ అరెస్ట్

హైదరాబాద్ : హైదరాబాద్ రాయదుర్గంలో హిట్ అండ్ రన్ కేసు నమోదైంది. హిట్ అండ్ రన్ కేసులో ఒకరు మృతిచెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి కుమారుడు సందీప్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఓఆర్ఆర్ రోటరీ నుంచి ఖాజాగూడ గ్రామం వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నడుచుకుంటూ వెళ్తున్న నందులాలను ఇన్నోవా కార్ బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన వ్యక్తిని విద్యార్థి జైద్‌షా కద్రీ ఆస్పత్రికి తీసుకెళ్తుండా మరో ప్రమాదం జరిగింది. గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న విద్యార్థిని మరో కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో నందులాల అక్కడికక్కడే మృతిచెందగా.. విద్యార్థి జైద్‌షా కద్రీకి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన తర్వాత కారు యాజమాని వాహనాన్ని ఆపకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. వెంటనే అక్కడకు చేరుకున్న స్థానికులు.. విద్యార్థిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన రాయదుర్గం పోలీసులు.. కార్ యజమానిని గుర్తించారు. ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి కుమారుడు సందీప్.. కారు నడిపి ఒకరి మృతికి కారణమైనట్లు విచారణలో తేలింది. దీంతో కారును సీజ్ చేసిన పోలీసులు.. సందీప్‌ను అదుపులోకి తీసుకున్నారు.

### ప్రేమ విఫలమై కానిస్టేబుల్ ఆత్మహత్య

హైదరాబాద్,ఆగస్ట్31 : హైదరాబాద్‌లో దారుణం జరిగింది. అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఏఆర్ కానిస్టేబుల్ నిభాష్ ఆత్మహత్య చేసుకున్నాడు. లవ్‌ఫెయిల్యూర్‌నే బలవన్మరణానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ తిరుమలనగర్‌లో నివాసం ఉంటున్న నిభాష్ (25) పెట్లబుర్జులో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే ఆమె కుటుంబసభ్యులు పెళ్లికి నిరాకరించారు. దీంతో నిభాష్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలోనే రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకుముందు ఈ విషయాన్ని వాట్సాప్‌లో తన స్నేహితులకు సమాచారం అందించాడు. అయితే ఉదయం స్నేహితులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించగా.. నిభాష్ విగతజీవిగా కనిపించాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఆయిల్ పామ్ రైతుల భారీ నజరానా

### టన్ను గెలల ధర రూ.24,025కు పెరుగుదల

### ఆయిల్ పామ్ చరిత్రలో తొలిసారిగా పెంపు



హైదరాబాద్,సెప్టెంబర్1 : ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతుల పంట పండింది. ఆయిల్ పామ్ గెలల ధరలు మరోసారి రికార్డు స్థాయికి చేరాయి. టన్ను గెలల ధర రూ.24,025కు పెరిగింది. దేశంలో ఆయిల్ పామ్ సాగు చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక ధర ఇదేనని అధికారులు తెలిపారు. దీంతో ఆయిల్ పామ్ రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జూలై నెలలో టన్ను గెలలకు రూ.23,783 ధర అమలులో ఉండగా.. ఆగస్టు చివరి నాటికి మరో రూ.242 పెరిగి రూ.24,025కు చేరింది. పెరిగిన ధరను ఆగస్టు నెలకు వర్తింపజేయనున్నట్లు టీజీ ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్ రెడ్డి వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్లలో పామాయిల్ ధరల కదలికలు, ఉత్పత్తి పరిస్థితులు తదితర అంశాల ప్రభావంతో గెలల ధరల్లో మార్పులు చోటుచేసుకుంటుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇక గెలల ధర పెరగడమే కాకుండా రైతులకు చెల్లింపుల విషయంలోనూ ఆయిల్‌ఫెడ్ కీలక మైలురాయిని చేరింది. ఆగస్టు నెలలో గతంలో ఎన్నడూ లేనంతగా సుమారు రూ.175 కోట్లను ఆయిల్ పామ్ రైతులకు చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఒకే నెలలో ఇంత భారీ మొత్తాన్ని రైతులకు చెల్లించడం సంస్థ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిందన్నారు. ఆయిల్ పామ్ పంటకు సాధారణ పంటలతో పోలిస్తే దీర్ఘకాలిక పెట్టుబడి, నిర్వహణ అవసరమైనప్పటికీ.. గెలల ధరలు మెరుగ్గా ఉంటే రైతులకు స్థిరమైన ఆదాయం లభించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రికార్డు ధర నమోదవడం వల్ల సాగు విస్తీర్ణం పెంచుకోవాలనుకునే రైతుల్లోనూ ఆసక్తి పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ రంగ నిపుణులు భావిస్తున్నారు. తెలంగాణలో ఆయిల్ పామ్ సాగును విస్తరించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహక చర్యలు చేపడుతోంది. నీటి వసతి, నాట్లకు సంబంధించిన సహాయం, డ్రిప్ వంటి మౌలిక సదుపాయాలతో పాటు మార్కెటింగ్, ప్రాసెసింగ్ వ్యవస్థలను అభివృద్ధి చేయడం ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. పామాయిల్ దిగుమతులపై దేశం ఆధారపడటాన్ని తగ్గించడం, దేశీయంగా ఉత్పత్తిని పెంచడం కూడా ఆయిల్ పామ్ సాగు విస్తరణ వెనుక ఉన్న ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా అధికారులు చెబుతున్నారు. ఆయిల్ పామ్ గెలలకు రికార్డు ధర లభించడం తమకు ఎంతో ఊరటనిస్తోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగు ఖర్చులు, కూలీల వ్యయం, ఎరువులు, నీటి నిర్వహణ వంటి వ్యయాలు పెరుగుతున్న సమయంలో గెలలకు లభిస్తున్న మెరుగైన ధర ఆదాయాన్ని పెంచుతుందని చెబుతున్నారు. ధరలు ఇదే స్థాయిలో కొనసాగితే ఆయిల్ పామ్ సాగు మరింత ఆకర్షణీయంగా మారే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# భారత్‌కు మరిన్ని ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థ

### రష్యాతో డీల్ కుదుర్చుకోనున్న భారత్

న్యూఢిల్లీ,సెప్టెంబర్1 : 'ఆపరేషన్ సిందూర్'లో సమర్థవంతంగా పనిచేసిన రష్యన్ ఎస్–400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థలకు భారత్ మరోసారి కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వీటి అవసరాలు పెంచుకోవాలని భారత రక్షణశాఖ నిర్ణయించినట్లు సమాచారం. భారత వైమానిక దళం కోసం మరో ఐదు ఎస్–400 వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు జారీచేసిన టెండర్‌కు రష్యా స్పందించినట్లు సమాచారం. ఈ మేరకు 5 కొత్త వ్యవస్థలను భారత్‌కు విక్రయించేందుకు రష్యా అంగీకరించి నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత సైనిక వ్యవస్థలో 'సుదర్శన్'గా పిలుస్తున్న ఎస్–400.. గతేడాది ఆపరేషన్ సిందూర్‌లో అదరగొట్టింది. శత్రువుల వైపు నుంచి వచ్చిన ప్రమాదాలను విజయవంతంగా అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసిందని భారత రక్షణ వర్గాలు తెలిపాయి. ఎస్–400 పనితీరుకు సంబంధించి పశ్చిమ వైమానిక కమాండ్ అధిపతి ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా గతంలో ఓ పోడ్‌కాస్ట్‌లో కీలక విషయాలు వెల్లడించారు. పాకిస్థాన్ వైమానిక దళానికి చెందిన నిఘా విమానాన్ని 314 కి.మీ. దూరంలో ఎస్–400 కూల్చివేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంత దూరంలో భూమి నుంచి ప్రయోగించిన గగనతల రక్షణ క్షిపణి లక్ష్యాన్ని ఛేదించడం అత్యంత అరుదని నాడు రక్షణ రంగంలో చర్చ కూడా జరిగింది. ఎస్–400 అనేది ఒకే మిసైల్ కాదు. ఇందులో అత్యాధునిక రాడార్లు, కమాండ్ వ్యవస్థలు, వివిధ రకాల క్షిపణులు వంటి అనేక భాగాలుంటాయి. వీటిలోని కొన్ని క్షిపణులకు 400 కి.మీ. వరకు లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంటుంది. దీంతో శత్రు విమానాలు భారత గగనతలానికి చేరకముందే వాటిని గుర్తించి ఎదుర్కోగలవు. ఈ కారణంగానే భారత్ తన బహుళస్థాయి వైమానిక రక్షణ వ్యవస్థలో ఎస్–400కు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2018లో కుదిరిన తొలి ఒప్పందం ప్రకారం.. భారత్ మొత్తం 5 ఎస్–400 యూనిట్లను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందులో ఇప్పటివరకు 4 యూనిట్లు భారత్‌కు అందాయి. ఇంకో యూనిట్ నవంబర్ నాటికి అందే అవకాశముంది. తాజాగా మరో 5 యూనిట్ల కోసం భారత్ ఆసక్తి చూపుతోందని సమాచారం.

# హైదరాబాద్ రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి..

హైదరాబాద్ : హైదరాబాద్‌లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదం కేసులో ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్, టీటీడీ బోర్డు సభ్యుడు ఆనంద్ సాయి కుమారుడు సందీప్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో బీహార్‌కు చెందిన నందులాల్ అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) రోటరీ నుంచి ఖాజాగూడ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. రోడ్డు దాటుతున్న నందులాల్‌ను సందీప్ తన కారుతో అతివేగంగా ఢీకొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన జైద్ షా ఖాద్రీ అనే విద్యార్థి, క్షతగాత్రుడైన నందులాల్‌ను తన కారులో ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో మహీంద్రా కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ రెండో ప్రమాదంలో మరింత తీవ్రంగా గాయపడిన నందులాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన మహీంద్రా కారు ఆపకుండా అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న రాయదుర్గం పోలీసులు, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక నిపుణుల సహాయంతో ప్రమాదానికి కారణమైన రెండు వాహనాలను గుర్తించారు. అనంతరం రెండు కార్లను స్వాధీనం చేసుకుని, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయిని విచారించిన తర్వాత ఆయన కుమారుడు సందీప్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. పోలీసులు వెల్లడించిన తెలిపిన వివరాల ప్రకారం.. రాయదుర్గం పరిధిలోని ప్రధాన రహదారిపై నందులాల్ అనే వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా వేగంగా వచ్చిన ఇన్నోవా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నందులాల్ తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డుపై తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడి ఉన్న నందులాల్‌ను గమనించిన జైద్ షా ఖాద్రీ అనే విద్యార్థి వెంటనే స్పందించి.. అతడిని ఆసుపత్రికి తరలించేందుకు తన వాహనంలో ఎక్కించుకున్నాడు.అయితే నందులాల్‌ను ఆస్పత్రికి తరలించే క్రమంలో మరో అనూహ్య ప్రమాదం చోటుచేసుకుంది. వెనుక నుంచి వేగంగా వచ్చిన మహీంద్రా కారు.. వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో గాయపడిన నందులాల్ దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటనలో జైద్ షా ఖాద్రీకి కూడా తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదం తర్వాత మహీంద్రా కారు అక్కడ ఆగకుండా వెళ్లిపోయినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో స్థానికులు అక్కడికి చేరుకుని.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న రాయదుర్గం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి సంబంధించిన సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించడంతో పాటు సాంకేతిక ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో పాల్గొన్న వాహనాలను గుర్తించే దిశగా పోలీసులు చర్యలు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నందులాల్‌ను ఢీకొట్టిన ఇన్నోవా కారును గుర్తించిన పోలీసులు.. ఆ వాహనం సందీప్‌కు సంబంధించినదిగా నిర్ధారించారు. అనంతరం ప్రమాదానికి సంబంధించి సందీప్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఇన్నోవా కారును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

## రాహుల్ గాంధీపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

### దుర్మార్గ చర్యగా అభివర్ణించిన మంత్రి జూపల్లి

నాగర్ కర్నూల్,సెప్టెంబర్1 : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించడం కేంద్ర ప్రభుత్వ దుశ్చర్య అని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మత రాజకీయాలకు తెర లేపారని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి అవకాశాలు వచ్చిన సోనియాగాంధీ కుటుంబం తీసుకోలేదని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టినందుకు.. నిరసనగా ఈరోజు (మంగళవారం) నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం అంబేడ్కర్ చౌరస్తా వద్ద గంటసేపు రోడ్డుపై బైఠాయించి మంత్రి జూపల్లి కృష్ణారావు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడారు. రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర నిర్వహించి దేశ ప్రజలను చైతన్యం చేశారని మంత్రి జూపల్లి ప్రస్తావించారు. అలాంటి కుటుంబంపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయడం దుశ్చర్యగా భావిస్తున్నామని అన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. ఉత్తరప్రదేశ్‌లోని అల్ది హల్ద్వానిలోని ర్యాలీ వేదికను ఎక్కారని.. శుద్ధి చేసిన వారిపై కేసు నమోదు చేయకుండా.. ఆ విషయాన్ని ప్రశ్నించిన రాహుల్ గాంధీపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టడమేంటని ప్రశ్నించారు. 'మోదీ హటావో దేశ్‌కి బచావో.. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అని మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు.

# మిర్యాలగూడ బిఆర్ఎస్ రైతుర్యాలీకి అనుమతి నిరాకరణ

### ట్రాఫిక్ సమస్యలు ఏర్పడే అవకాశం ఉందన్న పోలీసులు

### గ్రౌండ్ లేదా, హాలు లాంటి చోట్ల అయితే అభ్యంతరం లేదని వెల్లడి

నల్లగొండ,సెప్టెంబర్1 : మిర్యాలగూడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన రైతు ర్యాలీ, బహిరంగ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యలను కారణంగా చూపుతూ కేటీఆర్ ర్యాలీ, మీటింగ్‌కు అనుమతి ఇవ్వలేమని తిరస్కరించారు. ఈనెల 3న మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి రాజీవ్ చౌక్ వరకు రైతు ర్యాలీ నిర్వహించడంతో పాటు రాజీవ్ చౌక్‌లో బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ర్యాలీకి అనుమతి కోరుతూ బీఆర్ఎస్ మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. వ్యవసాయ రంగం, సాగునీరు, విద్యుత్, యూరియా కొరత, రైతు భరోసా తదితర రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దరఖాస్తులో పేర్కొన్నారు. దీనిపై మిర్యాలగూడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి అనుమతి నిరాకరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే రాజీవ్ చౌక్ ప్రధాన కూడలి కావడంతో భారీ సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులు తరలివస్తే అన్ని వైపుల నుంచి ట్రాఫిక్ నిలిచిపోయే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. రాజీవ్ చౌక్‌కు వచ్చే రహదారులు ఇరుకుగా ఉండటంతో పాటు ఈ ప్రాంతంలో రోజంతా భారీగా వాహనాల రాకపోకలు సాగుతుంటాయని తెలిపారు. అక్కడ ట్రాఫిక్‌ను మళ్లించేందుకు తగిన ప్రత్యామ్నాయ మార్గాలు కూడా లేవని, వాహనాల పార్కింగ్‌కు సరిపడా స్థలం అందుబాటులో లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రోడ్లపై వాహనాలను నిలిపితే ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని తెలిపారు. మరోవైపు కోదాడ–జడ్చర్లను కలిపే జాతీయ రహదారి–167 రాజీవ్ చౌక్ మీదుగా వెళ్తుందని పోలీసులు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహిస్తే జాతీయ రహదారిపై కూడా రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాజీవ్ చౌక్ పరిసరాల్లో పలు ప్రభుత్వ, ఇతర ముఖ్య కార్యాలయాలు ఉన్నందున బహిరంగ సభ వల్ల వాటి సాధారణ కార్యకలాపాలకు ఇబ్బంది కలగవచ్చని పోలీసులు తెలిపారు. ర్యాలీ, సభకు అనుమతి ఇస్తే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొంటూ అనుమతిని తిరస్కరించారు. అయితే ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఇతర ప్రాంతాల్లో ఫంక్షన్ హాల్, గ్రౌండ్ వంటి ప్రదేశాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమం నిర్వహించు కునేందుకు అవకాశం కల్పిస్తామని పోలీసులు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

# ఆగస్టులో జీఎస్టీ వసూళ్ల జోరు..

### గతేడాదితో పోల్చితే 14.8 శాతం అధికం

### తాత్కాలిక గణాంకాలు విడుదల

న్యూఢిల్లీ,సెప్టెంబర్1 : దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా వృద్ధి చెందుతున్నదనడానికి సంకేతంగా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి ఆశాజనకంగా నమోదయ్యాయి. ఆగస్టు నెలకు గాను జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికి రూ.1,99,853 కోట్ల భారీ ఆదాయం సమకూరింది. గతేడాది ఇదే నెలతో పోలిస్తే ఇది 14.8 శాతం అధికం. ముఖ్యంగా దిగుమతులపై పన్నుల వసూళ్లు గణనీయంగా పెరగడమే ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది. ఈ మేరకు నేడు కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక గణాంకాలను విడుదల చేసింది. గత ఏడాది ఆగస్టులో జీఎస్టీ వసూళ్లు రూ.1,74,116 కోట్లుగా ఉండగా, ఈసారి దాదాపు రూ.2 లక్షల కోట్ల మార్కుకు చేరువయ్యాయి. అయితే, ఈ ఏడాది జులైలో నమోదైన రూ.2.11 లక్షల కోట్లతో పోలిస్తే ఆగస్టు వసూళ్లు కొంత తక్కువగా ఉన్నాయి. ఈ వృద్ధిలో దిగుమతుల నుంచి వచ్చిన జీఎస్టీ కీలక పాత్ర పోషించింది. దిగుమతులపై స్థూల జీఎస్టీ ఆదాయం ఏకంగా 29 శాతం పెరిగి రూ.62,604 కోట్లకు చేరింది. మరోవైపు, దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన జీఎస్టీ కూడా 9.3 శాతం వృద్ధితో రూ.1,37,249 కోట్లుగా నమోదైంది. అదే సమయంలో ఆగస్టు నెలలో ప్రభుత్వం చెల్లించిన రిఫండ్‌లు కూడా భారీగా పెరిగాయి. గతేడాదితో పోలిస్తే రిఫండ్‌లు 67.9 శాతం పెరిగి రూ.31,795 కోట్లకు చేరాయి. దీంతో రిఫండ్‌లను మినహాయించిన తర్వాత ప్రభుత్వానికి అందిన నికర జీఎస్టీ ఆదాయం రూ.1,68,057 కోట్లుగా ఉంది. ఇది గతేడాది నికర ఆదాయంతో పోలిస్తే 8.3 శాతం మాత్రమే ఎక్కువ. నికర వసూళ్లను విశ్లేషిస్తే.. కస్టమ్స్ జీఎస్టీ ఆదాయం 22.3 శాతం వృద్ధితో రూ.49,299 కోట్లకు చేరగా, దేశీయ నికర జీఎస్టీ వసూళ్ల వృద్ధి మాత్రం కేవలం 3.4 శాతానికే పరిమితమై రూ.1,18,759 కోట్లుగా నమోదైంది. దేశీయంగా రిఫండ్‌లు ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఈ గణాంకాలు వెలువడిన నేపథ్యంలో సెప్టెంబర్ 12న న్యూఢిల్లీలో 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరగనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశానికి ఒకరోజు ముందు, అంటే సెప్టెంబర్ 11న అధికారుల స్థాయి సమావేశం కూడా జరగనున్నట్లు జీఎస్టీ కౌన్సిల్ సెక్రటేరియట్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

# ఢిల్లీ మార్చ్‌ను ఉపసంహరణ

### ప్రభుత్వ హామీతో సీజేపీ నిర్ణయం

న్యూఢిల్లీ,సెప్టెంబర్1 : కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 5న ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు నిర్వహించ తలపెట్టిన నిరసన యాత్రను విరమించుకుంటున్నట్లు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సానుకూల హామీలు ఇచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ మంగళవారం సర్వోన్నత న్యాయస్థానానికి వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, నీట్ వివాదం కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల కాలపరిమితిలోగా పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, జులై 20 నుంచి 25 మధ్య కాలంలో నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను తదుపరి విచారణకు తీసుకెళ్లబోమని, కొత్త కేసులు నమోదు చేయబోమని స్పష్టం చేశారు. గతంలో సీజేపీకి ఇచ్చిన హామీలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన కోర్టుకు విన్నవించారు. ప్రభుత్వ హామీలపై సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ స్పందిస్తూ, "కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సానుకూల హామీలకు, వాటికి లభించిన న్యాయపరమైన భరోసాకు అనుగుణంగా సెప్టెంబర్ 5న తలపెట్టిన మార్చ్‌ను ఉపసంహరించుకోవడమే సముచితమని భావిస్తున్నాం. న్యాయస్థానం జారీ చేసిన తాజా ఉత్తర్వులకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు. నీట్–యూజీ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో నిరసనకారులపై నమోదైన కేసులను ఎత్తివేస్తామని జులై 25న ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ సీజేపీ ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. కాగా, సీజేపీ తాజాగా తీసుకున్న నిరసన రద్దు నిర్ణయాన్ని జస్టిస్ సూర్యకాంత్ 'మంచి పరిణామం'గా అభివర్ణిస్తూ ప్రశంసించారు.

## సంపాదకీయం

### మరోమారు సిజెపి

# ఆందోళన!

కాక్రోచ్ జనతా పార్టీ మరో ఆందోళనకు సిద్ధమవుతోంది. కేంద్రం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీజేపీ సెప్టెంబర్ 5న ఈ మార్చ్ చేపడుతోంది. గతంలో ఢిల్లీలో జరిగిన ఆందోళన సందర్భంగా కేసుల ఎత్తివేత, విద్యార్థులకు పరిహారం వంటి హామీలను కేంద్రం ప్రకటించింది. ఇదే సందర్భంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అయితే హామీలు అమలు చేయాలని గతకొంత కాలంగా సిజెపి డిమాండ్ చేస్తూనే ఉంది. సెప్టెంబర్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన మార్చ్‌ను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు ఈ మార్చ్ నిర్వహించనున్నట్లు సీజేపీ ప్రకటించింది. ప్రస్తుతం ఈ అంశంలో న్యాయపరంగా జోక్యం చేసుకోవాల్సి నంత అత్యవసర పరిస్థితి లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే నిరసన సందర్భంగా ప్రతి ఒక్కరూ శాంతియుతంగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఈ క్రమంలో మరోమారు ఆందోళన చేస్తే ఢిల్లీలో ఉద్రిక్తతలు నెలకొంటాయని, మార్చ్‌కు అనుమతి నిరాకరించాలని రిటైర్డ్ పోలీస్ అధికారి సుప్రీంను ఆశ్రయించారు. సెప్టెంబర్ 5న జరగనున్న నిరసన మార్చ్ శాంతిభద్రతలు, విధానపరమైన అంశాలతో ముడిపడి ఉందని సీజేఐ సూర్యకాంత్ తెలిపారు. వీటిని సంబంధిత శాంతిభద్రతల సంస్థలు, ఇతర భాగస్వాములు పరిష్కరించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం కోర్టు జోక్యం చేసుకోవాల్సిన బలమైన కారణాలు కనిపించడం లేదని స్పష్టం చేశారు. రిటైర్డ్ ఢిల్లీ పోలీస్ అధికారి రాజేంద్ర సింగ్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జూలై 20న జంతర్ మంతర్ దగ్గర జరిగిన సీజేపీ నిరసన సందర్భంగా గాయపడిన పోలీసు సిబ్బందికి పరిహారం చెల్లించాలని, ప్రభుత్వ ఆస్తులకు జరిగిన నష్టాన్ని బాధ్యుల నుంచి వసూలు చేయాలని పిటిషన్‌లో కోరారు. పార్లమెంట్, ఇతర కీలక ప్రభుత్వ సంస్థలకు సమీపంలో నిర్వహించే నిరసనలకు సంబంధించి ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించాలని పిటిషనర్ కోరారు. నిరసనలు నిర్వహించకూడని ప్రాంతాలు లేదా రక్షిత ప్రాంతాలను సహేతుకమైన పరిధిలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విచారణ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది ఈ అంశానికి సంబంధించిన అనేక విషయాలను ఇంకా పరిశీలించాల్సి ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే ప్రతి అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలించలేదని సీజేఐ స్పష్టం చేశారు. ముందుగానే దీనిపై ఎలాంటి నిర్ణయాలు ప్రకటించ లేమని సుప్రీం స్పష్టం చేసింది. అలాగే నిరసనలకు సంబంధించిన అంశాలను పరిశీలించేందుకు సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన హై పవర్డ్ కమిటీని ఆశ్రయించాలని సీజేఐ సూచించారు. అన్ని అంశాలను మేము పరిశీలించలేం. ప్రతి విషయంపైనా వ్యాఖ్యానించం. మేము ఏర్పాటు చేసిన హై పవర్డ్ కమిటీని ఆశ్రయిం చండని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఒక్కో అంశాన్ని కమిటీ పరిశీలించి తమ అభిప్రాయాలను కోర్టుకు సమర్పిస్తుందని తెలిపారు. ఈ కమిటీని సీజేఐ 'తటస్థ అంపైర్'గా అభివర్ణించారు. నిరసనలకు సంబంధిం చిన విస్తృత విధానపరమైన, శాంతిభద్రతల అంశాలపై సంబంధిత వర్గాలు చర్చించు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 5న ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు సీజేపీ తాజా నిరసన మార్చ్ నిర్వహించనున్నట్లు కోర్టుకు తెలియజేశారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరగనున్న విషయాన్ని పిటిషనర్ సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విదేశీ ప్రముఖులు ఢిల్లీకి రానున్న నేపథ్యంలో భద్రతా పరమైన ఆందోళనలు ఉన్నాయని, అందువల్ల నిరసన మార్చ్‌ను బ్రిక్స్ సదస్సు పూర్తయ్యే వరకు వాయిదా వేయాలని ఆయన వాదించారు. అయితే సీజేఐ స్పందిస్తూ.. 'ఇవి శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలు. నిర్ణయం శాంతిభద్రతల సంస్థలే తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా వ్యవహరిస్తారని మేము విశ్వసిస్తున్నాం, ఆశిస్తున్నాం. ప్రస్తుతానికి మేము జోక్యం చేసుకోవడానికి బలమైన కారణాలు కనిపించడం లేదని పేర్కొన్నారు. ఒకవేళ నిరసన సందర్భంగా ఏదైనా అవాంఛనీయ లేదా ఆందోళనకర ఘటన చోటుచేసుకుంటే.. పిటిషనర్ కొత్తగా దరఖాస్తు చేసుకుని కోర్టును ఆశ్రయించవచ్చని సీజేఐ తెలిపారు. ఈ కేసును నిరసనలు, వాటికి సంబంధించిన ఇతర అంశాలపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పిటిషన్లతో కలిపి తదుపరి విచారణకు తీసుకోవాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. మొత్తంగా ఇప్పుడు సెప్టెంబర్ 5 మరోమారు చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీలో ర్యాలీతో నిజంగానే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందా అన్నదే ప్రశ్న. ఎందుకంటే గత ఆందోళనలో అసాంఘిక శక్తులు చేరాయి. ఖలిస్తాన్, ఇస్లామిక్ ఉగ్రవాదులు చేరారన్న సమాచారం ఇంటిలిజెన్స్ వద్ద ఉంది. ఈ క్రమంలో ఢిల్లీ పోలీసులు తీసుకునే నిర్ణయం కీలకం కానుంది.

# లయ తప్పిన హిమాలయం



నేపాల్‌లో సంభవించిన విపత్తు, ఎగువ అసోంలో ఎన్నడూ లేనంత స్థాయిలో వచ్చిన వరదలు.. అభివృద్ధి, పర్యావరణ పరిమితులు, విపత్తులను ఎదుర్కొనే సన్నద్ధత మధ్య ఉన్న ప్రమాదకరమైన అంతరాన్ని స్పష్టంగా బయటపెడు తున్నాయి. ఆగస్టు 26న హిమాలయ ప్రాంతంలో హిమానీనదం కూలిపోవడం, భారీ ఆకస్మిక వరదల కారణంగా నేపాల్‌ను కుదిపేసిన ఈ ఘోర విపత్తును కేవలం ఓ సుదూర పర్వత దేశం లో జరిగిన మరో విషాద ఘటనగా చూడకూడదు. ఇది మొత్తం హిమాలయ పర్వతశ్రేణికి, ముఖ్యంగా అసోం, బ్రహ్మపుత్ర లోయకు వచ్చిన హెచ్చరికగా పరిగణించాలి. నేపాల్, దానికి ఆనుకుని ఉన్న టిబెట్ ప్రాంతాల్లో రాళ్లు, మంచు, బురద, నీటితో కూడిన వరద ప్రవాహాలు జనావాసాలు, మౌలిక వసతులను ముంచెత్తడంతో కనీసం 800 మంది మరణించినట్లు, దాదాపు 1,000 మంది ఆచూకీ లేకుండా పోయినట్లు సమాచారం. హిమపాతం కారణంగా ఏర్పడిన బురద ప్రవాహం, హిమానీనదాల్లో అస్థిరత ఈ విపత్తుకు కారణాలుగా భావిస్తున్నారు. దీనికి తోడు వాతావరణ మార్పులు హిమాలయ పర్యావరణాన్ని మరింత బలహీనంగా మార్చుతున్నాయి. ఈ హెచ్చరికను ఈ ఏడాది ఎగువ అసోంను ముంచెత్తిన అసాధారణ వరదలతో కలిపి చూసినప్పుడు పరిస్థితి మరింత తీవ్రంగా కనిపిస్తుంది. తరతరాలుగా అసోం వరదలను ఎదుర్కొంటూనే ఉంది. బ్రహ్మపుత్ర, దాని ఉపనదుల సహజ ప్రవాహ చక్రంలో వరదలు ఒక భాగమే. అయితే 2026 జులై–, ఆగస్టులో ఎగువ అసోంను ముంచెత్తిన విపత్తు మాత్రం భిన్నమైనది. శివసాగర్, చరైడియో, జోర్హాట్, చుట్టుపక్కల ప్రాంతాలు.. దశాబ్దాలుగా ఇంతటి తీవ్రతతో వరదలను చూడని ప్రాంతాలు ఒక్కసారిగా నీట మునిగాయి. చాశ్రీంశీ =ముఎ – భగవత్ 'సామరస్య' స్వరం చాఎజవతీఅంవఎవత్ వరదలు సహజమే. కానీ విపత్తు ఎప్పుడూ సహజమైనది కాదు. హిమానీనదాలు క్రమంగా కరిగిపోతున్న కొద్దీ హిమ సరస్సుల పరిమాణం పెరగవచ్చు. వాటిని అడ్డుకునే మొరైన్ కట్టలు అస్థిరంగా మారే అవకాశం ఉంటుంది. కొండచరియలు విరిగిపడటం, మంచుచరియలు విరుచుకుపడటంవల్ల భారీ పరిమాణంలో నీరు ఒక్కసారిగా కిందికి దూసుకురావచ్చు. జిఎల్ఓఎఫ్‌లు (గ్లేషియల్ లేక్ ఔట్‌బర్స్ట్ ఫ్లడ్స్) అంటే హిమసరస్సుల కట్టలు తెగిపోవడం వల్ల సంభవించే ఆకస్మిక వరదలు. ఇవి అత్యంత వేగంగా దిగువ ప్రాంతాలకు చేరుకుని జనావాసాలు, మౌలిక వసతులను ధ్వంసం చేయగలవు. దిగువ ప్రాంతాల్లో చేపట్టే ప్రణాళికల్లో ఇలాంటి ప్రమాదాలను కూడా తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని ఐసిఐఎంఒడి (ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటెన్ డెవలప్‌మెంట్) ప్రత్యేకంగా హెచ్చరిస్తోంది. ఈ హెచ్చరిక మానవ జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపగలదో నేపాల్ తాజాగా ప్రత్యక్షంగా చూపించింది. మరిన్ని కనుగొనండి ఐఅఖఌశీఝతీఅవం ఞ ఝఅఎఐఎశ్రీశీఝావఎఞఝం తెలంగాణ వార్తా కవరేజ్ చీవఓంఝఞ్ఝావతీం చాశ్రీంశీ =ముఎ – మాటలు సరే.. చేతలే కరువు ఇది అసోం ముందు నిలిచే అత్యంత అసౌకర్యకరమైన ప్రశ్నకు మనల్ని తీసుకెళ్తోంది: హిమాలయాలు, హిమాలయాల దిగువ ప్రాంతాల్లో జలవిద్యుత్ ప్రాజెక్టుల విస్తరణ. అరుణాచల్‌ప్రదేశ్‌కు అపారమైన జలవిద్యుత్ సామర్థ్యం ఉంది. ఒకే నదీ పరీవాహక ప్రాంతంలో పది, ఇరవై, ముప్పై ప్రాజెక్టులు నిర్మిస్తే.. మొత్తం పరీవాహక ప్రాంతాన్నీ ఇంజినీరింగ్ చేసిన తర్వాత ఆ నదికి ఏమవుతుంది? అన్న ప్రశ్న తలెత్తుతుంది. అసోం ఎన్నో ఏళ్లుగా ఇదే ప్రశ్నను లేవనెత్తుతోంది. దీనికి శాస్త్రీయ సమాధానం లభించాల్సిన అవసరం ఉంది. విద్యుత్‌ను ఎవరు పొందుతున్నారు? ఆ విద్యుత్ కోసం ముప్పును ఎవరు భరిస్తున్నారు? మరిన్ని కనుగొనండి తాజా వార్తలు సేవ లైఫ్ స్టైల్ ఎడిటోరియల్ వ్యాసాలు చాశ్రీంశీ =ముఎ – డాలర్‌కు 'బ్రిక్స్' చెక్స్? చాఎజవతీఅంవఎవత్ హిమాలయ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన రాజకీయ, ఆర్థిక కోణం కూడా మరో అసౌకర్యకరమైన అంశాన్ని ముందుకుతెస్తోంది. అయితే వీటి ఆర్థిక ప్రయోజనాలు ప్రభుత్వాలు, కంపెనీలు, కాంట్రాక్టర్ల వంటి వర్గాల మధ్య కేంద్రీకృతమయ్యే అవకాశం ఉండగా.. పర్యావరణపరమైన నష్టాలు మాత్రం దిగువ ప్రాంతాల్లో నివసించే కోట్లాది ప్రజలపై పడతాయి. ఈ అసమతౌల్యాన్ని విస్మరించలేం. అయితే నిర్దిష్ట విపత్తు వల్ల ఏదైనా రాజకీయ నాయకుడు లేదా కంపెనీ వ్యక్తిగతంగా లాభపడిందని ప్రాజెక్టుకు సంబంధించిన ఆధారాలు లేకుండా ఆరోపించడం బాధ్యతారాహిత్యమే. కానీ హిమాలయ మౌలిక వసతుల అభివృద్ధి చుట్టూ ఉన్న రాజకీయ, వాణిజ్య ప్రోత్సాహకాలు.. దిగువ ప్రాంతాల ప్రజలను రక్షించాలన్న ప్రోత్సాహకాల కంటే బలంగా ఉన్నాయా? అని ప్రశ్నించడం మాత్రం పూర్తిగా సమంజసం. ఒక ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో వేల కోట్ల రూపాయల ఆర్థిక విలువను సృష్టించి.. ఎగువ ప్రాంతాలనుంచి నీటిని విడుదల చేసిన తర్వాత నీటిమట్టాలు వేగంగా పెరిగితే.. దిగువ ప్రాంతాల్లో ఎంత త్వరగా ఆందోళన తలెత్తుతుందో ఇటీవలి పరిణామాలు చూపించాయి. 2026 ఆగస్టులో బొంగైగావ్, చిరాంగ్ జిల్లాల అధికారులు అప్రమత్తత హెచ్చరికలు జారీ చేశారు. మరి ఏం మారాలి? మొదటిది: హిమాలయాలను అంతులేని నిర్మాణ ప్రాంతంగా చూడటం ఆపాలి. కొత్త రహదారులు, సొరంగాలు, గనులు, ఆనకట్టలు, పట్టణాలు, విద్యుత్ ప్రసార మార్గాలకు అనుమతులు ఇచ్చే ముందు ఆ ప్రాంతం ఎంతవరకు నిర్మాణాలను తట్టుకోగలదో కచ్చితంగా అంచనా వేయాలి. రహదారులు, సొరంగాలు, విద్యుత్ ప్రసార మార్గాలు, గనులు, నివాస ప్రాంతాలు ఏర్పడితే.. వాటి సమష్టి ప్రభావం పూర్తిగా భిన్నంగా ఉండవచ్చు. అందువల్ల నదీ పరీవాహక ప్రాంతం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుని పర్యావరణ ప్రభావ అంచనాను తప్పనిసరి చేయాలి. అసోంకు నిజమైన ఎగువ–దిగువ ప్రాంతాల ముందస్తు హెచ్చరిక వ్యవస్థ ఉండాలి. వర్షపాతం కొలిచే కేంద్రాలు, ఉపగ్రహ పరిశీలనలు, వాతావరణ రాడార్లు, నదీ ప్రవాహాన్ని కొలిచే గేజ్‌లు, ఆనకట్టల జలాశయాల సమాచారం, కొండచరియల కదలికలను గుర్తించే సెన్సర్లు, హిమ సరస్సుల ఆకస్మిక వరదల (జిఎల్ఓఎఫ్) పర్యవేక్షణ వ్యవస్థలు.. ఇవన్నీ ఒకే నిజసమయ వేదికకు అనుసంధానం కావాలి.

## తదుపరి అమెరికా అధ్యక్షుడు ఎవరు?

### తెరపైకి రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు

### ఇప్పుడే అలాంటి చర్చ అవసరం లేదన్న ట్రంప్

వాషింగ్టన్,సెప్టెంబర్1 : అమెరికా తదుపరి అధ్యక్షుడిగా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు తెరపైకి వస్తున్న వేళ డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2028 ప్రెసిడెంట్ ఎలక్షన్స్‌లో పోటీచేసే అవకాశాలపై మాట్లాడిన అగ్రరాజ్య అధ్యక్షుడు.. ఆ విషయమై ఇప్పుడే చర్చ అక్కర్లేదని సమాధానాన్ని దాటవేశారు. 'హెగ్సెత్ అద్భుతంగా పనిచేస్తున్నారు. అయితే ఇలాంటి విషయాల గురించి మాట్లాడేందుకు ఇది తొందరపాటు చర్య అవుతుంది. ముందుగా నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికలను పూర్తి చేయాలి' అని ట్రంప్ అన్నారు. యూఎస్ ప్రెసిడెంట్‌గా రెండు పర్యాయాలు మాత్రమే కొనసాగే అవకాశమున్న ట్రంప్.. 2029లో ఆ పదవి నుంచి తప్పుకోనున్నారు. దీంతో ఆయన 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' ఉద్యమాన్ని ముందుకు నడిపించే తదుపరి నేత ఎవరన్న దానిపై రిపబ్లికన్ పార్టీలో చర్చ జోరందుకుంది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్లు ఇప్పటికే వినిపిస్తున్నా.. తాజాగా ఆ లిస్ట్‌లో హెగ్సెత్ కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు ఇటీవల ఐయోవా స్టేట్ ఫెయిర్‌లో రిపబ్లికన్ల తరఫున హెగ్సెత్ ప్రచారం చేయడం ఈ ఊహాగానాలకు బలం చేకూర్చినట్లైంది. అయితే ఈ వార్తలను హెగ్సెత్ ఖండించారు. అవి '100 శాతం అవాస్తవం' అని సోషల్ మీడియాలో పేర్కొన్నారాయన. హెగ్సెత్ గతంలో ఆర్మీ నేషనల్ గార్డ్‌లో పనిచేశారు. అనంతరం ఫాక్స్ న్యూస్ ఛానల్‌లో టీవీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ప్రస్తుతం ట్రంప్ ప్రభుత్వంలో రక్షణ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఆయన రాజకీయ భవితవ్యంపై ట్రంప్ మరింత ఆసక్తికరంగా స్పందించారు. 'ప్రస్తుతం ఆయనకు సైన్యం, సైనికుల సంక్షేమం తప్ప మరేదీ ముఖ్యం కాదు' అని వ్యాఖ్యానించారు. మరోవైపు 2028 అధ్యక్ష ఎన్నికల కోసం పలువురు నేతలు ఇప్పటికే అంతర్గతంగా సన్నాహాలు ప్రారంభించి ఉండొచ్చని ట్రంప్ చెప్పారు. ఏది ఏమైనా ట్రంప్ వారసుడిగా అధికారికంగా ఎలాంటి నిర్ణయం ప్రకటించనప్పటికీ.. జేడీ వాన్స్, మార్కో రూబియో, హెగ్సెత్ వంటి పేర్లు వినిపిస్తుండటం రిపబ్లికన్ పార్టీలో 2028 పోరుపై ఆసక్తి రేపుతోంది.

## కనకదుర్గమ్మకు బంగారు జడ సమర్పణ

విజయవాడ,సెప్టెంబర్1 : ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మకు ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ప్రత్యేక కానుక సమర్పించారు. సుమారు రూ.11 లక్షల విలువైన బంగారు జడను అమ్మవారికి సమర్పించారు. దాదాపు 130 నుంచి 160 గ్రాముల బంగారంతో సంప్రదాయ శైలిలో రూపొందించిన ఈ ఆభరణంలో లక్ష్మీదేవి, ఇతర దైవిక రూపాలతో పాటు ఆకుపచ్చ రాళ్లు, ముత్యాలను అలంకరించారు. అమ్మవారి పట్ల తన భక్తిని చాటుతూ ఈ కానుకను సమర్పించినట్లు చెప్పారు.


## రష్యా సైన్యంలో 51మంది భారతీయులు మృతి

### విదేశాంగ శాఖ సెక్రటరీ విక్రమ్ మిశ్రీ వెల్లడి

న్యూఢిల్లీ,సెప్టెంబర్1 : రష్యా సైన్యంలోని 51 మంది భారతీయులు మరణించారని విదేశాంగ శాఖ సెక్రటరీ విక్రమ్ మిశ్రీ వెల్లడించారు. మొత్తం 227 మంది రష్యాలో సైన్యంలో చేరగా ఇప్పటివరకూ 139 మంది బయటకు వచ్చేశారని అన్నారు. మిగిలిన వారినీ వెనక్కు తీసుకొచ్చేందుకు రష్యాతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కిర్గిస్థాన్ పర్యటన నేపథ్యంలో సోమవారం మీడియా అడిగిన ప్రశ్నలకు విదేశాంగ శాఖ సెక్రటరీ ఈ వివరాలను వెల్లడించారు. ఈ అంశంలో రష్యాతో వివిధ స్థాయిల్లో చర్చలు జరుగుతున్నాయని మిశ్రీ చెప్పారు. మాస్కోలోని భారతీయ ఎంబసీ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ భారతీయులను వెనక్కు రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. భారతీయులు త్వరగా సైన్యం నుంచి డిశ్చార్జ్ అయ్యేలా రష్యా చర్చలు తీసుకోవాలని కోరినట్టు చెప్పారు. రష్యా–భారత్ వాణిజ్యం గురించి కూడా మిశ్రీ మాట్లాడారు. గతేడాది భారత్‌లో రష్యన్ దిగుమతిదారుల సమావేశంలో అక్కడి సంస్థలు ఉత్సాహంగా పాల్గొన్నాయని చెప్పారు. భారత్ నుంచి దిగుమతులను పెంచేందుకు ఉత్సుకత ప్రదర్శించాయని చెప్పారు. తదుపరి రష్యాలో జరుగనున్న సమావేశంలో భారతీయ ఎగుమతిదారుల ఫోరం సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఈ విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ సానుకూలంగా స్పందించారని అన్నారు. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ ఇటీవల కిర్గ్ రిపబ్లిక్ దేశ పర్యటనకు వెళ్లారు. ఈ క్రమంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కూడా సమావేశం అయా

## సత్యానికి ఓటమి తాత్కాలికమే !

తిరుమల : సత్యానికి తాత్కాలిక ఓటమి ఉంటుంది. అయితే శాశ్వత కీర్తిని మాత్రం పొందుతుంది. మన పురాణాలు, ఇతిహాసాలు, వేదాలు ఇదే చెబుతున్నాయి. సత్యం మరచిన వారు సమాజంలో అరచకాలకు పాల్పడతారు. సత్యం,ధర్మాలను మనం ఆచరిస్తే అవి మనలను కాపాడుతాయి. అందుకే ఈ రెంటినీ విడవకుండా జీవనం సాగించాలి. మహాభారతంలోని ఉద్యోగ పర్వంలోసత్యం, ధర్మం తెలిసి కూడా ఆచరణలో పెట్టలేని కౌరవులకు మళ్లీ ఒకసారి గుర్తు చేయడానికే కూర్చబడినట్టు పండితులు చెబుతారు. కృష్ణపరమాత్మ కౌరవ పాండవుల మధ్య సంధి చేయ కౌరవ సభకు వచ్చి యుద్ధం నివారింప బడాలని చెబుతూ పాండవులు అయిదుగురికి ఐదు ఊర్లు ఇచ్చినా సంతృప్తిపడ తారని కౌరవులకు నచ్చజెప్ప ప్రయత్నించాడు. అయినా కౌరవులు పరమాత్ముని వచనాలు పెడచెవిన బెట్టడమేగాక కృష్ణ భగవాణున్ని సామాన్యునిగా భావించి బంధించ ప్రయత్నించారు. అసత్యపరులు అహంకారులు తనను తెలుసుకోలేని అజ్ఞానులని భావించిన భగవానుడు తన విశ్వ రూపాన్ని ప్రదర్శించి తనెవరో తెలియజేసాడు. ప్రస్తుత కాలంలో విజ్ఞానపరంగా మనం ఎంతో అభివృద్ధిని సాధించాం. సాధిస్తున్నాం కూడా! కానీ సత్యం, న్యాయం, ధర్మం వంటి వాటిపై శ్రద్ధ చూపడం లేదనేది ముమ్మాటికి నిజం. సత్య ధర్మాలపై అశ్రద్ధ కారణంగానే మనం ప్రకృతి వైపరీత్యా లకు గురవుతున్నాం. ప్రాణాలను పణంగా పెట్టుకుంటున్నాం. ఇకనైనా మనం మేలుకొని సత్యంతో కూడిన ఆలోచనలు, ఆచర ణలు ఆచరించ ప్రయత్నిద్దాం. సత్యంలోనే భగవంతుడున్నాడని నమ్మడంతో పాటు ఆచరణలోకి తేవాలి. అప్పుడే మనిషి సుఖశాంతులతో జీవించగలడు.



ఆధ్యాత్మికం

# ఆర్‌అండ్‌బీ పనులను మార్చి నాటికి పూర్తి చేయాలి

- అన్ని మండలాల్లో జరుగుతున్న రహదారి పనులను వేగవంతం చేయాలి
- ఆర్‌అండ్‌బీ పనుల పురోగతిపై ఏఈలు, డీఈలతో సమీక్షించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి ప్రతినిధి :** జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వచ్చే మార్చి నెలలోగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఆర్‌అండ్‌బీ శాఖ పనులపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని మండలాల్లో జరుగుతున్న రహదారులు, భవనాలు, ఇతర ఆర్‌అండ్‌బీ పనుల పురోగతిని మండలాల వారీగా సమీక్షించారు. పనులు ప్రారంభం కానివి, వివిధ దశల్లో ఉన్నవి, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాలో చేపడుతున్న అన్ని ఆర్‌అండ్‌బీ పనులను వేగవంతం చేసి మార్చి నెలలోగా పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటూ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం పనులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, పనుల పురోగతి, నాణ్యత, బిల్లుల చెల్లింపులను సమర్థవంతంగా పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి పనికి సంబంధించి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను



గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి మండలంలో చేపడుతున్న ఆర్‌అండ్‌బీ పనులకు సంబంధించి నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ప్రారంభం కాని పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, వివిధ దశల్లో ఉన్న పనులను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయడంతో పాటు ప్రజలకు ఉపయోగపడే విధంగా నాణ్యతతో కూడిన రహదారులు, భవనాలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈ ఈ భావ్ సింగ్, ఏఈలు, డీఈలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఘనంగా ప్రారంభం

- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పనులను వేగవంతం చేయవచ్చు
- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి

**కరీంనగర్ టౌన్, ఆగస్టు31:** ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ద్వారా పనులను వేగవంతం చేయవచ్చుని, నిఘా సైతం పెట్టి వ్యక్తుల యొక్క పనిచేసే విధానాన్ని తెలుసుకోవచ్చుని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లి లోని ఆద్యా క్యాంపస్ లో అల్ఫోర్స్ ఆర్టిఫిషియన్ ఇంటెలిజెన్స్ ప్రారంభోత్సవ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతు ఆర్టిఫిషియన్ ఇంటెలిజెన్స్ వలన మానవాళికి ఎన్నో లాభాలు ఉంటాయని కావున ప్రతి ఒక్కరూ దీనిని సరియైన పద్ధతిలో ఉపయోగించుకోవాలని మరియు విజయాలను సొంతం చేసుకోవాలని చెప్పారు. వివిధ రకాల పనులు చాలా త్వరగా పూర్తి చేయవచ్చని ప్రధానంగా సమయాన్ని సైతం వృధా కాకుండా చేసుకుంటామని వారు చెప్పారు. తక్కువ సమయంలో పనులను పూర్తి చేస్తుందన్న ఖర్చు సైతం తక్కువగా ఉంటుందని వారు చెప్పారు. విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ని సరైన పద్ధతిలో ఉపయోగించుకోవాలని వివిధ రకాల విషయాలకు సమాచాన్ని ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ద్వారా సేకరించవచ్చుని, పనులను వేగవంతం చేయవచ్చని ప్రతి ఒక్కరికి దీని మీద అవగాహన ఉండాలని తెలిపారు. కళాశాలలో నిర్వహిస్తున్నటువంటి వివిధ పరీక్షలకు సంబంధించినటువంటి విశ్లేషణ ఆర్టిఫిషియన్ ఇంటెలిజెంట్ ద్వారా తెలుసుకోవచ్చని తెలంగాణ రాష్ట్రంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల ప్రథమంగా ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్‌ని ప్రవేశపెట్టినట్లు హర్షం వ్యక్తం చేశారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు కీలకమైన సమాచారం ఇవ్వడంలో ఆర్టిఫిషియన్ ఇంటెలిజెన్స్ వ్యవహరిస్తుందని తెలుపుతూ ప్రధానంగా ఐఐటి, నీట్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు గొప్ప వరం లాంటిదని అభివర్ణించారు. మన భారతదేశంలో కూడా ప్రతి ఒక్కరు ఆర్టిఫిషియన్ ఇంటెలిజెన్స్‌ని చక్కగా ఉపయోగించుకొని అభివృద్ధికి సహకరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, సాఫ్ట్వేర్ ప్రతినిధులు విష్ణు, ముఖేష్ రెడ్డి, కృష్ణారెడ్డి, సదాచారి, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.






# ఫ్యూచర్ సిటీలో విలీనం చేస్తేనే మహేశ్వరం అభివృద్ధి చెందుతుంది

- రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలిపిన ప్రింట్ అండ్ ,ఎలక్ట్రానిక్ మీడియా
- నిమ్మరసమిచ్చి దీక్ష విరమింప చేసిన రిటైర్డ్ ప్రొఫెసర్ నరసింహారావు

**మహేశ్వరం సెప్టెంబర్ 01,:** ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం ప్రాంతాన్ని విలీనం చేస్తేనే అభివృద్ధిలో ముందుకు వెళుతుందని ఫ్యూచర్ సిటీ జేఏసీ కమిటీ చైర్మన్ వత్తుల రఘుపతి పేర్కొన్నారు. మహేశ్వరం మండల తహసిల్దార్ కార్యాలయం ముందు రెండు రోజులపాటు తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నల్గొండ రిటైర్డ్ ప్రొఫెసర్ నరసింహ రావు నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి మాట్లాడుతూ మహేశ్వరం మండల పరిధిలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో విలీనం చేస్తే ఈ ప్రాంతం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాలకు గొప్ప నగరాన్ని అందించిన వారం అవుతామని ఆయన అన్నారు. ఫ్యూచర్ సిటీ ఏర్పాటుపై కొన్ని రాజకీయ శక్తులు తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజల్లో బాయందోలనలు సృష్టిస్తున్నాయని ఆయన ఆరోపించారు. బిఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఫ్యూచర్ సిటీ రద్దుచేసి ఫార్మసీ సీటి ఏర్పాటు చేస్తామని చెబుతున్నారని ఆయన విమర్శించారు. ఫ్యూచర్ సిటీ ద్వారా ఐటి పరిశ్రమలు విద్య వైద్యం స్పోర్ట్స్ సిటీ విల్లాస్ స్కిల్ యూనివర్సిటీ రియల్ ఎస్టేట్ రంగాలు అభివృద్ధి చెందడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా దేప మాట్లాడుతూ గతంలో ఫార్మాసిటీ వద్దని స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి అడ్డుకున్నారని అన్నారు. ప్రస్తుత అభివృద్ధికి బాటలు వేస్తున్న ఫ్యూచర్ సిటీని చూసి ఓర్వలేకే మహేశ్వరం మండల విలీనాన్ని అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. మహేశ్వరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కట్టె కొమ్ములు జగన్ రెడ్డి టీ డబ్ల్యూ జేఎఫ్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు తడక నరసింహ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నాటి మనోహర్ దత్తు నాయక్ కాకీ ఈశ్వర్ మాజీ జడ్పిటిసి ఈశ్వర్ నాయక్, మాజీ ఎంపిటిసి పోతర్ల సుదర్శన్ యాదవ్, లాజర్, షేక్ హాజీ బాబా, పరిగి రాఘవేందర్ రెడ్డి, విట్టల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.






## ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**టీఆర్పీ జిల్లా అధ్యక్షులు మెరుగు చందర్ యాదవ్**

**ఎస్సై, కానిస్టేబుల్, ఎఫ్‌బీఓ, జీపీవో ఉద్యోగాల కోసం 100 రోజుల ఉచిత కోచింగ్**




**పెద్దపల్లి ప్రతినిధి :** పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులు తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 100 రోజుల ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మెరుగు చందర్ యాదవ్ పిలుపునిచ్చారు. ఎస్సై, కానిస్టేబుల్, ఎఫ్‌బీఓ, జీపీవో తదితర ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత కోచింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మెరుగు చందర్ యాదవ్ మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన శిక్షణ అందించాలనే ఉద్దేశంతో 100 రోజుల ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. శిక్షణకు సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు వాట్సాప్ గ్రూపులో చేరి తమ పూర్తి వివరాలను పంపించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం 9700577556 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు మేరుగు సతీష్ గౌడ్, జిల్లా జాయింట్ సెక్రటరీ కాంపెల్లి స్వామి, జిల్లా సెక్రటరీ కుమ్మరి పరమేష్, పెద్దపల్లి మండల అధ్యక్షులు వెంగల కృష్ణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్ల ప్రశాంత్, గోగు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం బాధితురాలికి వి. సురేందర్ ఆర్థిక సహాయం






**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్1:** మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు ఒక ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితురాలు కొండ్రా శంకరమ్మ కు వి. సురేందర్ మానవతా దృక్పథంతో ఆదుకున్నారు. ఆయన బాధితురాలికి రూ. 4,000/- ఆర్థిక సహాయం అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. ప్రమాద తీవ్రతకు ఇంట్లో ఉన్న వస్తువులన్నీ పూర్తిగా కాలి బూడిదయ్యాయని, తనకు ఏమీ మిగలలేదని బాధితురాలు శంకరమ్మ కంటతడి పెట్టారు. ఈ కష్టసమయంలో తనకు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## ఎంపీఓ కుమారుని వివాహ వేడుకకు హాజరైన డీసీసీ కన్వీనర్ కనకం విద్యాసాగర్, ముత్తారం సర్పంచ్, ఉప సర్పంచ్



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్1(:** శంకరపట్నం మండల పరిషత్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కాసగౌని ప్రభాకర్ గౌడ్ కుమారుని వివాహ రిసెప్షన్ వేడుక కరీంనగర్ లోని రాంనగర్ లో గల శ్రీ గౌరీ కన్వెన్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించబడింది. ఈ శుభకార్యానికి డీసీసీ కన్వీనర్ కనకం విద్యాసాగర్, ముత్తారం గ్రామ సర్పంచ్ మారవేణి రాజయ్య, ఉప సర్పంచ్ గట్టు శ్రావణ్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారితో పాటు భీమ్ ఆర్మీ స్టేట్ చీఫ్ వాసాల శ్రీనివాస్ రావణ్, మాజీ నీటి సంఘం అధ్యక్షులు గాలి మల్లయ్య కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. హాజరైన ప్రముఖులందరూ ఎంపీఓ ప్రభాకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసి, నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకలో పలువురు స్థానిక నాయకులు, ప్రభుత్వ అధికారులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు.

## జనగణనలో బీసీలను లెక్కించకుండా బీజేపీ ప్రభుత్వం మోసం చేస్తోంది: బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్



**మిర్యాలగూడ. (:** జనగణనలో బీసీల జనాభాను లెక్కించకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆరోపించారు. మిర్యాలగూడ పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి సరికాదన్నారు. బీజేపీ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ కులగణన చేపడతామని హామీ ఇచ్చిందని, అయితే ప్రస్తుతం కులగణన జరుగుతున్న సమయంలో అస్పష్టంగా, అశాస్త్రీయంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందని విమర్శించారు. జనగణనలో మొత్తం 40 ప్రశ్నలు పొందుపరిచినప్పటికీ, అందులో వ్యక్తి ఎస్సీనా, ఎస్టీనా అని అడుగుతున్నారని, కానీ వారు బీసీకి చెందినవారా అనే విషయాన్ని స్పష్టంగా అడిగే ప్రశ్నను చేర్చలేదని అన్నారు. దేశానికి బీసీ ప్రధానమంత్రి ఉన్నప్పటికీ బీసీలకు న్యాయం జరగడం లేదని లింగంగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి బీసీల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే వెంటనే బీసీ కులాల జాబితాను ప్రకటించి, ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, రాంబాబు యాదవ్, బంటు సైదులు, తాడూరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట



**రామగిరి, సెప్టెంబర్ 01:-** కమాన్ పూర్ మండలంలోని పలువురు కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ మంగళవారం పరామర్శించారు. మండలంలోని పేరా పల్లి గ్రామానికి చెందిన మెరుగు రాజమౌళి, రెడ్డి మల్ల కనకయ్య ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వార్డు సభ్యుడు రాగుల ప్రవీణ్ ప్రమాదంలో గాయపడగా అతని సైతం పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు . అలాగే రుంబిగుంట గ్రామానికి చెందిన భువనే కొమరమ్మ, ఉరడి స్వరూప, మొహమ్మద్ నహీమా బేగం, ఇటీవల మరణించ గా వారి కుటుంబాలను సైతం పరామర్శించారు. అలాగే తన్నీరు వెంకటేశ్వర్లు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నాగారం గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు డీ కొండ కొమురయ్య తల్లి మల్లమ్మ మరణించగా మల్లమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బి ఆర్ ఎస్ మండల శాఖ అధ్యక్షుడు తాటికొండ శంకర్, చిందం తిరుపతి, ఉండి అనిల్, రాచకొండ రవి, ఆకుల రమేష్ ,డీలర్ రవి,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మల్యాల రాములు గౌడ్



**మానకొండూర్, సెప్టెంబర్ 1:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం కొండపల్కలకు చెందిన మల్యాల రాములు గౌడ్ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర గౌడ సంక్షేమ సంఘం కార్యాలయంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు గట్టు రామచంద్ర రావు చేతుల మీదుగా రాములు గౌడ్ నియామక పత్రాన్ని మంగళవారం అందుకున్నారు. అనంతరం రాములు గౌడ్ మాట్లాడుతూ.... తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, గౌడ జాతి అభ్యున్నతి, సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. గౌడ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారంతో పాటు గౌడ యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, సామాజికంగా ఆర్థికంగా గౌడ సమాజం అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని రాములు గౌడ్ ధీమా వ్యక్తంచేస్తూ సంఘం వ్యవస్థాపకుడు గట్టు రామచంద్ర రావుకు, రాష్ట్ర అధ్యక్షుడు గుండాల మల్లేష్ గౌడ్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోల్కాపురి శ్రీకాంత్ గౌడ్, గండి వీరేందర్ గౌడ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్ యమున గౌడ్, గండి శారద గౌడ్, నల్గొండ తిరుపతి గౌడ్, ఏరుకొండ హైమావతి గౌడ్ , అంతటి భాగ్యలక్ష్మి గౌడ్, తాళ్లపల్లి సంధ్య గౌడ్, గోపగోని నవీన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలి

## ● ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పట్టణ కన్వీనర్ కుక్క శ్రావణ్





**పెద్దపల్లి ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఈరోజు 1000 రోజులు పూర్తి చేసుకున్న తరుణంలో ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వంద రోజులలో పూర్తి చేస్తానని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఈ ఆరు గారెంటీలతో పాటు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని లేదంటే రాజీనామా చేసి ప్రజల మధ్యకి రావాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పెద్దపల్లి పట్టణ కన్వీనర్ కుక్క శ్రావణ్ పేర్కొన్నారు. పెద్దపల్లిలో ఆటో డ్రైవర్ అన్న ల సమస్య సంవత్సరానికి 12000 ఇస్తానని మూడు సంవత్సరాలు గడిచిన ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వారి గోడు విని పరిష్కారం చూపాలని కోరారు. 1000 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వం హామీలు ఇచ్చి విస్మరించిన వాటిలో కొన్ని ముఖ్యమైన వాటిలో 1. మహాలక్ష్మి పథకం ప్రతి మహిళకు 2500 500 గ్యాస్ సిలిండర్ ఎక్కడ? 2. చేయూత పథకం ద్వారా ఆసరా పెన్షన్లు 4000 ఎక్కడ? వికలాంగుల పెన్షన్లు 6000 ఎక్కడ? 3.రైతు భరోసా 15000 ఏట ఎక్కడ? 4. ఉద్యమకారులకు 250 చదరపు గజాలు ఇంటి స్థలం ఎక్కడ? 5. ఇందిరమ్మ ఇండ్ల పథకం ఎస్సీలకు ఆరు లక్షలు..ఎక్కడ? 6. ఎస్సీ సోదరులకు చేవెళ్ల డిక్లరేషన్ అంబేద్కర్ అభయహస్తం ఎక్కడ? 7. ప్రతి ఆటో డ్రైవర్ అన్నకు సంవత్సరానికి 12,000ఎక్కడ? 8. ఎస్సీ వర్గీకరణ అనంతరం కొత్తగా 3 ఎస్సీ కార్పొరేషన్లుఎక్కడ? 9. కళ్యాణ లక్ష్మి పథకానికి అదనంగా తులం బంగారం ఎక్కడ? 10. తెలంగాణ ఉద్యమకారుల అమరవీరుల కుటుంబాలకి గౌరవంగా నెలకు 25000 మరియు ఇంటిలో గల వ్యక్తులకు ఒక ప్రభుత్వ ఉద్యోగం ఎక్కడ? 11. 18 సంవత్సరాల పైబడి చదువుకునే యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్లు ఉచితం ఎక్కడ? 12. ప్రభుత్వ ఉద్యోగులకు సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలి.. 13. ఉద్యోగులకు పెన్షనర్లకు పెండింగ్ లో ఉన్న డిఏలు వెంటనే విడుదల చేయాలి 14. 50 సంవత్సరాలు దాటిన జానపద కళాకారులకు నెలకు 3000 రూపాయల చొప్పున పెన్షన్ చెల్లింపు ఎక్కడ? 15. నగరపాలిక మరియు మున్సిపాలిటీ కేంద్రంలో అన్ని ఆధునిక సౌకర్యాలతో బస్తీ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు..ఎక్కడ? అంటూ అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుక్క అశోక్,నూనె వెంకటేష్, ఎండి మెహరజ్, ఎండి షఫీ, కుక్క చరణ్, ఒడ్డపల్లి తిరుమల్, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల కొమ్ముకాస్తోంది

## చాడ వెంకటరెడ్డి ధ్వజం




**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్1:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు కార్పొరేట్ శక్తులకు పట్టం కడుతుందని, ప్రజల సొమ్మును ప్రైవేటు వ్యక్తులకు ధారా దత్తం చేస్తుందని, బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను 22 వేల కోట్ల రూపాయలను కార్పొరేట్ శక్తులకు మాఫీ చేసిందని, పేదలు రైతులు తీసుకున్న రుణాలను మాత్రం మాఫీ చేయడం లేదని, దేశంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలపై దాడులు పెరిగిపోతున్నాయని వెంకటరెడ్డి ఆరోపించారు. మంగళవారం కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో విలేకరుల సమావేశం జరిగింది.విలేకరుల సమావేశంలో వెంకటరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతానికి గోదావరి జలాలు అవసరమని ఎత్తిపోతల ద్వారానే తెలంగాణకు నీళ్లు అందుతాయన్నే సంకల్పంతో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞానికి పూనుకోవడంతో శాసనసభలో సిపిఐ సంపూర్ణ మద్దతు తెలిపిందని, ఎల్లంపల్లి శంకుస్థాపనలో అనాటి ఉమ్మడి కరీంనగర్ జిల్లా శాసనసభ్యులమంతా భాగస్వాములు అయ్యామని, తుమ్మిడి హెట్టి దగ్గర 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేస్తే శాశ్వతంగా సాగు, త్రాగునీటికి సంపూర్ణ పరిష్కారం దొరుకుతుందని, ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాలు సస్యశ్యామలం అవుతాయని, అందుకోసం కేంద్రంలో,మహారాష్ట్రలో బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున మహారాష్ట్ర ప్రభుత్వంతో బ్యారేజీ నిర్మాణానికి మాట్లాడడానికి తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి బండి సంజయ్ కుమార్ కృషి చేయాలని అన్నారు. 2021లో ధరణి పోర్టల్ చట్టం తెచ్చినప్పుడు అందులో అనేక లొసుగులు చోటు చేసుకుంటాయని, సమస్యలు ఉత్పన్నమవుతాయని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కు స్పష్టంగా చెప్పినప్పటికీ పెడచెవిన పెట్టారని, నేడున్న పరిస్థితుల్లో సెల్ ఫోన్లకే వైరస్ వచ్చి డాటా అంత పోతుందని అలాంటిది ఈ పోర్టల్ కు వైరస్ వస్తే భూముల డాటా కూడా పోతుందని వివరించామని అయినప్పటికీ వినకుండా ఆ చట్టం తెచ్చారని, నేడు 22ఏ మూలంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక భూ సమస్యలు తలెత్తుతున్నాయని, మల్కాజ్గిరి, ఇతర ప్రాంతాలలో 22 ఎ లోకి భూములు వెళ్లడం మూలంగా అక్కడి ప్రజలు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారన్నారు. రియల్ ఎస్టేట్ భూ దందాలు చేసేవారు నిషేధిత భూములను, పట్టాలు చేయించుకుంటున్నారని, చివరకు వ్యవసాయ భూములను కూడా వదలకపోవడం దుర్మార్గమని ప్రభుత్వం వీటిపై కఠినంగా వ్యవహరించాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనలో ప్రజలకు మంచి చేయాలని,రాష్ట్ర అభివృద్ధి చెందాలని ఒకవైపు ఆయన ప్రయత్నిస్తుంటే మరొకవైపు అధికార యంత్రాంగంలో మాత్రం విధుల పట్ల, బాధ్యతల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని, జవాబుదారితనం లేకుండా పోతుందని, అవినీతి విచ్చలవిడిగా జరుగుతుందని, ఇటీవలి కాలంలో చూస్తే రెవెన్యూ, ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్, పోలీస్ డిపార్ట్మెంట్ ఇలా అనేక డిపార్ట్మెంట్లలో పనిచేసే ఉద్యోగులు ఏసీబీ ట్రాప్ లల్లో దొరుకుతే వారి వద్ద వందలాది కోట్ల రూపాయలు ఉండడం చూస్తుంటే అధికార యంత్రాంగం ఏ విధంగా అక్రమ సంపాదనకు అలవాటు పడుతున్నారో అర్ధమవుతుందని, రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూముల బదలాయింపు కోసం, ఇతర పనులపై వచ్చే వారి నుండి యంత్రాంగం అధిక మొత్తంలో చేతులు మారుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే చొరవ తీసుకొని యంత్రాంగ ప్రక్షాళన చేయాలని అందుకోసం అవసరమైతే అనుభవజ్ఞులైన రాజకీయ విశ్లేషకులతో, రిటైర్ అధికారులతో సంప్రదపులు జరిపి పరిపాలనలో ప్రజలకు జవాబుదారీతనంగా, పారదర్శకతగా, అవినీతికి తావు లేకుండా చేయాలని వెంకటరెడ్డి సూచించారు. సెప్టెంబర్ 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు కరీంనగర్ లో ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయి మహాసభల విజయవంతం కోసం కార్మిక లోకం కదిలి రావాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్,బోయిని అశోక్,టేకుమల్ల సమ్మయ్య,, కసిరెడ్డి సురేందర్ రెడ్డి,న్యాలపట్ల రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్,పైడిపల్లి రాజు, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, మచ్చ రమేష్,నాయకులు బాకం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జలసిరి పనులను అక్టోబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలి

## ● ప్రతి గ్రామంలో పంట కుంటలు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ గుంతల నిర్మాణం వేగవంతం చేయాలి ● జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి ప్రతినిధి :** గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాలను పెంచే లక్ష్యంతో చేపడుతున్న తెలంగాణ జలసిరి కార్యక్రమం కింద జిల్లాకు నిర్దేశించిన అన్ని పనులను అక్టోబర్ నెలాఖరులోగా పూర్తి చేసేలా అధికారులు కార్యాచరణ రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో తెలంగాణ జలసిరి కార్యక్రమం పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్షా సమావేశం నిర్వహించారు.జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల వారీగా తెలంగాణ జలసిరి కార్యక్రమం కింద చేపట్టాల్సిన పంట కుంటలు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ గుంతల నిర్మాణ లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన పురోగతిని కలెక్టర్ సమీక్షించారు, ఇంకా ప్రారంభం కాని పనులు, నిర్మాణ దశలో ఉన్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, విబీజీ రాంజీ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రతి మండలం, ప్రతి గ్రామ పరిధిలో నిర్దేశించిన లక్ష్యం మేరకు పంట కుంటలు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ గుంతలు నిర్మించాలని సూచించారు.ప్రస్తుతం తెలంగాణ జలసిరి కార్యక్రమం పురోగతి ఆశించిన స్థాయిలో లేదని పేర్కొన్నారు. పనులను మరింత వేగవంతం చేసి అక్టోబర్ నెలాఖరులోగా జిల్లాకు నిర్దేశించిన పూర్తి లక్ష్యాన్ని సాధించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలను, రైతులను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేస్తూ ప్రతి గ్రామంలో అవసరమైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, రైతుల పొలాల్లో పంట కుంటలు, బోర్‌వెల్స్ వద్ద రీచార్జ్ గుంతలు ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.అవసరమైన పరిపాలనా అనుమతులను వెంటనే జారీ చేసి నిర్మాణ పనులను ప్రారంభించాలని ఆదేశించారు. రైతులను భాగస్వామ్యం చేస్తూ పంట కుంటల తవ్వకం పనులను వేగవంతం చేయాలని, గ్రామాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ప్రతి మండలానికి సంబంధించి నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించడంతో పాటు వివిధ దశల్లో ఉన్న పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి సంరక్షణకు తెలంగాణ జలసిరి కార్యక్రమం ఎంతో కీలకమని, గ్రామీణ ప్రాంతాల్లో నీటి లభ్యత పెరిగేలా పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలోజడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, జిల్లా పంచాయతీ అధికారి శ్రీమల, ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షులుగా కళ్లేపల్లి విక్రమ్



**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 1 :** ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షులుగా లక్షెట్టిపేట పట్టణానికి చెందిన కళ్లేపల్లి విక్రమ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం పట్టణంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయనకు ఎన్నిక పత్రాన్ని జిల్లా నాయకులు లింగంపల్లి శ్రీనివాస్ అందించారు. ఈ సందర్భంగా ఎన్నికైన విక్రమ్ ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అధ్యక్షులుగా ఎన్నుకున్నవారికి ధన్యవాదములు తెలిపారు. మాదిగల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం, అధికారులను కొరతా నన్నారు. పదవికాలంలో మాదిగ హక్కులకోసం పోరాడతానన్నారు. ఈ కార్యక్రమంలో అవునూరి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ తల్లి దయతో రాష్ట్ర సుభిక్షంగా వర్ధిల్లాలి

## రావిరాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి సన్నిధిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**మహేశ్వరం సెప్టెంబర్ 01 :** శ్రీ సూర్యగిరి రేణుక ఎల్లమ్మ తల్లి దయతో రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కోరుకున్నారు. మంగళవారం రేణుక ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి తో కలిసి ఆయన శ్రీ సూర్యగిరి రేణుక ఎల్లమ్మ తల్లి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు పొందారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని ప్రజా సంక్షేమం మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నట్లు కేఎల్ఆర్ తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రజలకు మరింత సేవ చేసే శక్తి ఆరోగ్యం ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వేడుకున్నామన్నారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఏనుగు జంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# శిరీషను హత్య చేసిన నిందితున్ని ఎన్కౌంటర్ చేయాలి

## ఏబీవీపీ రాష్ట్ర వనవాసి కన్వీనర్ రాజేష్



**మహేశ్వరం సెప్టెంబర్ 01 :** శిరీషను హత్య చేసిన నిందితుడిని ఎన్కౌంటర్ చేస్తేనే శిరీష కుటుంబానికి తగిన న్యాయం జరుగుతుందని ఏబీవీపీ రాష్ట్ర వనవాసి కన్వీనర్ రాజేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుక్కుగూడ ప్రైమ్ కేర్ ఆస్పత్రిలో నర్స్ గా పని చేస్తూ హత్య చేయబడ్డ శిరీష కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో మహేశ్వరంలో ర్యాలీ నిర్వహించి నిందితుడి సనాహుల్లా ఖాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిరీష పై జరిగిన దాడి అత్యంత దారుణమైన సంఘటన అని తీవ్రంగా ఖండించారు. నిందితుడిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని గిరిజన బిడ్డలు సమాజంలో భయం భయంగా గడపాల్సిన పరిస్థితి నెలకొందని విమర్శించారు. మహిళలపై జరుగుతున్న దారుణాలను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. శిరీషపై జరిగిన ఘటనతో రాష్ట్ర ప్రభుత్వం తక్షణ రక్షణ చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రణీత్, సైయిద్ ,అభిలాష్, రోహిత్, సాయి కార్తీక్, చింటూ, శృతి, తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా విద్యార్థులకు సిలబస్‌ను పూర్తి చేయాలి

## లేదంటే ఆయా పాఠశాలల ఉపాధ్యాయులపై చర్యలు తప్పవు



**మహేశ్వరం సెప్టెంబర్ 01,:** నిర్ణీత గడువులోగా విద్యార్థులకు సిలబస్ ను పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం మహేశ్వరం మండల పరిధిలోని పలు పాఠశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యా బోధన విద్యార్థుల హాజరు పట్టిక ఉపాధ్యాయుల హాజరు పట్టిక మౌలిక వసతులు మధ్యాహ్న భోజనం తదితర అంశాలను ఆయన స్వయంగా పరిశీలించారు. పాఠశాలల పరిశుభ్రత విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను విద్యాశాఖ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఫలితాలను మరింత మెరుగు పరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల వనరుల కేంద్రం భవితసెంటర్లను కూడా సందర్శించిన డీఈవో అక్కడి కార్యకలాపాలను పరిశీలించి విద్యా ప్రమాణాలు మెరుగుదల కోసం అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండల విద్యాధికారి డాక్టర్ వి కృష్ణా నాయక్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంశంకరయ్య,భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలతో వ్యాల్ల శ్రావ్య జన్మదిన వేడుకలు

## ఆశ్రమంలో అన్నదానం.. నిరుపేదలకు భోజనం.. ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ



**గోదావరిఖని టౌన్ :** బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి సతీమణి వ్యాల్ల శ్రావ్య పటేల్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని రామగుండం నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు మేకల రామస్వామి, కొండ సురేష్ ఆధ్వర్యంలో తబిత ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి, కేక్ కట్ చేసి శ్రావ్య పటేల్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా రౌతు గణేష్, ఎండీ తమీమ్, ఎండీ వాషిమ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ, వ్యాల్ల శ్రావ్య పటేల్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు అల్లి గణేష్, నిమ్మ రాజుల సాగర్, యువరాజ్ నేత,మేడం సతీష్, నిజాముద్దీన్, శివమిన్ను, మల్లేష్, ఆశ్రఫ్, రవితేజ, వషిమ్, ప్రణీత్, శ్రీనివాస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలన విజయోత్సవాలు






**మిర్యాలగూడ, :** ప్రజా ప్రభుత్వం 1000 రోజుల ప్రజా పాలన విజయోత్సవాలను మిర్యాలగూడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (రాజీవ్ భవన్)లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే కేక్ కట్ చేసి, ప్రజా ప్రభుత్వ 1000 రోజుల పాలన విజయోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలనలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, రాబోయే రోజుల్లో మిర్యాలగూడ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ బోర్డు వెనుక కుటుంబ భవిష్యత్తు

- అనారోగ్యంతో ఉన్న వారందరినీ అన్ ఫిట్ చేయాలి
- ప్రతినెల 2 మెడికల్ బోర్డులు నిర్వహించాలి
- టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన





**రామగిరి, సెప్టెంబర్ 01:-** తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్ సూచనలతో యూనియన్ అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి, కేంద్ర నాయకత్వం ఆదేశాలతో ఆర్.జి-త్రీ, ఏపీఏ ఉపాధ్యక్షులు నాగెల్లి సాంబయ్య ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం తెలియజేస్తూ మేనేజర్ లకు మెమోరాన్ని ఇవ్వడం జరిగింది. సింగరేణిలో తీవ్ర అనారోగ్యాల బారిన ఉన్న కార్మికులను సైతం మెడికల్ ఇన్వాల్యుడేషన్ చేయడం లేదని దీంతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని పేర్కొంటూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం అన్ని గనులలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కార్మికులందరితో కలిసి ఓసిపి-వన్ మేనేజర్ పాపయ్య కి, ఏఎల్పి మేనేజర్ పెంచలయ్య కి, ఓసిపి- టు ఇన్చార్జి మేనేజర్ కాలేష లకు పిట్ సెక్రటరీలు, నాయకులు కార్మికులతో కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. భూగర్భగనుల్లో ఆరుగాలం శ్రమించి బొగ్గు ఉత్పత్తికి పనిచేస్తున్న క్రమంలో కార్మికుడు తీవ్ర అనారోగ్యాలకు, ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొని బార్డర్లో సైనికులకు ఇస్తున్న విలువను సింగరేణి కార్మికులకు సైతం అందజేయాలన్న సదుద్దేశంతో గతంలో టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 15వేల పైచిలుకు కారుణ్య నియామకాలను మెడికల్ ఇన్వాల్యుడేషన్ ద్వారా ఇవ్వడం ద్వారా కార్మికులను ఆదుకున్న వారు అయ్యారని తెలిపారు. అప్పట్లో 70 శాతం నుండి 90 శాతం పైచిలుకు అన్ ఫీట్లు అయినప్పటికీ ఇంకా ఎక్కువ చేయాలని అప్పటి సంఘాలు ఏఐటియుసి, ఐఎన్టియుసి నిరసన కార్యక్రమాలు చేపట్టారని వారు గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలుగా గెలిచిన తర్వాత క్రమం తప్పకుండా మెడికల్ బోర్డులు కూడా నిర్వహించలేకపోయారని, ఒకటి రెండు మెడికల్ బోర్డులు పెట్టినప్పటికీ వాటిలో అతి తక్కువ మందిని అన్ ఫిట్ చేసి కార్మికులకు తీరని అన్యాయం చేశారని పేర్కొన్నారు. కార్మికుల అనారోగ్యాలను పరిగణలోకి తీసుకొని ఇప్పటినుండి అయినా క్రమం తప్పకుండా నెలకు రెండు లేదా మూడు మెడికల్ బోర్డులు నిర్వహించి అనారోగ్య బారిన ఉన్న కార్మికుల అందరిని మెడికల్ అన్ఫిట్ చేసి ఆదుకోవాలని లేఖ ద్వారా వివరించగా టీబీజీకేఎస్ నాయకులు కార్మికులు కలిసి ఇచ్చిన వినతి పత్రాన్ని కంపెనీ చైర్మన్ కి పంపుతామని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ నాయకులు దేవ శ్రీనివాస్, కేశవరావు, ఈసంపల్లి రమేష్, పాశం శ్రీనివాస్ రెడ్డి, గట్టు శ్రీనివాస్, శ్రీకాంత్ రావు, ఫిట్ సెక్రటరీలు వివి గౌడ్, గీటుకు శ్రీనివాస్, పూర్ణాకర్, వేముల రవిశంకర్, చిప్ప సురేష్, పూర్ణాకర్, బుద్ధి ఉదయ్, దేవరకొండ తిరుపతి, డివిజన్ నాయకులు అల్లం తిరుపతి, చిలకపల్లి శ్రీనివాస్, పోతరాజు, రవి, పొన్నం సదానందం, బండి బాబురావు, కలిగిరి రవి, పూతాటి అసిస్టెంట్ ఫీట్ సెక్రటరీలు వీరగోని సంతోష గౌడ్, కొప్పుల సురేష్, క్రాంతి యాదవ్, నాయకులు బర్ల సుధాకర్, పోయిల భూమయ్య, పిట్టల సది, చుక్కల కుమార్, రమణారెడ్డి, రాజశేఖర్, అభిలాష్, చంద్రయ్య, రాజు, రాజేశం, సుగుణాకర్ రావు, మోహన్, రమేష్, శ్రీనివాస్, గట్టయ్య, కిరణ్ ,రవి, వికాస్, శ్రీనివాస్ రెడ్డి, పురుషోత్తం, సుధాకర్, శ్రీకాంత్, సూర్య ప్రకాష్, సంజీవ్, వెంకటేశ్వర్లు, ముజాఫర్ ఖాన్, రాజ్ కుమార్, తిరుపతి, మూగ శ్రీనివాస్, మల్లేష్ వెంగళరావు, అశోక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ కోసం ఉపాధ్యాయుల సమరభేరి

- నల్ల బ్యాడ్జీలతో జమ్మికుంటలో శాంతియుత నిరసన.. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్




**జమ్మికుంట సెప్టెంబర్ 1 :** పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమ బాట పట్టాయి. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఉద్యోగుల కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం జమ్మికుంట మండల విద్యా వనరుల కేంద్రం ఎదుట ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుత నిరసన చేపట్టారు. కొత్త పెన్షన్ విధానం వల్ల ఉద్యోగుల భవిష్యత్తు ఆర్థిక భద్రతకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొన్నారు. వెంటనే కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో 2003 ఉపాధ్యాయ నియామకాల్లో ఎంపికైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నారని నాయకులు గుర్తు చేశారు. అదే విధంగా తెలంగాణలోనూ 2003 ఉపాధ్యాయ నియామకాల్లో ఎంపికైన వారికి పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. 2003 తర్వాత నియమితులైన ఉపాధ్యాయ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు దబ్బెట రవీందర్, రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సంఘం జమ్మికుంట మండల అధ్యక్షుడు ఎం. నాగరాజు స్వామి, ప్రగతిశీల ఉపాధ్యాయ సంఘం కార్యవర్గ సభ్యులు కె. శ్రీనివాస్, జమ్మికుంట మండల ప్రజాస్వామ్య ఉపాధ్యాయ సమాఖ్య ప్రధాన కార్యదర్శి కుమార్ స్వామి, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సమాఖ్య జమ్మికుంట మండల అధ్యక్షుడు ఎల్. తిరుపతి, కుర్ర సమ్మయ్య, ఏ. తిరుపతి, బి. రాజు, ఆర్. సుజాతతో పాటు ఉపాధ్యాయులు, సమగ్ర శిక్షణ వనరుల వ్యక్తులు పాల్గొన్నారు.

## బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమిస్తాం: గైర్హాజరు కాకుండా విధులు సక్రమంగా నిర్వహించాలి

- ఆగస్టు నెల బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను వెల్లడించిన జి.ఎం లు
- రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్
- అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ కొలిపాక నాగేశ్వరరావు




**రామగిరి, సెప్టెంబర్ 01:-** నాలుగు వ ప్యానల్ తయారీ పనులు కొనసాగుతున్నాయని, త్వరలోనే పనులు పూర్తి చేసి నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించడానికి ఉద్యోగులందరూ కృషి చేయాలని అలాగే ఉద్యోగులు చాలా మంది గైర్హాజరు అవుతున్నారని, గైర్హాజరు కాకుండా విధులు సక్రమంగా నిర్వహించాలని ఆర్.జీ-త్రీ, ఏపిఏ జి.ఎం లు అన్నారు. ఆగస్టు నెల బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ కొలిపాక నాగేశ్వరరావు మంగళవారం పన్నూర్ పరిధిలోని జీ.యం కార్యక్రమంలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను వెల్లడించారు.రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ మాట్లాడుతూ ఆగస్టు నెలలో రామగుండం-త్రీ ఏరియాకు నిర్దేశించిన 2.30 లక్షల టన్నుల లక్ష్యానికి గాను, 1.79 లక్షల టన్నులు అనగా 78 శాతం బొగ్గు ఉత్పత్తి, తో పాటు, కంపనీ షావల్స్ కు నిర్దేశించిన 08.00 లక్షల క్యూబిక్ మీటర్ల ఓ.బి(మట్టి) వెలికితీత లక్ష్యానికి గాను, 9.75 లక్షల క్యూబిక్ మీటర్లు అనగా 122 శాతం ఓ.బి (మట్టి) వెలికి తీయడం జరిగిందని, ఆఫ్ లోడింగ్ కు నిర్దేశించిన 13:00 లక్షల క్యూబిక్ మీటర్ల ఓ.బి లక్ష్యానికి గాను 9.26 లక్షల క్యూబిక్ మీటర్లు అనగా 71 శాతం మట్టిని వెలికితీయడం జరిగిందన్నారు. అదేవిధంగా 4.69 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందన్నారు. తదుపరి గనుల వారిగా ఉత్పత్తి వివరాలను తెలియజేస్తూ ఆగస్టు నెలలో ఓ.సి.పి-1 గనికి నిర్దేశించిన 0.30 లక్షల టన్నుల లక్ష్యానికి గాను, 1.03 లక్షల టన్నులు అనగా 343 శాతం, ఓ.సి.పి-2 గనికి నిర్దేశించిన 2.00 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 0.77 లక్షల టన్నులు అనగా 38 శాతం బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. భవిషత్తులో కూడా లక్ష్యానికి అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయడానికి తగిన చర్యలు తీసుకుంటూ విధులు నిర్వహించాలని కోరారు.ఆగస్టు మాసంలో అధిక వర్షాలు కురిసి నందున ఉత్పత్తిలో కొంత వెనుకపడ్డామని, వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్త చర్యలను తూచ తప్పక పాటించాలని, ఉద్యోగులందరూ బాధ్యతాయుతంగా పనిచేస్తూ సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను భద్రత తో సాధించడానికి కృషి చేయాలన్నారు.అనంతరం అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు మాట్లాడుతూ అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ కు ఆగస్టు నెలలో నిర్దేశించిన 15,300 టన్నుల లక్ష్యానికి గాను 14,576 టన్నులు బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. లాంగ్ వాల్ 3వ ప్యానెల్ సాల్వేజింగ్ పనులను పూర్తి చేసి సుమారు 145 చాకులను బయటకు తీయడం జరిగిందని, సాల్వేజింగ్ పనులను పూర్తి చేయడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటుజియంలు యం.రామ్మోహన్, బండి సత్య నారాయణ, ఏరియా ఇంజినీర్ ఎ.ఉదయ భాస్కర్, ఐ ఇ డీజీఎం బి.టి.మురళీ కృష్ణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డివై పియం యండి.ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏం తెచ్చిన మొఖం....ఏం చేషిన మొఖం...ఎందుకీ ప్రచారం

- ఉచిత వైద్య శిబిరాన్ని హేళన చేయడం సిగ్గుచేటు: నందగిరి రవీంద్ర చారి



**మానకొండూర్, సెప్టెంబర్1:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో గత వారం రోజులక్రితం నిర్వహించిన ఉచిత కాన్సర్ శిబిరంపై మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.. సమావేశానికి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి హజరై మాట్లాడుతూ.....విదేశీ పర్యటనలు చేషచ్చి ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం రసమయికి అలవాటేనని ,స్థానికేతరుడైనా రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ప్రజలు అవకాశమిస్తే అభివృది కోసం నిధులు తెచ్చిన మెఖమేనా,ఎం అభివృద్ధి చేసిన మొఖం నీది, ఎమ్మెల్యేపై ఎందుకీ ప్రచారాలంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.అంకిత్ ఆసుపత్రి ద్వారా గత 25 ఏండ్లుగా నియోజకవర్గ ప్రజలు ఉచిత వైద్యాన్ని పొందుతున్నారని,ఉచిత వైద్యం అందించాలన్న గొప్ప మనస్సున్న వైద్యురాలు అనురాధ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని హేళన చేసి మాట్లాడం సిగ్గుచేటన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.....కాన్సర్ నిర్ధారణ పరిక్షలతో పాటు వృద్ధులు, పేదవారికి కంటి పరీక్షలు నిర్వహించామని 400 మందికి పరీక్షలు నిర్వహిస్తే 70 మందిని గుర్తించి వైద్యం అందించామని దీనిని వ్యాపారంలా వక్రీకరించి మాట్లాడం పట్ల రసమయికి అవగాహనే లేదన్నారు.అధికారంలో ఉన్నప్పుడైనా, లేనప్పుడైనా ఎన్నడన్న క్యాంపు పెట్టవా అని ప్రశ్నిస్తూ స్థానిక నాయకులు కూడా ఎందుకు ఎగిరెగిరి పడుతున్నారో అర్థం కావడం లేదంటూ వైద్యం చేయించుకున్న వాళ్ళ నుండి డబ్బులు తీసుకున్నట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసే ముందు ఒకటికి పది సార్లు ఆలోచించాలని మానవసేవే మాధవసేవగా చేతులెత్తి మొక్కే వైద్యులను కించపరచడం సంస్కారం కాదన్నారు. బుద్ధి పుట్టినప్పుడే ప్రజలు గుర్తుకొచ్చే సీజన్ లీడర్ రసమయికి, ఓడినా గెలిచినా 20 సంవత్సరాలు ప్రజల్లో ఉన్న కవ్వంపల్లికి పోలికేందని ప్రశ్నించారు. పార్టీ మారడం సహజమేనని,2019లో నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ జెడ్పీటీసీ,ఎంపీపీ, ఎంపీటీసీ టికిట్లిచ్చిన వ్యక్తులు కాంగ్రెస్ నుండి వచ్చినవాళ్ళేనని, ఆరోజున మీ పార్టీ వ్యక్తులు కనిపించలేదా అంటూ ప్రశ్నిస్తూ బిఆర్ఎస్ లో ఉన్నవాళ్ళంత మిక్కుడు వెజిటబుల్ కర్రీలేనన్నారు. తాళ్ళపల్లి సంపత్ గౌడ్ మాట్లాడుతూ....బిఆర్ఎస్ మండలాధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి,గంప వెంకన్న ఏ పార్టీ నుండి వచ్చారో గుర్తు చేసుకోవాలని, కమిట్మెంట్ల వల్ల ఎమ్మెల్యే పాక్స్ చైర్మన్ పదవులిచ్చాడని మాకు లేని భాద మీకెందుకని మండిపడ్డారు.అభివృద్ధి గురించి రసమయి మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్టే ఉందని, స్థానిక మాజీ సూడా చైర్మన్ అభివృద్ధికి ఎన్ని నిధులు తెచ్చాడని ప్రశ్నిస్తూ ఎమ్మెల్యే కవ్వంపల్లిని, డాక్టర్ అనూరాధను విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.నాయకులు తాళ్ళపల్లి సంపత్ గౌడ్,మర్రి ఓదెలు యాదవ్, నాగిశెట్టి రాజయ్య,దూలం దేవేంద్ర-వీరస్వామి గౌడ్, రేమిడి శ్రీనివాస్ రెడ్డి,ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి,వరహాల చారి,రేవెల్లి రాజలింగం, ఇర్ఫాన్,పాండ్రాల కనక రాజేశం, కనకం కుమార్,తమ్మిశెట్టి రాజేష్,బుర్ర శ్రీకాంత్ గౌడ్, రామాంజనేయులు, మాషం రామకృష్ణ,కొండ్ర సురేష్, ముక్కెర సతీష్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు.. 420 హామీలు ఏమయ్యాయి?

హామీల అమలుపై బీఆర్ఎస్ ప్రశ్నల వర్షం- పెద్ద ఎత్తున ఉద్యమానికి హెచ్చరిక



**బ్యూరో,:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలుపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి దాసరి మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఓదెల గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులు, బీడీ కార్మికులకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000 పెన్షన్ వంటి హామీలు అమలు కావాల్సి ఉందన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ వంటి హామీలపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరి పంటకు రూ.500 బోనస్, రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా కార్డు ద్వారా రూ.5 లక్షలు, ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేల సాయం వంటి హామీలను కూడా ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. “హామీలు ఇచ్చింది ప్రజల ఓట్ల కోసం కాదు.. అమలు చేయడానికి” అని పేర్కొన్న శ్రీకాంత్‌గౌడ్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓదెల గ్రామ అధ్యక్షుడు పోలోజు రమేష్, రౌతు జలపతి, గుండేటి మధు, శ్రీనివాస్, తీర్థల కుమార్, బోడకుంట నరేష్, చింతం మొగిలి, గడ్డం శ్యామ్‌కుమార్, బోయ సదానందం, తుడి సంపత్‌రాజు, రాచర్ల కుమార్, లడ్డు, పిట్టల అరుణ్, మద్దెల శ్రీను, బినవేణి పరశురాం, రాసాల అశోక్, గిద్దెమారి రమేష్, అంబాల కుమార్, ఎండీ సర్వర్, మోటం అశోక్, రవి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏళ్ల నిరీక్షణకు శాశ్వత పరిష్కారం

**-నెరవేరిన రామగిరి ఆర్ఎంపీ, పీఎంపీల కల - మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్‌లకు కృతజ్ఞతలు!**

**- మంత్రి చొరవ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడి సహకారంతో భవన నిర్మాణానికి నిధులు మంజూరు - రామగిరి ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం**



**రామగిరి, సెప్టెంబర్ 01:-** ఎన్నో ఏళ్లుగా రామగిరి మండల ఆర్ఎంపీ, పీఎంపీలు ఎదురుచూస్తున్న భవన నిర్మాణ కల ఎట్టకేలకు సాకారమైంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో పాటు మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ కృషితో భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు పనులు ప్రారంభం కావడంతో రామగిరి ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రామగిరి మండలం బేగంపేట్ ఎక్స్ రోడ్‌లోని మంథని బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్‌ను ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తిరుపతి యాదవ్‌లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్ల తమ కలను సాకారం చేసేందుకు చొరవ చూపిన మంత్రి శ్రీధర్ బాబుకు, నిధుల మంజూరులో సహకరించిన తిరుపతి యాదవ్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కమాన్‌పూర్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్ఎస్ అన్వర్, రామగిరి ఆర్ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ అధ్యక్షులు బొద్దుల జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి గండి పైడయ్య, క్యాషియర్ సందీప్‌తో పాటు రామగిరి మండల ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


## రాజీవ్ యువ వికాసం ఎక్కడ?

**- ఏడాది దాటినా నిరుద్యోగ యువతకు అందని సబ్సిడీ రుణాలు - కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చడంలో విఫలం: బీఆర్ఎస్ నాయకుడు కరిపే ప్రవీణ్ వంజరి**



**మేడ్చల్, సెప్టెంబర్ 01:** రాజీవ్ యువ వికాసం పథకం కింద నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలు అందిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది దాటినా ఆ హామీని అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ హెచ్‌బీ కాలనీ డివిజన్ మాజీ అధ్యక్షుడు కరిపే ప్రవీణ్ వంజరి విమర్శించారు. గతేడాది మార్చి 15న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు రుణాల పంపిణీపై స్పష్టత లేకపోవడం దారుణమన్నారు. రుణాల కోసం ఎదురుచూస్తున్న యువతతో దరఖాస్తుల పేరుతో వేలాది రూపాయలు ఖర్చు చేయించి, అనంతరం వారి దరఖాస్తులను ఎంపీడీవో కార్యాలయాల్లో మూలన పడేశారని ఆరోపించారు. పథకం ద్వారా స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆశించిన యువతకు ప్రభుత్వం నిరాశ మిగిల్చిందన్నారు. దరఖాస్తులు స్వీకరించి నెలలు గడుస్తున్నా లబ్ధిదారుల ఎంపిక, రుణాల మంజూరు, సబ్సిడీ విడుదలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించకపోవడం పట్ల నిరుద్యోగ యువతలో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ప్రవీణ్ వంజరి ఆరోపించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పి, పథకాల పేరుతో దరఖాస్తులు తీసుకోవడం తప్ప ఆచరణలో ఎలాంటి ప్రయోజనం కల్పించలేదన్నారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని వెంటనే అమలు చేసి, అర్హులైన లబ్ధిదారులను గుర్తించి సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని, బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయడంతో పాటు సబ్సిడీ మొత్తాన్ని విడుదల చేసి యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. లేనిపక్షంలో మండల వ్యాప్తంగా నిరుద్యోగ యువతను సమీకరించి ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రవీణ్ వంజరి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేప్, పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు



**మేడ్చల్, సెప్టెంబర్ 01:** రేప్, పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ నేరెడ్‌మెట్ ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో 2017లో నమోదైన క్రైమ్ నంబర్ 820/2017 కేసులో నిందితుడు కేదార్‌నాథ్ మహాపాత్ర (54)ను దోషిగా నిర్ధారించిన కోర్టు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించింది. ఐపీసీ సెక్షన్ 354-ఏ, పోక్సో చట్టంలోని సెక్షన్ 12 కింద కేసు నమోదైంది. ఈ కేసు ఎస్ సి నెంబర్ 433/2019గా విచారణ కొనసాగింది. సెప్టెంబర్ 1న మెద్చల్--మల్కాజ్‌గిరి జిల్లా నేరెడ్‌మెట్‌లోని రేప్, పోక్సో కేసుల త్వరితగతిన విచారణ, పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ శిక్ష ఖరారు చేసింది. కేసు విచారణలో ప్రాసిక్యూషన్ సమర్థవంతంగా వాదనలు వినిపించడంతో పాటు పోలీస్ శాఖ తరఫున న్యాయస్థాన ప్రక్రియకు అవసరమైన సహకారం అందించారు.

# మైనారిటీ మహిళల ఆర్థిక బలోపేతానికి ఇందిరమ్మ యోజన

- **225 మంది లబ్ధిదారులకు రూ.50 వేల చొప్పున చెక్కులు పంపిణీ**





**మేడ్చల్, సెప్టెంబర్ 01:** మైనారిటీ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావడానికి ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయం దోహదపడుతుందని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, పరిశ్రమలు, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. మంగళవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, హజ్ కమిటీ సభ్యుడు మహమ్మద్ ముజుబుద్దీన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్ల కొత్వాల్, జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధి ద్వారా ఎదిగేలా చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజనను అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. మహిళలకు అందించే ఆర్థిక సాయం కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతుందని, మహిళల ఆర్థిక స్వావలంబనతో కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన కింద మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 225 మంది మైనారిటీ మహిళా లబ్ధిదారులకు రూ.50 వేల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం రూ.1.12 కోట్లకు పైగా ఆర్థిక సహాయం లబ్ధిదారులకు అందింది. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ ఆర్థిక సహాయాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తుర్క కాశి ముస్లిం వర్గానికి చెందిన వారికి కులవృత్తికి అవసరమైన పరికరాలు, ఉపాధి అవకాశాల కోసం రూ.60 వేల విలువైన జనరేటర్లు, టూల్ కిట్లను 57 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మైనారిటీల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు 'రేవంత్ అన్న సహారా--మిస్కినో కే లియే' పథకం కింద రూ.లక్ష విలువైన మోపెడ్‌లను అందిస్తున్నట్లు తెలిపారు. స్వయం ఉపాధి కింద మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మైనారిటీ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. మత, సామాజిక, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే మైనారిటీ విద్యార్థులకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. విద్య, ఉపాధి, స్వయం ఉపాధి రంగాల్లో మైనారిటీలకు అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మహిళలకు ఆర్థిక చేయూత అందించడం ముఖ్యమైన కార్యక్రమమని శ్రీధర్‌బాబు అన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందని తెలిపారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని, పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి వసతులతో నాణ్యమైన విద్య అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి నూతన స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేసి సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. రైతుల ఆర్థిక బలోపేతం కోసం రైతు భరోసా, రైతు బీమా, వ్యవసాయ పనిముట్లకు సంబంధించిన పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు నైపుణ్య అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం అనంతరం లబ్ధిదారులకు చెక్కులు, జనరేటర్లు, టూల్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, ఆర్టీఏ సభ్యుడు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, టీజీఎల్‌డీఏ చైర్మన్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కాంతమ్మ, ప్రజాప్రతినిధులు, అధికారులు, మైనారిటీ మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల మహాగర్జనతో దద్దరిల్లిన సచివాలయం

- న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఉద్యోగుల భారీ నిరసన
- ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్







**హైదరాబాద్, సెప్టెంబర్ 1,(తారా జ్యోతి):** ఉద్యోగుల న్యాయమైన హక్కులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ మరియు అనుబంధ అసోసియేషన్ల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన "ఉద్యోగుల మహాగర్జన" కార్యక్రమం సచివాలయంలో భారీ ఎత్తున జరిగింది. బాహుబలి గేటు వద్ద ఉద్యోగులు పెద్ద ఎత్తున చేరి నినాదాలు చేస్తూ సచివాలయ ప్రాంగణాన్ని హోరెత్తించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు వెంటనే అమలు చేయాలి, పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే విడుదల చేయాలి, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు మరియు ప్రస్తుత ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి, సచివాలయంలో అన్ని క్యాడర్లలో పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను తక్షణమే చేపట్టాలి, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (జూా) వెంటనే రద్దు చేసి, దాని స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి అనే డిమాండ్లపై ఉద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ "ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి -- న్యాయం చేయాలి"లి అంటూ తమ ఆవేదనను ప్రభుత్వానికి తెలియజేశారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటుతూ ఉద్యమ గీతాలను ఆలపిస్తూ తమ పోరాట స్ఫూర్తిని ప్రదర్శించారు. అనంతరం బాహుబలి గేటు నుంచి మీడియా పాయింట్ వరకు ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించిలి, నినాదాలతో ముందుకు సాగుతూ మీడియా పాయింట్‌కు చేరుకున్నారు. మీడియా పాయింట్ వద్ద సచివాలయ అసోసియేషన్ అధ్యక్షులు గిరి శ్రీనివాస రెడ్డి, జనరల్ సెక్రటరీ ప్రేమ్, ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లిలిశ్రీ సురేష్ కుమార్, అసోసియేషన్ అధ్యక్షురాలు శ్రీమతి రమాదేవిలి ఉద్యోగుల గొంతుకగా మారి తమ ప్రసంగాల ద్వారా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి బలంగా తీసుకెళ్లారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న బాధ్యతను గుర్తు చేస్తూ, లిఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వ వైఖరిని సూటిగా ప్రశ్నించారు. ఎన్నో సంవత్సరాలుగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఇకనైనా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా, ఉద్యోగుల ఆవేదనను అర్థం చేసుకొని తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మహాగర్జన ద్వారా ఉద్యోగుల ఆవేదన, అసంతృప్తి మరియు న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వానికి స్పష్టంగా చేరాయని, ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగులకు న్యాయం చేయాల్సిన సమయం ఆసన్నమైందనిలి సచివాలయ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అధికారులు, ఉద్యోగులు, మహిళా అధికారులు, మహిళా ఉద్యోగులు, అసెంబ్లీ మరియు లోక్ భవన్‌కు చెందిన అధికారులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని తమ నిరసన గళాన్ని వినిపించారు. ఉద్యోగుల ఐక్యతను, సంఘటిత శక్తిని చాటుతూ ఈ మహాగర్జనను విజయవంతం చేశారు.

## నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన.....!



**మానకొండూర్, సెప్టెంబర్1:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లింగపూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.... పెన్షన్ బిక్ష కాదు ఉద్యోగి హక్కని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని, మేనిఫెస్టోలో పెట్టిన సిపిఎస్ ను రద్దు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 1000 రోజులౌతున్నా అమలు చేయడంలేదని, సెప్టెంబర్ 6న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో పిఆర్సీ సాధనకై సంకల్ప స నిర్వహిస్తున్నామని, ఉద్యోగ ఉపాధ్యాయులు పెన్షనర్లు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, జీవో నెంబర్ 25ని సవరించి ఇటీవల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులను తిరిగి వెనక్కి తీసుకుని పిఆర్సీని ప్రకటించి పెండింగ్లో ఉన్న 6డిఏ లను తక్షణమే విడుదల చేసి హెల్త్ కార్డులతో కార్పోరేట్ ఆసుపత్రుల్లో ఓపి సౌకర్యం, పది లక్షల భీమా, కాంపిటెంట్ పాఠశాలలో తరగతి గదికి ఒక ఉపాధ్యాయున్ని, లేకపోతే విద్యా వాలంటీలను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, జియం శ్రీనివాస్, జోసెఫ్, సుభాషిని, మాధవి, రాము తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పది రోజుల్లో పందుల సంచారాన్ని కట్టడి చేయాలి

**మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత, కమిషనర్ సామ్యూల్ బెనిటిక్**

**ఇజ్రాయిల్ పాల్ హెచ్చరిక**



**మధిర, ప్రతినిధి సెప్టెంబర్ 1:** మధిర మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఇళ్ల మధ్య, ప్రధాన రహదారులపై పందులు విచ్చలవిడిగా సంచరిస్తుండటంతో ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై మున్సిపల్ అధికారులు స్పందించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత, కమిషనర్ సామ్యూల్ బెనిటిక్ ఇజ్రాయిల్ పాల్ మంగళవారం చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో పందుల పెంపకందారులు, యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇళ్ల మధ్య, రహదారులపై పందులను విచ్చలవిడిగా వదిలేయడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తడంతో పాటు వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చైర్‌పర్సన్, కమిషనర్ వివరించారు. పది రోజుల్లోగా పందుల సంచారాన్ని పూర్తిగా కట్టడి చేయాలని, లేనిపక్షంలో మున్సిపల్ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. దీంతో స్పందించిన పందుల యజమానులు పది రోజుల్లోగా పందులను కట్టడి చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని రాతపూర్వక హామీ పత్రాన్ని చైర్‌పర్సన్ సామినేని సుజాత, కమిషనర్ సామ్యూల్ బెనిటిక్ ఇజ్రాయిల్ పాల్‌కు అందజేశారు. ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్య పరిరక్షణతో పాటు రహదారులపై సురక్షిత రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా మున్సిపాలిటీ పరిధిలో పందుల సంచారాన్ని నియంత్రించేందుకు అవసరమైన కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

## మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడితే చట్టం ప్రకారం కఠిన చర్యలు

**గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, ఆఫ్జాలోద్దీన్**

**గోదావరిఖని 1 టౌన్ పరిధిలో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు**





**గోదావరిఖని క్రైమ్ :** మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడితే చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాల నిర్మూలన, నేరాల నియంత్రణ మరియు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మంగళవారం గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీ చౌక్‌లో గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, ఆఫ్జాలోద్దీన్ ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు దుకాణాలు, పాన్ షాపులు, టీ స్టాల్స్, నూతన నిర్మాణ ప్రాంతాలు, యువత ఎక్కువగా గుమికూడే ప్రదేశాలు, ఇతర అనుమానాస్పద ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు సీఐ తెలిపారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటమే లక్ష్యంగా నిరంతర తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది, నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## టీఆర్పీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం



**మానకొండూర్, సెప్టెంబర్1:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా హాజరై నూతన సభ్యులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి పార్టీ నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. అనంతరం అఖిల్ పాషా మాట్లాడుతూ.... గ్రామస్థాయిలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని, సభ్యత్వం పొందిన కార్యకర్తలకు రూ.5 లక్షల జీవిత బీమా, ప్రమాదంలో ఎముకలు విరిగితే రూ.2.50 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తుందని, సమస్యల వలయంగా మారిన నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అభివృద్ధిలో విఫలమయ్యాయని, ప్రజా సమస్యలపై టీఆర్పీ నిరంతరం పోరాడుతూ, ప్రజలకు అన్యాయం జరిగితే ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో జనాభా నిష్పత్తి ప్రకారం న్యాయం జరగాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఆత్మగౌరవం, హక్కులు, రాజకీయ అధికార సాధనకై టీఆర్పీ పనిచేస్తుందన్నారు. టీఆర్పీ ఆవిర్భావమై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నామని, నియోజకవర్గం నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాదయాత్రలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. టీఆర్పీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, మహిళా విభాగం నాయకులు, కార్యకర్తలు, నూతన సభ్యులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.


## ప్రతి ఒక్క ఓటును సవరణ చేస్తాం: తహసిల్దార్ వాసంతి



**రామగిరి, సెప్టెంబర్ 01:-** ప్రతి ఒక్క ఓటును పూర్తిస్థాయిలో సవరణ చేయడం జరుగుతుందని కమాన్ పూర్ తహసిల్దార్ ముస్త్యాల వాసంతి అన్నారు. మంగళవారం మండలంలోని జూలపల్లి గ్రామంలో సర్పంచ్ పోల్ దాసరి వనిత- సాయికుమార్ అధ్యక్షతన ఓటర్ సవరణ గ్రామసభ ప్రారంభమైంది. ఇందులో సవరణలో భాగంగా తప్పులు ఉన్న ఓటర్లకు ఎన్నికల కమిషన్ ద్వారా నోటీసులు జారీ చేయడం జరిగింది. ఇందులో భాగంగా నోటీఐసు స్థితిగతులను తెలుసుకొని ఆయా ఓటర్ యొక్క ఆధార్ కార్డు, పదవ తరగతి మెమో, పాస్పోర్టు గాని, పాన్ కార్డు కానీ వాటి వివరాలు చూసి ఆయా ఓటర్ యొక్క తప్పులను సరిదిద్దడం జరుగుతుందని తాసిల్దార్ పేర్కొన్నారు. ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రతి గ్రామంలో గ్రామ గ్రామాన సభలు నిర్వహించి ఆయా గ్రామసభల్లో సవరణ కార్యక్రమం చేయడం జరుగుతుందని తెలిపారు. తగిన డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుందని ఆమె అన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, ఉప సర్పంచ్ రాజా మహేందర్, సీనియర్ అసిస్టెంట్ సతీష్, జిపిఓ రవీందర్, వార్డు సభ్యులు చొప్పరి సంతోష్, వేముల సత్యనారాయణ, కారోబార్ బర్ల భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ క్రాప్ట్ సర్వే తప్పకుండా చేయించాలి

**-వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ**



**రామగిరి, సెప్టెంబర్ 01:** కమాన్ పూర్ మండలంలోని రైతులు డిజిటల్ క్రాఫ్ట్ సర్వే తప్పకుండా చేయించాలి అని మండల వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ రైతులను కోరారు. ప్రభుత్వం సూచించినటువంటి ఏడు సన్న రకాల బోనస్ పొందాలంటే రైతులు తప్పకుండా విధిగా వారి యొక్క వివరాలను విత్తనాలు కొనుగోలు చేసినటువంటి డీలర్ వద్ద తప్పకుండా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం డిజిటల్ గ్రాఫ్ సర్వే ప్రతి రెవెన్యూ గ్రామంలో వాలంటీర్స్ ద్వారా ప్రతి సర్వే నంబర్ను పంటలవారీగా పంట రకం విస్తీర్ణం నమోదు చేయడం జరుగుతుందని కావున రైతులు క్రాఫ్ట్ సర్వే నందు మీ యొక్క పంటలను కచ్చితంగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇందులో రకాలు సాగు విస్తీర్ణం తెలియజేసి నమోదు చేసుకోవాలని ప్రతి రైతు దీన్ని పాటించాలని సూచించారు.

# 13 ఏళ్ల తర్వాత ఫైనల్‌కు ఈస్ట్ జోన్!

స్పోర్ట్స్



ప్రతిష్టాత్మక దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీలో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం ముగిసిన సెమీఫైనల్లో సమష్టిగా రాణించిన ఈస్ట్ జోన్.. 4 వికెట్ల తేడాతో సెంట్రల్ జోన్‌ను ఓడించింది. టీమిండియా టీనేజ్ సెన్సేషన్, వైభవ్ సూర్యవంశీ(92, 40) విధ్వంసకర బ్యాటింగ్‌తో ఈస్ట్ జోన్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. బౌలింగ్‌లో ముఖేష్ కుమార్(3/56, 4/44) సత్తా చాటాడు. దాంతో ఈస్ట్ జోన్ 13 ఏళ్ల తర్వాత దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో వైభవ్ సూర్యవంశీనే టాప్ స్కోరర్‌గా నిలిచాడు. బ్యాటింగ్‌కు ప్రతికూలమైన వికెట్‌పై దూకుడైన బ్యాటింగ్‌తో ఈస్ట్ జోన్‌కు విజయాన్ని అందించాడు. రెండు జట్ల మధ్య ప్రధాన వ్యత్యాసం వైభవ్ సూర్యవంశీ బ్యాటింగే. 159 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఈస్ట్ జోన్.. 39.3 ఓవర్లలో 6 వికెట్లకు 162 పరుగులు చేసింది. వైభవ్ సూర్యవంశీ(43 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 40), కెప్టెన్ ఇషన్ కిషన్(41 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 39 నాటౌట్) రాణించారు. సెంట్రల్ జోన్ బౌలర్లలో హర్ష్ దూబే(4/53) నాలుగు వికెట్లు తీసినా ఫలితం లేకపోయింది. సారాన్ష్ జైన్, యశ్ ఠాకూర్ చెరో వికెట్ పడగొట్టారు. వైభవ్ విధ్వంసకర బ్యాటింగ్‌తో తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించాడు. మహమ్మద్ షమీ విన్నింగ్ షాట్‌తో విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. అంతకుముందు 45/3 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన సెంట్రల్ జోన్.. రెండో ఇన్నింగ్స్‌లో 50.2 ఓవర్లలో 158 పరుగులకు కుప్పకూలింది. హర్ష్ దూబే(24) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈస్ట్ జోన్ బౌలర్లలో ముఖేష్ కుమార్(4/44) నాలుగు వికెట్లు తీయగా.. మహమ్మద్ షమీ(3/56) మూడు వికెట్లు పడగొట్టాడు. అభిజిత్ సర్కార్, అనుకుల్ రాయ్, ఖురైషి తలో వికెట్ తీసారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సెంట్రల్ జోన్.. 80.1 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌటైంది. రింకూ సింగ్(88 బంతుల్లో 8 ఫోర్లతో 60) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా.. ఆర్య జుయల్(113 బంతుల్లో 6 ఫోర్లతో 46) హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. ఈస్ట్ జోన్ బౌలర్లలో ముఖేష్ కుమార్(3/56), అభిజిత్ సర్కార్(3/38) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ షమీ, మహమ్మద్ కౌనైన్ రెండేసి వికెట్లు తీసారు. అనంతరం ఈస్ట్ జోన్ 57 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌటైంది. వైభవ్ సూర్యవంశీ (81 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్స్‌లతో 92)తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. అభిమన్యు ఈశ్వరన్(69) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. వైభవ్ ఔటైన తర్వాత తొలి ఇన్నింగ్స్‌లో ఈస్ట్ జోన్ ఇన్నింగ్స్ పేకమేడలా కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో సెంట్రల్ జోన్ 158 పరుగులకు ఆలౌటైంది.

## ఊహించని ఆటతీరుతో రాణిస్తున్న శార్దూల్ ఠాకూర్

భారత టెస్ట్ జట్టు ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఎవరూ ఊహించని ఆటతీరుతో శార్దూల్ ఠాకూర్ అందరినీ ఆశ్చర్యపరిచారు. శార్దూల్ ఠాకూర్ మొదట బౌలింగ్‌లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. ప్రముఖ బౌలర్లు అయిన జస్‌ప్రీత్ బుమ్రా ఒక్క వికెట్ కూడా తీయలేదు. ఇతర బౌలర్లు అయిన మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ తలా రెండు వికెట్లు మాత్రమే తీశారు. ఈ పరిస్థితుల్లో శార్దూల్ ఠాకూర్ 4 వికెట్లు తీసి అదరగొట్టాడు. అదే కాకుండా తర్వాత బ్యాటింగ్‌లోనూ తన సత్తా చాటాడు. ప్రాక్టీస్ మ్యాచ్ మూడో రోజు ఆటలో బ్యాటింగ్‌లో శార్దూల్ ఠాకూర్ 68 బంతుల్లో 122 పరుగులు చేసి అదరగొట్టాడు. దీని ద్వారా నితీష్ కుమార్ రెడ్డిపై ఒత్తిడి పెరిగింది. దీనికి ముందు జరిగిన ఇంగ్లాండ్ లయన్స్ జట్టుతో జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో నితీష్ కుమార్ రెడ్డి ఒకే ఒక్క అర్ధ సెంచరీ మాత్రమే సాధించాడు. అతని బౌలింగ్ కూడా పేలవంగానే ఉంది. నితీష్ స్థానంలో శార్దూల్ ఠాకూర్‌ను జట్టులోకి తీసుకున్నా ఆశ్చర్యపోనవసరం లేదు. ప్రస్తుతం ఇంగ్లాండ్ జట్టుతో 5 టెస్ట్ మ్యాచ్‌లు ఆడేందుకు భారత జట్టు ఇంగ్లాండ్‌లో క్యాంప్ వేసింది. అక్కడ ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడుతోంది. ప్రాక్టీస్ మ్యాచ్‌లో శార్దూల్ ఠాకూర్ అద్భుతంగా రాణించాడు. నాలుగు వికెట్లు తీయడంతో పాటు ధాటిగా 122 పరుగులు చేసి అదరగొట్టాడు. ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌లో శార్దూల్ ఠాకూరే అత్యధిక పరుగులు చేసిన ఆటగాడు కావడం గమనార్హం.దీని కొనసాగింపుగా శార్దూల్ ఠాకూర్‌ను ప్లేయింగ్ ఎలెవన్‌లో చేర్చాల్సిన అవసరం ఏర్పడింది. శార్దూల్‌ను చేర్చాలంటే మరొక ఫాస్ట్ బౌలర్‌ను తొలగించాలి లేదా ఆల్‌రౌండర్‌గా ఉన్న నితీష్ కుమార్ రెడ్డిని తొలగించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో నితీష్ కుమార్ రెడ్డిని తొలగిస్తారని అంచనా వేస్తున్నారు. నితీష్ కుమార్ రెడ్డి ఆస్ట్రేలియాలో చేసిన ఒక సెంచరీ తప్ప, మరే ఇతర గొప్ప ప్రదర్శన చేయలేదు. ముఖ్యంగా బౌలింగ్‌లో నితీష్ కుమార్ రెడ్డి రోజురోజుకు పేలవంగా మారుతున్నాడు. ఇటీవల జరిగిన ఐపీఎల్ సిరీస్‌లో కూడా అతని బౌలింగ్, బ్యాటింగ్ రెండూ పేలవంగానే ఉన్నాయి.అయినప్పటికీ టెస్ట్ మ్యాచ్‌లలో నితీష్ బాగా ఆడతాడని ఆశించినప్పటికీ, బ్యాటింగ్ లో ఒక అర్ధ సెంచరీ చేసినప్పటికీ.. అతను ప్రతి మ్యాచ్‌లో నిలకడగా పరుగులు చేయలేకపోయాడు. అంతే కాకుండా బౌలింగ్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. అదే నితీష్ కుమార్ రెడ్డికి ప్రతికూలంగా మారింది. ఇది శార్దూల్ ఠాకూర్‌కు అనుకూలమైన విషయంగానూ మారింది.





## పీసీబీ నిర్ణయాలపై హర్ష భోగ్లే సెటైరికల్ పోస్ట్

ఇంగ్లండ్‌తో మూడు టెస్టుల సిరీస్ ఆడుతున్న పాకిస్థాన్‌కు తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓటములు ఎదురయ్యాయి. ఇంకా మూడో టెస్ట్ మిగిలి ఉండగానే పీసీబీ జట్టులో పెద్ద ఎత్తున మార్పులు చేసింది. ఆటగాళ్లతో పాటు కోచింగ్ స్టాఫ్ విషయంలోనూ నిర్ణయాలు తీసుకుంది. దీంతో చివరి టెస్టులో పాకిస్థాన్ జట్టు రూపమే మారిపోనుంది. ఇదే సమయంలో ప్రముఖ కామెంటేటర్ హర్ష భోగ్లే ఎక్స్‌లో పెట్టిన ఓ పోస్ట్ వైరల్ అయింది. పాకిస్థాన్ బోర్డు తీసుకున్న నిర్ణయాలను వరుసగా ప్రస్తావిస్తూ ఆయన సెటైర్ వేశారు. ముఖ్యంగా సిరీస్ మొదటి మ్యాచ్ నుంచి మూడో మ్యాచ్‌కు వచ్చేసరికి పరిస్థితి ఎంతగా మారిందో తన పోస్ట్‌లో చెప్పారు. 'పాకిస్థాన్ క్రికెట్‌లో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం' అన్నట్టుగా హర్ష తన పోస్ట్ మొదలుపెట్టారు. తొలి టెస్టులో కెప్టెన్‌గా ఉన్న సల్మాన్ ఆఘాను రెండో టెస్టులో పక్కన పెట్టారని, ఇప్పుడు మూడో మ్యాచ్‌కు ముందే స్వదేశానికి పంపించారని రాశారు. సిరీస్ పూర్తికాకముందే హెడ్ కోచ్, బౌలింగ్ కోచ్ కూడా వెళ్లిపోయారని పేర్కొన్నారు. సీనియర్ వికెట్ కీపర్‌ను కూడా ఇంటికి పంపించారని చెప్పారు. కొత్తగా ఎంపికైన ఆటగాళ్లు ఇంగ్లండ్ వెళ్లేందుకు వీసాల కోసం ఎదురుచూస్తున్నారని, వీసాలు వచ్చినా వెంటనే టెస్ట్ మ్యాచ్‌కు సిద్ధమవడం మరో సమస్య అని రాశారు. చివర్లో ఎప్పటిలాగే మైదానం బయటే ఎక్కువ యాక్షన్ అంటూ పాకిస్థాన్ క్రికెట్‌పై సెటైర్ వేశారు. పీసీబీ మొత్తం ఏడుగురు ఆటగాళ్లను ప్రస్తుత టెస్ట్ స్క్వాడ్ నుంచి రిలీజ్ చేసింది. మహ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్, సల్మాన్ ఆఘా, అలీ ఉస్మాన్, ఆమిర్ జమాల్, అవైస్ జాఫర్, ఖుర్రం షహ్జాద్ జాబితాలో ఉన్నారు. వీరితో పాటు హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్ కూడా మూడో టెస్టుకు జట్టుతో కొనసాగడం లేదు. వారి స్థానంలో వైట్ బాల్ టీమ్‌తో పనిచేస్తున్న మైక్ హెస్సన్, ఆష్లే నాఫ్కే టెస్ట్ కోచింగ్ స్టాఫ్‌లో చేరారు. మూడు మ్యాచ్‌ల సిరీస్ మధ్యలోనే ఏడుగురు ఆటగాళ్లతో పాటు ఇద్దరు కోచ్‌ల విషయంలో మార్పులు రావడం పాకిస్థాన్ క్రికెట్‌లో కూడా ఆశ్చర్యపరిచే నిర్ణయం. వెళ్లిపోయిన ఆటగాళ్ల స్థానంలో పాకిస్థాన్ మరో ఏడుగురిని ఎంపిక చేసింది. సైమ్ అయూబ్, అబ్దుల్లా ఫజల్‌తో పాటు అరాఫత్ మిన్హాస్, మహ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బైగ్, మహ్మద్ ఇమ్రాన్ రంధావా, రజావుల్లాను తీసుకుంది. ఇందులో సైమ్ అయూబ్, అబ్దుల్లా ఫజల్‌కు మాత్రమే టెస్ట్ అనుభవం ఉంది. ఇద్దరూ కలిపి ఇప్పటివరకు పది టెస్టులే ఆడారు. మిగతా ఐదుగురు టెస్ట్ క్రికెట్‌లో ఇంకా అరంగేట్రం చేయలేదు. అంటే మూడో మ్యాచ్‌కు తీసుకొచ్చిన జట్టులో అనుభవం తక్కువగా ఉన్న ఆటగాళ్లే ఎక్కువగా ఉన్నారు. వీరు సమయానికి ఇంగ్లండ్ చేరుకుని జట్టుతో ప్రాక్టీస్ చేయగలరా అన్నది కూడా మ్యాచ్‌కు ముందు తేలాల్సి ఉంది. మహ్మద్ రిజ్వాన్ ఇంగ్లండ్ సిరీస్‌లో నాలుగు ఇన్నింగ్స్‌లు ఆడాడు. హెడింగ్లీలో జరిగిన తొలి టెస్టులో 12, 41 పరుగులు చేసిన అతడు లార్డ్స్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో 7, 1 పరుగులకే ఔటయ్యాడు. వికెట్ కీపింగ్‌లో మాత్రం రిజ్వాన్‌కు మంచి కామెంట్స్ వచ్చాయి. ముఖ్యంగా మహ్మద్ అబ్బాస్ బౌలింగ్ చేస్తున్నప్పుడు వికెట్లకు దగ్గరగా నిలబడి చేసిన కీపింగ్ ఆకట్టుకుందని ప్రశంసలు దక్కాయి. కానీ బ్యాటింగ్‌లో నాలుగు ఇన్నింగ్స్‌ల్లో ఒక్క హాఫ్ సెంచరీ కూడా రాలేదు. కొంతకాలంగా అతని బ్యాటింగ్ ఫామ్‌పై విమర్శలు కూడా వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లోనే మూడో టెస్టుకు ముందు పీసీబీ రిజ్వాన్‌ను స్క్వాడ్ నుంచి రిలీజ్ చేసింది.



## తిలక్ వర్మ అజేయ శతకం..

### విజయం ముంగిట సౌత్ జోన్!

దులీప్ ట్రోఫీ 2026లో భాగంగా నార్త్ జోన్‌తో జరుగుతున్న సెమీఫైనల్-2లో సౌత్ జోన్ పట్టు బిగించింది. తిలక్ వర్మ(250 బంతుల్లో 9 ఫోర్లతో 116 నాటౌట్) అజేయ శతకంతో సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 117 పరుగుల భారీ ఆధిక్యాన్ని సొంతం చేసుకుంది. అనంతరం బౌలింగ్‌లోనూ సత్తా చాటడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి నార్త్ జోన్ రెండో ఇన్నింగ్స్ 66 ఓవర్లలో 7 వికెట్లకు 256 పరుగులు చేసింది. సనత్ సంగ్వాన్(148 బంతుల్లో 8 ఫోర్లతో 76), ఆయుష్ దోసెజా(76 బంతుల్లో 5 ఫోర్లతో 52) హాఫ్ సెంచరీలో రాణించారు. క్రీజులో అన్షుల్ కాంబోజ్(29 బ్యాటింగ్) ఉన్నాడు. సౌత్ జోన్ బౌలర్లలో శ్రేయస్ గోపాల్, కావురి సాయితేజ, మహమ్మద్ నిదీష్ రెండేసి వికెట్లు తీయగా.. విద్వత్ కావేరప్ప ఒక వికెట్ పడగొట్టాడు. ప్రస్తుతం నార్త్ జోన్ 139 పరుగుల ఆధిక్యంలో ఉంది. బుధవారం ఈ మ్యాచ్‌కు ఆఖరి రోజు. తొలి సెషన్‌లోనే నార్త్ జోన్ మిగతా మూడు వికెట్లు తీస్తే సౌత్ జోన్ ముందు 200 లోపు లక్ష్యం నమోదవుతుంది. అప్పుడు సౌత్ జోన్ ఆడుతూ పాడుతూ లక్ష్యాన్ని ఛేదించి ఫైనల్‌కు అర్హత సాధించవచ్చు. ఈ మ్యాచ్ డ్రా అయినా టోర్నీ రూల్స్ ప్రకారం తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించిన సౌత్ జోన్ ఫైనల్ చేరుతుంది. ఇక 285/9 ఓవర్ నైట్‌స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన సౌత్ జోన్ 100.3 ఓవర్లలో 312 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ స్కోర్‌కు 27 పరుగులు జోడించిన అనంతరం టెయిలండర్ కావురి సాయితేజ(13) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దాంతో సౌత్ జోన్ ఇన్నింగ్స్ ముగిసింది. తిలక్ వర్మ అజేయంగా నిలవగా.. శ్రేయస్ గోపాల్(169 బంతుల్లో 11 ఫోర్లతో 87) తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. నార్త్ జోన్ బౌలర్లలో గుర్నూర్ బ్రార్ (4/88) నాలుగు వికెట్లు తీయగా.. అర్ష్‌దీప్ సింగ్, అన్షుల్ కాంబోజ్ రెండేసి వికెట్లు పడగొట్టారు. అబిద్ ముస్తాక్‌కు ఒక వికెట్ దక్కింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన నార్త్ జోన్ 59.1 ఓవర్లలో 195 పరుగులకు కుప్పకూలింది. ఖమ్రాన్ ఇక్బాల్(182 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 76) ఒక్కడే హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. కన్హయ వధవాన్(35) పర్వాలేదనిపించాడు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. సౌత్ జోన్ బౌలర్లలో విద్వత్ కావేరప్ప(4/64) నాలుగు వికెట్లు తీయగా.. నిదీష్(2/36), తనయ్ త్యాగరాజన్(2/31) రెండేసి వికెట్లు పడగొట్టారు. కావురి సాయితేజ, శ్రేయాస్ గోపాల్‌కు చెరో వికెట్ దక్కింది.

## టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా నెంబర్ వన్

### ర్యాంకింగ్స్‌లో నాల్గో స్థానంలో భారత్

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025 విజేత దక్షిణాఫ్రికా, 27 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత %×జజ% ట్రోఫీని గెలుచుకుంది. ఫైనల్‌లో గత ఛాంపియన్ ఆస్ట్రేలియాను దక్షిణాఫ్రికా 5 వికెట్ల తేడాతో ఓడించి చరిత్ర సృష్టించింది. ఇప్పుడు త్వరలో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్ ప్రారంభం కానుంది, దీనికి ముందు టెస్ట్ ఫార్మాట్‌లో తాజా ర్యాంకింగ్‌లను చూడవచ్చు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025 రన్నరప్ ఆస్ట్రేలియా ప్రస్తుతం టెస్ట్ ర్యాంకింగ్‌లలో మొదటి స్థానంలో ఉంది, ప్రస్తుతం ఆ జట్టుకు 123 పాయింట్లు ఉన్నాయి. %ఔజ% 2025 ఛాంపియన్ దక్షిణాఫ్రికాకు ర్యాంకింగ్‌లలో ప్రయోజనం చేకూరింది, ఇది రెండో స్థానానికి చేరుకుంది, ఇప్పుడు ఆ జట్టు 114 పాయింట్లతో ఉంది. ఇంగ్లాండ్ 113 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. కొన్ని నెలల క్రితం వరకు భారత జట్టు టెస్ట్ ర్యాంకింగ్‌లలో అగ్రస్థానంలో ఉంది, అయితే న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో వరుస సిరీస్‌లలో ఓడిపోవడంతో నాల్గో స్థానానికి పడిపోయింది, ప్రస్తుతం 105 పాయింట్లు ఉన్నాయి. %ఔజ% 2021 విజేత న్యూజిలాండ్ ఐదో స్థానంలో, శ్రీలంక ఆరో స్థానంలో ఉన్నాయి. పాకిస్తాన్ ఏడో, వెస్టిండీస్ ఎనిమిదో, బంగ్లాదేశ్ తొమ్మిదో, ఐర్లాండ్ పదో స్థానంలో ఉన్నాయి. భారత్ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్ ఇంగ్లాండ్‌తో సిరీస్‌తో ప్రారంభం కానుంది.

# అఫ్గాన్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టు ప్రకటన

అఫ్గానిస్థాన్ జరిగే మూడు టీ20ల సిరీస్‌కు భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని 15 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను మంగళవారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. గాయాలతో జట్టుకు దూరమైన స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాతో పాటు హర్షిత్ రాణా, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్‌లు పునరాగమనం చేశారు. అయితే ఈ నలుగురు ఫిట్‌నెస్ నిరూపించుకోవాలని బీసీసీఐ పేర్కొంది. ఫిట్‌నెస్ పరీక్షలో నెగ్గితేనే జట్టులో కొనసాగుతారని స్పష్టం చేసింది.సంజూ శాంసన్ రీఎంట్రీ ఇవ్వగా.. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, శివమ్ దూబే, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. హార్దిక్ పాండ్యా ఈ సిరీస్‌కు కూడా దూరమయ్యాడు. ప్రాక్టీస్‌లో అతని కాలికి గాయం కావడంతోనే ఎంపిక చేయలేదనే వాదన వినిపిస్తోంది. అయితే బీసీసీఐ మాత్రం హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్ గురించి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. నితీష్ రెడ్డి రీఎంట్రీ ఇవ్వడంతో సూర్యాన్ష్ షెడ్గే చోటు కోల్పోయాడు. ఆర్‌సీబీ ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యాను ఎంపిక చేస్తారని ప్రచారం జరిగినా.. సెలెక్టర్లు ఏ మాత్రం పట్టించుకోలేదు. జస్‌ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా రీఎంట్రీతో గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్, యష్ ఠాకూర్ వంటి యువ పేసర్లకు అవకాశం లేకుండా పోయింది. సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో న్యూఢిల్లీ వేదికగా ఈ మూడు టీ20ల సిరీస్ జరగనుంది. ఈ సిరీస్‌కు అఫ్గానిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. అఫ్గాన్‌లో సరైన క్రికెట్ మైదానాలు లేకపోవడంతో ఆ జట్టు దుబాయ్, భారత్ వేదికగా తమ ఆతిథ్య మ్యాచ్‌లు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అఫ్గాన్‌తో టీ20



సిరీస్ భారత జట్టు : శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్(కీపర్), సంజూ శాంసన్(కీపర్), తిలక్ వర్మ(వైస్ కెప్టెన్) శివమ్ దూబే, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రాలి, హర్షిత్ రాణాలి, నితీష్ కుమార్ రెడ్డిలి, వాషింగ్టన్ సుందర్‌లి.

# విశ్వేజి

# రోజూ ఈ జ్యూస్ తాగండి..
# వంద ఆరోగ్య ప్రయోజనాలు పొందండి!





మనకు అనేక రకాల పండ్ల జ్యూస్ తెలుసు కానీ గోధుమ గడ్డి జ్యూస్ లో ఉన్న పోషకాలు, మిటమిన్లు ఇతర ఏ పండ్ల జ్యూస్ లో కూడా లభించవు. వినడానికి నమ్మశక్యంగా లేకపోయినా గోధుమ గడ్డి జ్యూస్ మన శరీరానికి ఎంతగా ఉపయోగపడుతుందో ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలి. రోగ నిరోధక వ్యవస్థను అభివృద్ధి పరచడానికి సహాయ పడే మిటమిన్లు ఉన్నాయి.. గోధుమ గడ్డి జ్యూస్ తో బోలెడు ఆరోగ్యం గోధుమ గడ్డి జ్యూస్ కోలాజెన్ ఉత్పత్తిని మెరుగుపరుస్తూ యవ్వనంగా ఉండటానికి దోహదపడుతుంది. మొహం పై మొటిమలు రాకుండా పోరాడుతుంది. ఈ జ్యూస్ లో ఉన్న పోషకాలు జీర్ణ ఎంజైమ్ ల ఉత్పత్తిని మెరుగుపరుస్తూ ఆహారంలోని పోషకాలను శరీరానికి అందించడానికి ఉపయోగపడుతుంది. బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతి కలిగిస్తుంది. జీర్ణ వ్యవస్థను మెరుగుపరచడంలో ఎంతగానో ఉపయోగపడుతుంది. షుగర్ కు, చెడు కొలెస్ట్రాల్ కు చెక్ గోధుమగడ్డి జ్యూస్ యొక్క అతి ముఖ్యమైన ప్రయోజనాలలో రక్తంలో షుగర్ ని తగ్గించడానికి దోహదపడుతుంది. మధుమేహం ఉన్నవారికి ఉపయోగంగా ఉంటుంది. గోధుమ గడ్డి జ్యూస్ ని క్రమం తప్పకుండా తీసుకోవడం వలన ఒంట్లో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్ని పూర్తిగా కరిగిస్తుంది.గుండె సంబంధిత వ్యాధులను గోధుమ గడ్డి జ్యూస్ తో చెక్ పెట్టొచ్చు. క్రమం తప్పకుండా జ్యూస్ తాగినట్లయితే కొలెస్ట్రాల్ ను కొంత కంట్రోల్ చేసుకునే గోధుమ గడ్డి జ్యూస్ పనిచేస్తుంది. రోగ నిరోధక శక్తికి గోధుమ గడ్డి జ్యూస్ పని వలన బాగా ఒత్తిడికి గురయ్యే వారికి ఒత్తిడిని తగ్గించడానికి ఈ జ్యూస్ ఒక మెడిసిన్ లాగా పని చేస్తుంది. రోగ నిరోధక శక్తిని బలోపేతం చేయడంతో అంటువ్యాధులు కానీ ఏ ఇతర వ్యాధులు సోకకుండా ఈ జ్యూస్ మన శరీరంలో నిరంతరం పోరాడుతుంది. నెలసరి సమయాల్లో మహిళలకు అధిక రుతుస్రావం సమస్యను తగ్గించటానికి గోధుమ గడ్డి జ్యూస్ ఉపశమనం కలిగిస్తుంది. గోధుమ గడ్డిని ఇంట్లోనే పెంచుకోండిలా చిన్న చిన్న మట్టి పాత్రలు లేదా ఖాళీ డబ్బాలలో చెక్కపొట్టు, వరిపొట్టు ,ఎర్రమట్టి మూడు కలిపి ఒక పాత్రలో వేసి కలిపిన మిశ్రమం పైన గోధుమలు చల్లి మట్టి వేసి, మట్టి తడిసేంతవరకు వాటర్ పోసి ఉదయాన్నే పాత్రలను సూర్యరశ్మికి పెట్టి మధ్యాహ్నం నుండి కొద్దిగా చల్లటి ప్రాంతంలో పెట్టుకున్నట్లైతే 15 రోజుల నుండి 20 రోజుల ప్రాంతంలో గోధుమ గడ్డి జ్యూస్ చేసుకోవడానికి అనువుగా పెరుగుతుంది. తాటికల్లు ఆరోగ్య అద్భుతాలు తక్కువేం కాదు.. కానీ ఇది గుర్తు పెట్టుకోండి! గోధుమ గడ్డి జ్యూస్ చేసుకోండిలా ఈ సమయంలో పెరిగిన గడ్డిని కాండం వరకు కోసుకొని గడ్డిని చిన్నచిన్న ముక్కలుగా కట్ చేసి కట్ చేసిన గడ్డిని మిక్సీ గిన్నెలో వేసి గడ్డి తో పాటు కొద్దిగా వాటర్ కలిపి జ్యూస్ చేసుకొని వాటర్ కలిపిన జ్యూస్ లో పొడి పిప్పిని తీసివేసి ఆ విధంగా రోజు గోధుమ గడ్డి జ్యూస్ తీసుకోవడం వల్ల ఇంకా మరిన్ని ప్రయోజనాలు ఉంటాయి..అయితే రోజు జ్యూస్ తాగాలి అనుకునేవారు రెండు మూడు పాత్రలో గోధుమ గడ్డిని పెంచుకున్నట్లయితే గడ్డి లేతగా ఉన్నప్పుడే ముదిరిపోక ముందే గడ్డి కోసుకొని జ్యూస్ చేసుకుంటే బోలెడన్ని ప్రయోజనాలు ఉంటాయి.



## షుగర్,బీపీ కంట్రోల్ లో ఉంచాలంటే.. పరగడుపునే వీటిని తినాలంట!

మనదేశాన్ని వరల్డ్ డయాబెటిస్ క్యాపిటల్ అని కూడా పిలుస్తుంటారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా మనదేశంలో షుగర్ లేదా డయాబెటిస్ వ్యాధితో బాధపడేవాళ్లు ఉన్నారు. వాస్తవానికి షుగర్ వ్యాధిని కంట్రోల్ చేయడానికి మెడిసిన్ ఉంది కానీ పూర్తిగా నయం చేసే మెడిసిన్ ఇప్పటిదాకా రాలేదు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 83 కోట్ల మంది మధుమేహంతో బాధపడుతున్నారు. అదే సమయంలో సుమారు 22 మిలియన్ల మంది అధిక రక్తపోటు సమస్యతో జీవిస్తున్నారు. ఒక వ్యక్తి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలనుకుంటే రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిని క్రమం తప్పకుండా ఉంచుకోవడం చాలా అవసరం. ఈ రెండింటినీ బ్యాలెన్స్ గా ఉంచడానికి జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలి. ఎవరైనా వ్యక్తి రక్తంలో చక్కెర,రక్తపోటును నియంత్రించడంలో ఆహారాలు కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా ఫైబర్, కొవ్వు తీసిన ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉండే సమతుల్య ఆహారం రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది, ఇన్సులిన్ నిరోధకతను నిరోధిస్తుంది. అంతేకాకుండా ఉప్పు, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు, ప్రాసెస్ చేసిన ఆహారాలను తగ్గించడం అధిక రక్తపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. కొన్ని ప్రత్యేకమైన ఆహారాలు, పానీయాలను ఉదయాన్నే పరగడుపున తీసుకోవడం ద్వారా మధుమేహం, అధిక రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. నిపుణులు తెలిపిన ప్రకారం డయాబెటిస్, రక్తపోటు అదుపులో ఉండటానికి ఉదయం ఖాళీ కడుపుతో ఏమి తినాలో ఇక్కడ చూడండి. మెంతుల నీరు మెంతులు శరీర వేడిని తగ్గించడానికి సహాయపడే అద్భుతమైన పదార్థం. మెంతుల విత్తనాలు మధుమేహాన్ని నియంత్రించడానికి విస్తృతంగా ఉపయోగించబడుతున్నాయి. అంతేకాకుండా ఈ మెంతుల విత్తనాలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర గ్రహించబడటాన్ని నెమ్మదిస్తుంది. మెంతుల విత్తనాలను రాత్రిపూట నీటిలో నానబెట్టి మరుసటి రోజు ఉదయం పరగడుపున తీసుకోవాలి. టొమాటో, దానిమ్మ రసం టొమాటో, దానిమ్మ రెండింటిలోనూ యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ముఖ్యంగా టొమాటోలో లైకోపీన్ ఉంటుంది. ఇది కొవ్వు, రక్తపోటును తగ్గించడంలో సహాయపడే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. అదే సమయంలో దానిమ్మ శరీరంలో బ్లడ్ సర్క్యులేషన్ మెరుగుపరచడానికి, వాపును తగ్గించడానికి సహాయపడుతుంది. ఇలాంటి టొమాటో రసంతో దానిమ్మ రసం కలిపి ఉదయం పరగడుపున తాగడం వల్ల రక్తంలో షుగర్ లెవల్, రక్తపోటు అదుపులో ఉంటాయి. %ూశీషవతీవం దీఎ% సమ్మర్ లో తాగాల్సిన జ్యూస్ ఇదే..దీని ప్రయోజనాలు తెలిస్తే అర నిమిషం ఆగరు! అవిసె గింజలు అవిసె గింజల్లో ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు వంటివి అధికంగా ఉంటాయి. అవిసె గింజలను ఉదయం తీసుకోవడం చాలా మంచిది. ఈ గింజలు బ్లడ్ లో షుగర్ లెవల్, రక్తపోటును నియంత్రణలో ఉంచడంలో సహాయపడతాయి. అవిసె గింజల్లోని అధిక ఫైబర్ కార్బోహైడ్రేట్ల జీర్ణక్రియను నెమ్మదింపజేయడం ద్వారా రక్తంలో చక్కెరను స్థిరంగా ఉంచడానికి సహాయపడుతుంది. ఇలాంటి అవిసె గింజలను మెత్తగా పొడి చేసి నీటిలో కలిపి ఉదయం నిద్రలేచిన వెంటనే పరగడుపున తాగితే..షుగర్, బీపీ అదుపులో ఉంటాయి. పసుపు కలిపిన నిమ్మరసం పసుపు అనేది యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉన్న అద్భుతమైన సుగంధ ద్రవ్యం. పసుపు రక్తంలో చక్కెర,రక్తపోటును నిర్వహించడానికి సహాయపడుతుంది.

# కూల్ డ్రింక్స్‌తో నోటి క్యాన్సర్ ముప్పు..

## తాజా అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెలుగులోకి!

ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు పెద్దలు. కానీ నేటి ఆధునిక జీవనశైలిలో ఆహారపు అలవాట్లు పూర్తిగా మారిపోయాయి. ముఖ్యంగా యువతరం కూల్ డ్రింక్స్, స్వీట్ డ్రింక్స్ అంటూ తీపి పానీయాలకు బానిసలవుతున్నారు. వీటివల్ల కలిగే అనర్థాల గురించి తెలిసినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. తాజాగా జరిగిన ఒక అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. రోజుకు ఒక్క తీపి పానీయం తాగే మహిళలకు నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఐదు రెట్లు ఎక్కువ అని తేలింది! నోటి కుహరంలో ఏర్పడే క్యాన్సర్ మహిళల్లో వేగంగా పెరుగుతోందని వాషింగ్టన్ విశ్వవిద్యాలయం నిర్వహించిన తాజా అధ్యయనంలో వెల్లడైంది. ముఖ్యంగా పొగత్రాగని, మద్యం సేవించని యువతుల్లో ఈ క్యాన్సర్ కేసులు అధికంగా నమోదు కావడం వైద్య నిపుణులను సైతం ఆందోళనకు గురిచేస్తోంది. దీనికి ప్రధాన కారణం ఆహారపు అలవాట్లేనని పరిశోధకులు చెబుతున్నారు. జమా ఓటోలారిన్జాలజీ-హెడ్ అండ్ నెక్ సర్జరీ జర్నల్‌లో ప్రచురించబడిన ఈ అధ్యయనం ప్రకారం, తీపి పానీయాలకు పెద్దపేగు , జీర్ణశయాంతర క్యాన్సర్లతో సంబంధం ఉందని తెలిపింది. కానీ, తల, మెదడు క్యాన్సర్లతో వాటి సంబంధంపై ఇప్పటివరకు పెద్దగా పరిశోధనలు జరగలేదు. ఈ నేపథ్యంలో వాషింగ్టన్ విశ్వవిద్యాలయం చేసిన ఈ అధ్యయనం ఎన్నో ఆసక్తికర విషయాలను వెల్లడించింది. అయితే "నోటి కుహర క్యాన్సర్.. రొమ్ము , పెద్దపేగు క్యాన్సర్ కంటే తక్కువ . ప్రతి సంవత్సరం 100,000 మందికి 4-4.3 కేసులు నమోదవుతున్నాయి. అయితే, పొగత్రాగని, మద్యం సేవించని మహిళల్లో నోటి కుహర క్యాన్సర్ కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది" అని అధ్యయన ప్రధాన రచయిత , వాషింగ్టన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ యొక్క ఓటోలారిన్జాలజీ హెడ్ అండ్ నెక్ సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బ్రిటనీ బార్బర్ పేర్కొన్నారు. %ూశీషవతీవం దీఎ% తీపి పదార్థాలు నేరుగా క్యాన్సర్‌కు కారణం కానప్పటికీ, వాటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల ఊబకాయం వస్తుంది. ఊబకాయం



అనేక రకాల క్యాన్సర్లకు ముఖ్యంగా నోటి క్యాన్సర్‌కు ప్రధాన ప్రమాద కారకం అని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు, తీపి పానీయాలు ఎక్కువగా తాగడం వల్ల శరీరంలో మంట, డయాబెటిస్ వంటి ఇతర ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయి. ఇవి కూడా క్యాన్సర్‌కు కారణమయ్యేవే అని చెబుతున్నారు. నోటి క్యాన్సర్ అంటే ఏమిటి? నోటి క్యాన్సర్ మీ నోటి లోపల ఏర్పడుతుంది. ఇది పెదవులు, చిగుళ్ళు, నాలుక, బుగ్గలు, నోటి పైకప్పు లేదా నోటి దిగువ భాగంలో ఎక్కడైనా సంభవించవచ్చు. సాధారణంగా నోటిలో వచ్చే సమస్యల్లాగే ఇది కూడా మొదలవుతుంది. తెల్లటి మచ్చలు లేదా రక్తస్రావం అయ్యే పుండ్లు వంటివి కనిపిస్తాయి. కానీ సాధారణ సమస్యలకు, క్యాన్సర్‌కు మధ్య తేడా ఏమిటంటే, ఈ మార్పులు రెండు వారాల్లో తగ్గవు. చికిత్స చేయకుండా వదిలేస్తే, నోటి క్యాన్సర్ మీ నోరు , గొంతు నుండి తల , మెడలోని ఇతర భాగాలకు వ్యాపిస్తుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, నోటి కుహర క్యాన్సర్ నిర్ధారణ అయిన ఐదేళ్ల తర్వాత 63 శాతం మంది మాత్రమే జీవించి ఉన్నారు. అందుకే, నోటి క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం చాలా ముఖ్యం. నోటి క్యాన్సర్ సంకేతాలు, లక్షణాలు: నోటి క్యాన్సర్‌కు సంబంధించిన అనేక సంకేతాలు , లక్షణాలు సాధారణ సమస్యలు లేదా నోటిలో వచ్చే మార్పులుగా పొరబడే అవకాశం ఉంది. పెదవిపై లేదా నోటి లోపల పుండ్లు సులభంగా రక్తస్రావం అవుతాయి, రెండు వారాల్లో నయం కావు. నోటిలో కారణం లేకుండా రక్తస్రావం అవడం. ముఖం , మెడపై లేదా నోటిలో తిమ్మిరి, నొప్పి లేదా సున్నితత్వం కనిపించడం. నమలడం లేదా మింగడం, మాట్లాడటం లేదా దవడ లేదా నాలుకను కదిలించడంలో ఇబ్బంది. కారణం లేకుండా బరువు తగ్గడం. దీర్ఘకాలిక దుర్వాసన రావడం వంటి లక్షణాలు కన్పించవచ్చు. కాబట్టి, వీటిని తేలికగా తీసుకోకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిది. అనారోగ్యాల పాలు చేస్తున్న తీపి పానీయాలు తాగడం తగ్గించండి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోండి. నోటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి. నోటిలో ఎలాంటి మార్పులు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించండి. ముందు జాగ్రత్తలు తీసుకుంటే, నోటి క్యాన్సర్ ముప్పును నివారించవచ్చు.

# మార్కెట్

## సొంత టెలికాం టెక్నాలజీ ఉన్న టాప్-5 దేశాల్లో భారత్ ఒకటి

### కేంద్రమంత్రి సింధియా



సొంత టెలికాం టెక్నాలజీ కలిగిన దేశాల సరసన భారత్ చేరిందని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. భారత్ కన్నా ముందు చైనా, ఫిన్లాండ్, స్వీడన్, దక్షిణా కొరియా మాత్రమే ఈ టెక్నాలజీ ఉందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా టెలికాం కంపెనీలు విలీనవుతున్నాయన్నారు. భారత్‌లో నాలుగు కంపెనీలు ఉన్నాయన్నారు. 2014లో 90కోట్ల మంది మొబైల్ కస్టమర్స్ ఉండగా.. నేడు ఈ సంఖ్య 1.2 మిలియన్లకుపైగా పెరిగిందన్నారు. అప్పుడు 25కోట్ల మంది ఇంటర్నెట్‌కు కనెక్ట్ అయ్యారని.. ప్రస్తుతం 97కోట్ల మంది ఇంటర్నెట్ యూజర్లు ఉన్నట్లు తెలిపారు. 2014లో ఆరు కోట్ల మందికి బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ ఉందని.. ఆ సంఖ్య నేడు 94 కోట్లకు చేరుకుందని.. ఇది అమెరికా మొత్తం జనాభా కంటే ఎక్కువ అని తెలిపారు. భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ దేశవ్యాప్తంగా లక్ష స్వదేశీ 4జీ మొబైల్ టవర్లను ఏర్పాటు చేస్తోందని.. వీటిని 5జీగా మారుస్తామని మంత్రి చెప్పారు. ఈ పని జూన్ నాటికి పూర్తవుతుందన్నారు. ఆత్మనిర్భర్ భారత్ యోజన కింద జరుగుతోందన్నారు. ప్రభుత్వం డైరెక్ట్-టు-డివైస్ ఉపగ్రహ సేవలను ప్రారంభించిందని సింధియా చెప్పారు. ఈ సాంకేతికతలో నెట్‌వర్క్‌కు కనెక్ట్ కానప్పుడు కూడా స్మార్ట్‌ఫోన్ నుంచి సందేశాలను పంపొచ్చన్నారు. అప్పుడు కనెక్టివిటీ మొబైల్ టవర్ నుంచి కాకుండా ఉపగ్రహం నుంచి నేరుగా అందుతుందన్నారు. ఎలాన్ మస్క్ స్టార్‌లింక్ భారతదేశంలో ఉపగ్రహ కమ్యూనికేషన్ సేవలను ప్రారంభించడానికి దరఖాస్తు చేసుకోవడమే కాకుండా.. ఇతర అనేక కంపెనీలు సైతం ఆసక్తిని చూపించాయన్నారు. ఉపగ్రహ కమ్యూనికేషన్ సేవల కోసం ఇప్పటికే రెండు కంపెనీలకు లైసెన్స్‌లు ఇచ్చామని సింధియా చెప్పారు. ఇందులో ఒకటి రిలయన్స్, మరొకటి భారతీ ఎయిర్‌టెల్‌కు జారీ చేసినట్లు వివరించారు.

# భారత్‌లో ఆస్టర్ ఎస్‌యూవీని లాంచ్ చేసిన ఎంజీ మోటార్స్..

## ఫీచర్స్, ధర వివరాలు ఇవే..!

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా తొలిసారిగా ఆస్టర్ యూఎస్‌వీని భారత్ మార్కెట్‌లో లాంచ్ చేసింది. ఇందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉండడం విశేషం. ఏఐ టెక్నాలజీ ఉన్న తొలి ఎస్‌యూవీ ఇదే కావడం విశేషం. ఈ ఎస్‌యూవీ దాదాపు రూ.10లక్షలు (ఎక్స్‌షోరూం) ప్రారంభ ధరకే అందుబాటులో ఉంటుంది. ఈ యూఎస్‌వీకి 'బ్లాక్‌బస్టర్ ఎస్‌యూవీ'గా పేరు పెట్టింది. ఈ వెర్షన్‌లో వాహనం ఇంజిన్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. తద్వారా మరిన్ని ప్రీమియం ఫీచర్లను సరసమైన ధరకు అందుబాటులో ఉండొచ్చు. ఈ సారి కంపెనీ 1.3-లీటర్ టర్బోచార్జ్డ్ పెట్రోల్ ఇంజిన్‌ను తొలగించింది. ఇప్పుడు ఎంజీ ఆస్టర్ 1.5 లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్‌తో రానున్నది. ఈ ఇంజిన్ 109 బీహెచ్‌పీ పవర్, 144 ఎన్ఎం టార్క్‌ని ఉత్పత్తి చేస్తుంది. ఈ ఇంజిన్‌తో 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, లేదంటే.. 8 స్పీడ్ సీవీటీ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌తో లభించనున్నది. 2025 ఆస్టర్ రూ.13 లక్షల (ఎక్స్-షోరూమ్) కంటే తక్కువ ప్రారంభ ధరకు పనోరమిక్ సన్‌రూఫ్‌ను అందించే ఏకైక ఎస్‌యూవీ అని ఎంజీ పేర్కొంది. ఇది షైన్ వేరియంట్‌లో అందుబాటులో ఉంది. దాంతో పాటు ఇప్పుడు సెలెక్ట్ వేరియంట్‌కు ఆరు ఎయిర్‌బ్యాగులు, ఐవరీ లెదర్ సీట్లతో రానుంది. ఇది మరింత సురక్షితంగా, ఆకర్షణీయంగా మారుస్తుంది. ఈ ఎస్‌యూవీకి అనేక ప్రీమియం, అధునాతన ఫీచర్లు జోడించింది. ముందు వరుసలో వెంటిలేటెడ్ సీట్లు, వైర్‌లెస్ ఛార్జర్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్‌ప్లే, ఆటో-డిమ్మింగ్ ఐఆర్‌వీఎం వంటివి డ్రైవింగ్‌ను మరింత సౌకర్యవంతంగా, సురక్షితంగా మారుస్తాయి. దాంతో పాటు ఇది కొత్త ఐ




స్మార్ట్ 2.0 సిస్టమ్‌తో వస్తుంది. ఇది అధునాతన వినియోగదారు ఇంటర్‌ఫేస్, 80 కంటే ఎక్కువ కనెక్ట్ ఫీచర్స్‌తో వస్తుంది. స్పెషల్ ఫీచర్లలో జియో వాయిస్ రికగ్నిషన్ సిస్టమ్‌తో రానుంది. డిజిటల్ కీ యాక్టివిటీతో కలిపిన యాంటీ-థెఫ్ట్ ఫీచర్ నెట్‌వర్క్ కనెక్షన్ లేకుండానే సేఫ్టీని అందిస్తుంది. అలాగే, ఇది వెదర్, క్రికెట్ అప్‌డేట్స్, కాలిక్యులేటర్, సమయం, తేదీ, రోజువారీ సమాచారం, రాశిఫలాలు, డిక్షనరీ, వార్తలు, నాలెడ్జ్ కోసం వాయిస్ కమాండ్స్ సైతం అందిస్తుంది. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా సేల్స్ అండ్ ఆపరేషన్స్ డైరెక్టర్ రాకేశ్ సేన్ మాట్లాడుతూ.. ఎంజీ ఆస్టర్ ప్రస్తుతం కొత్త విశ్వాసంతో మార్కెట్‌లోకి వచ్చిందన్నారు. కేవలం కారు మాత్రమే కాకుండా గొప్ప డ్రైవింగ్ అనుభవం కోరుకునే వారికి సరైన ఎస్‌యూవీ అని తెలిపారు. ఎంజీ మోటార్ ఇండియా వందకుపైగా దేశాల్లో ఉనికిలో ఉండగా.. గ్లోబల్ ఫార్చ్యూన్ 500 కంపెనీ అయిన ఎస్ఏఐసీ మోటార్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఒక జాయింట్ వెంచర్. ఈ జాయింట్ వెంచర్‌ని 2023లో స్థాపించారు.

# ఆంధ్రప్రదేశ్

## మదర్సా విస్తరణ కోసం దుర్మార్గం

**పాక్‌లో పురాతన హిందూ ఆలయం కూల్చివేత**

లాహోర్,సెప్టెంబర్1 : పాకిస్థాన్‌లో దారుణం జరిగింది. ఓ పురాతన హిందూ దేవాలయాన్ని నిర్దాక్షిణ్యంగా కూల్చేశారు. దేశ విభజన తరవాత ఎన్నో దేవాలయాలను కూల్చిన పాక్ ప్రభుత్వం తాజాగా మరో పురాతన దేవాలయాన్ని కూల్చింది. మదరసా విస్తరణ కోసం 100 ఏళ్ల నాటి హిందూ దేవాలయాన్ని కూల్చేసిన ఘటన పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో చోటుచేసుకుంది. న్యూస్ ఏజెన్సీ రిపోర్ట్ ప్రకారం.. లాహోర్‌కు దాదాపు 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న నరోవాల్ జిల్లాలోని 'సిరాజ్' అనే గ్రామంలో 100 ఏళ్లనాటి ఓ ఆలయం ఉంది. ఆ ఆలయం సుమారు 1,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంది. ఆలయం పక్కనే మదరసా ఉంది. నిషేధిత తీవ్రవాద ఇస్లామిక్ పార్టీ 'తెహ్రీక్-ఇ-లబ్బైక్ పాకిస్తాన్'కి చెందిన కొందరు వ్యక్తులు మదరసాను విస్తరించటం కోసం ఆగస్టు 21వ తేదీన ఆలయాన్ని కూల్చివేశారు. ఆలయ శిఖరానికి సంబంధించిన మెటల్ ఫిట్టింగులను, ఇటుకలను అక్కడి నుంచి తరలించారు. హక్కుల కార్యకర్తలు ఈ సంఘటనపై వెంటనే దర్యాప్తు చేయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కూలగొట్టిన చోటే ఆలయాన్ని పునర్నిర్మించాలని స్థానిక నాయకులు, మైనారిటీ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. సంఘటనపై ప్రభుత్వ వాదనలు భిన్నంగా ఉన్నాయి. 100 నుంచి 125 ఏళ్ల చరిత్ర కలిగిన ఆ గుడి భారీ వర్షాల కారణంగా కూలిపోయిందని ప్రభుత్వం అంటోంది. ఎవాక్యూ ట్రస్ట్ ప్రాపర్టీ బోర్డ్ అధికారి మీడియాతో మాట్లాడుతూ.. 'ప్రభుత్వ రికార్డుల్లో గుడికి పేరు లేదు. అది చాలా పురాతనమైన గుడి. 100 నుంచి 125 సంవత్సరాల పాతది. భారీ వర్షాల కారణంగా గుడి కూలిపోయింది. ఆ భూమిని ఎవ్వరికీ లీజుకు ఇవ్వలేదు. గుడిని పునర్నిర్మించే బాధ్యత మా అధికారులు తీసుకుంటారని తెలిపారు.

## ఎంఎస్ఎంఈల పటిష్టతతోనే 2047 లక్ష్యాలు సాధ్యం

**- అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానమే ప్రభుత్వ లక్ష్యం**
**- ఏపీలో ఎంఎస్ఎంఈలకు అనుకూల వాతావరణం**
**- ఎస్ఐసిసిఐ 116వ వార్షిక సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

అమరావతి, సెప్టెంబర్ 1 : ఎంఎస్ఎంఈల పటిష్టతతోనే 2047 లక్ష్యాలు సాధ్యమవుతాయని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం దక్షిణ భారత చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ 116వ వార్షిక సర్వసభ్య సమావేశం చెన్నైలోని హోటల్ లీలా ప్యాలెస్‌లో ఘనంగా జరిగింది. దక్షిణ భారతదేశంలో వ్యాపార, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు ఈ సమావేశంలో చర్చలు జరిపారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కొండపల్లి మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తలను, యువతను ప్రోత్సహించడం ద్వారానే సమగ్ర ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకు ప్రభుత్వం, పారిశ్రామిక వర్గాలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని మంత్రి పిలుపుఇచ్చారు. పారిశ్రామిక పార్కులు, ఉమ్మడి వసతులు, ఆర్థికసాయంతో ఏపీలో ఎంఎస్ఎంఈలకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇండియా-ఈయూ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ (ఈుం), ఎన్ఆర్ఐ వర్గాల సహకారంతో స్థానిక పరిశ్రమలను అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఎస్ఐసిసిఐ అధ్యక్షుడు అరుణ్ అలగప్పన్ మాట్లాడుతూ 2047 నాటి భారత వికాస లక్ష్యాలు చిన్న తరహా పరిశ్రమల ప్రగతిపైనే ఆధారపడి ఉన్నాయని.. తమిళనాడు సాధించాలనుకుంటున్న ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ, ఆంధ్రప్రదేశ్ నిర్దేశించుకున్న 'స్వర్ణాంధ్ర ఏ2047' లక్ష్యాల సాధనలో చిన్న పరిశ్రమలే కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం విద్యా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మద్రాస్ యూనివర్సిటీ, అన్నామలై యూనివర్సిటీ, లయోలా ఇన్‌స్టిట్యూట్, త్యాగరాజ కాలేజ్, భారతిదాసన్ యూనివర్సిటీ విద్యార్థులకు మంత్రి పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమం ఎస్ఐసిసిఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వి.ఎన్. శివ శంకర్ ధన్యవాద సమర్పణతో ముగిసింది.

## అంతులేని శోకాన్ని మిగుల్చిన ప్రళయం

**ఇంకా వరదల్లో 275 మంది భారతీయులు**

**ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు**

న్యూఢిల్లీ,సెప్టెంబర్1 : నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో చెలరేగిన వినాశకర ప్రళయం అంతులేని శోకాన్ని మిగుల్చింది. ఈ ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య వెయ్యి దాటగా.. 4,471 మంది ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. గల్లంతైన వారిలో కైలాస మానససరోవర యాత్రకు వెళ్లిన 275 మంది భారత పౌరులతో పాటు మరొక 128 మంది భారత సంతతి వ్యక్తులు ఉన్నారని విదేశాంగ శాఖ వెల్లడించింది. రోజురోజుకూ నదుల్లో మృతదేహాలు కొట్టుకొస్తుండటంతో నేపాల్ శవాగారాలన్నీ నిండిపోయి, మృతదేహాలను భద్రపరచడం, గుర్తించడం అధికారులకు అత్యంత సంక్లిష్టంగా మారింది. గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు నేపాల్ ప్రభుత్వం బాధితుల వివరాలతో పవర్ పాయింట్ స్లైడ్‌షోలను కూడా సిద్ధం చేసింది. ఈ విపత్కర పరిస్థితిలో మృతుల కుటుంబాలకు సహాయం అందించేందుకు ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయం ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. నేపాల్ ప్రభుత్వం వెబ్‌సైట్‌లో విడుదల చేస్తున్న ఫోటోలు, వివరాల ద్వారా మృతదేహాలను గుర్తించిన పక్షంలో.. భౌతికకాయాలను స్వదేశానికి తరలించేందుకు స్థానిక అధికారులతో సమన్వయం చేస్తామని ఎంబసీ తెలిపింది. దీనికోసం నేపాల్ ప్రభుత్వం రూపొందించిన 9 అంచెల నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా మృతదేహ అవశేషాల డాక్యుమెంటేషన్, లభ్యమైన ఫోటోలు, వివరాలను నమోదు చేయాలి. అలాగే పోస్టుమార్టం నిర్వహణ, మరణానికి గల కారణాల నిర్ధారణ, అధికారికంగా వ్యక్తి గుర్తింపు, వేలిముద్రలు, డీఎన్ఏ, ఫోరెన్సిక్ శాంపిళ్ల సేకరణ, మృతుడి పాస్‌పోర్ట్ లేదా ఐడీ వెరిఫికేషన్, ఎంబసీ లేదా కాన్సులర్ సమన్వయ ప్రక్రియ పూర్తి, హ్యాండోవర్ మెమో, రసీదుల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. మృతదేహాలు బాగా కుళ్లిపోయి, ఆకృతులు దెబ్బతినడంతో గుర్తింపు ప్రక్రియ కష్టసాధ్యంగా మారింది. దీంతో నేపాల్ అధికారులు తాత్కాలిక పూడ్చివేతలను ప్రారంభించారు. ప్రతి శరీరానికి డీఎన్ఏ నమూనా తీసుకుని, ప్లాస్టిక్ బ్యాగ్‌లో ఉంచి ట్యాగ్, లోకేషన్ నంబర్‌ను కేటాయించి పూడ్చి పెడుతున్నారు. భవిష్యత్తులో డీఎన్ఏ మ్యాచ్ అయినప్పుడు కుటుంబ సభ్యులకు భౌతికకాయాల అవశేషాలను అప్పగించి తుది సంస్కారాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు.

# ఎన్నికలు ఎప్పుడైనా కూటమిదే విజయం

**గత ప్రభుత్వం పరిశ్రమలు రాకుండా అడ్డుకుంది**

**స్థానిక ఎన్నికల్లోనూ కూటమిదే విజయం**

**ఓటమి భయంతోనే గొడ్డలి పార్టీ ఏకగ్రీవాలు వద్దంటోంది**

**నర్సాపురం పేదల సేవలో ప్రజా వేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు**



నర్సాపురం, సెప్టెంబరు1 : పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు సమ ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. నర్సాపురం నియోజకవర్గం మొగల్తూరులో మంగళవారం నిర్వహించిన పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 31 ఏళ్ల క్రితం సెప్టెంబరు 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేశానని చంద్రబాబు గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టడంతో పాటు ప్రజా చైతన్యం, ప్రజా భాగస్వామ్యం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. పేదలు ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందిస్తున్నామని సీఎం చెప్పారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎన్డీఏ కూటమికి తిరుగులేదని చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థలు బలంగా ఉంటేనే గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు వార్డు సభ్యులు, సర్పంచులు కూడా పాలనలో భాగం కావాలన్నారు. అప్పుడే కేంద్రం నుంచి గ్రామీణాభివృద్ధికి నిధులు వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని సీఎం అన్నారు. ఓటమి భయంతోనే ఏకగ్రీవాలను వద్దని గొడ్డలి పార్టీ నేతలు చెబుతున్నారని అన్నారు. ఏకగ్రీవాలను ప్రభుత్వాలే ప్రోత్సహించాయని. మున్సిపాలిటీలు, ఆయారాం- గయారాం అనే పరిస్థితి లేకుండా కార్పొరేషన్లలో చైర్మన్, మేయర్ల ఎన్నికను ప్రత్యక్షం చేశామని అన్నారు. గొడ్డలి పార్టీ నేతలు బీసీ రిజర్వేషన్లను కూడా తగ్గించేశారని సీఎం ఆక్షేపించారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరక్కుండా అడ్డుకోవటమే గొడ్డలి పార్టీ ఆలోచన అని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని సీఎం స్పష్టం చేశారు. గత పాలకులు పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమేశారని సీఎం విమర్శించారు. దీనివల్ల యువత భవిష్యత్తు దెబ్బతిందన్నారు. ఇప్పుడు పెద్ద ఎత్తున పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొస్తున్నామని తెలిపారు. విద్యుత్ సంస్థలను సమర్థంగా నిర్వహిస్తూ తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ట్రూ డౌన్ ద్వారా విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించామని తెలిపారు. ఆక్వా రైతుకు అండగా నిలిచేందుకు విద్యుత్ యూనిట్ ను రూ.1.5 కే అందిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ మార్కెట్లలో ఇతర దేశాలతో పోటీ పడేలా ఆంధ్రప్రదేశ్ ఆక్వా ఉత్పత్తులను తీర్చిదిద్దాలని అన్నారు. ప్రజా పాలనలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఏఐ ట్యూటర్, ఏఐ డాక్టర్ వంటి వ్యవస్థలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 1.60 కోట్ల కుటుంబాలకు ఆన్‌లైన్‌లో ప్రభుత్వ సేవలు అందించేలా వ్యవస్థను రూపొందించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. పీఎం సూర్యఘర్ పథకం కింద ప్రతి ఇంటిపై సౌర విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుపైనా దృష్టి పెట్టామని తెలిపారు. నర్సాపురం ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆక్వా కల్చర్ యూనివర్సిటీ, డంప్ యార్డు , డెల్టా మోడర్నైజేషన్ వంటి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. వమహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉండాలనే ఉద్దేశంతో 33 శాతం రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. గత ఏడాది లక్ష మంది డ్వాక్రా మహిళలు ఎంఎస్ఎంఈలుగా ఎదిగారని, ఈసారి లక్ష్యాన్ని మరింత పెంచామని తెలిపారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు స్వయం బ్రాండ్ ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీల్లో ఇంకా ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనం ఉందని సీఎం పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్ ఉపసభాపతి రఘురామ కృష్ణం రాజు, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, విప్ బొలిశెట్టి శ్రీనివాస్ స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## విజయసాయిపై చేయిచేసుకున్న సజ్జల

**మంగళగిరి ప్లీనర సందర్భంగా సజ్జల కొట్టారు**

**నెల్లూరు ఎమ్మెల్యే కోటంరెడ్డి సంచలన వ్యాఖ్యలు**

నెల్లూరు,సెప్టెంబర్1 : మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అంటే సజ్జలకు గిట్టదని, ఓసారి చేయికూడా చేసుకున్నారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి.. విజయసాయిరెడ్డిని కొట్టింది నిజమేనని తెలిపారు. మంగళగిరిలో ప్లీనరీ జరిగేటప్పుడు రెస్ట్ రూమ్‌లో వేదికపై ఎవరితో మాట్లాడించాలనే విషయంపై వీరిద్దరి మధ్య వివాదం తలెత్తి, మాటామాటా పెరిగి కొట్టింది వాస్తవమేనని చెప్పుకొచ్చారు. ఆ విషయం చాలామంది నేతలకు తెలుసునని అన్నారు. విజయసాయికి వైసీపీలో 72 అవమానాలు జరిగాయని చెప్పారు. ఆయన నెల్లూరు లోక్‌సభ నుంచి పోటీ చేసినప్పుడు ఎంత నీచంగా, ఘోరంగా మాట్లాడారో అందరికీ తెలుసునని పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరులో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు ఒక్కడికే తెలిసి మరో ఘోర అవమానం జరిగిందని అన్నారు. విజయసాయి తన సొంతూరైన తాళ్లపూడికి వచ్చినప్పుడు, కాకుపల్లి సెంటర్‌లో వంద వాహనాలతో ఘనంగా స్వాగతం పలికారని వెల్లడించారు. దానిపై విజయసాయిని సజ్జల దారుణంగా దూషించారని చెప్పుకొచ్చారు. ఆ మాటలు చెప్పలేని విధంగా ఉన్నాయని అన్నారు. 'నేను చాలా పెద్ద తప్పు చేశానని సజ్జల అన్నారు. అమరావతి రైతులు వరదలు, భారీ వర్షాల్లో ఇబ్బందులు పడుతుంటే నేను మాట్లాడాను. నెల్లూరు రూరల్ నియోజకవర్గం దాటేంత వరకు ఏ ఇబ్బంది వచ్చినా నేను అండగా ఉంటానని చెప్పా. అప్పుడూ సజ్జల... నన్ను చాలా పెద్ద తప్పు చేశావన్నారు. ఇలాంటి మాటలు నాతో మాట్లాడొద్దని.. ఆ తప్పు చేసింది.. నువ్వా, నేనా..? అని సజ్జలను ఎదిరించి మాట్లాడాను. మా ఊరిలో విజయసాయి మీటింగ్ పెట్టి నన్ను ఎలా పడితే అలా తిట్టాడు. ఆయనంటే నాకు మంచి అభిప్రాయం లేదు' అని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. 'వైసీపీ హయాంలోని ఐదేళ్లు ప్రజావ్యతిరేక పాలన సాగించింది. దేశవిదేశాల నుంచి ఆంధ్రులు వచ్చి ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లు వేసి కూటమిని గెలిపించారు. కూటమి ప్రభుత్వ ఘనవిజయం ఓ చరిత్ర అయితే, వైసీపీ ఘోర పరాజయం కూడా చారిత్రక ఘట్టం. ఎందుకు ఓడిపోయామనే ఆలోచన లేకుండా... వైసీపీ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ వికృత రాజకీయం చేస్తుంది. వైసీపీ నేతలు అబద్దాలు చెబుతున్నారు. హిందూ మతానికి ఘోర అన్యాయం జరిగిందని వైసీపీ నేతలు ఎలా మాట్లాడుతున్నారో అర్థం కావట్లేదు. ఆలయాల్లో రథాలు తగులపడినప్పుడు, విగ్రహాల తలలు తెగ్గొట్టినప్పుడు, సింహాల విగ్రహాలు చోరీకి గురైనప్పుడు మీ నోళ్లు ఏమయ్యాయి. తిరుపతి వేంకటేశ్వర ఛానెల్‌ను కూడా రాజకీయాలకు వాడుకున్నారు. వైసీపీ మాజీ మంత్రిపై ఆయన కోడలు. సంచలన ఆరోపణలు చేశారు. ఆమె పెళ్లి అయినప్పుడు హిందువులమని మాజీ మంత్రి చెప్పారని... పెళ్లి అయ్యాక హిందు దేవుళ్లని పూజిస్తే కొట్టారని ఆమె చెప్పింది. జగన్, వైసీపీ నేతలు, సాక్షి మీడియా ఎందుకు ఈ విషయంపై స్పందించట్లేదు. ఏపీని అస్థిరపరచాలని ఓ భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు రాకూడదని ఫేక్ వీడియోలతో ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకోం. వైసీపీ క్రెడిట్ చోరీ చూస్తుంటే... నాగార్జునసాగర్, సోమశిల, తెలుగుగంగ ప్రాజెక్టులు కట్టింది జగనే అని చెప్పేటట్లుగా ఉన్నారు. ఇంకా ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కూడా జగనే అని చెప్పేటట్లుగా ఉన్నారు' అని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు.

## విజయవాడ-అమరావతి మధ్య ఐకానిక్ బ్రిడ్జ్

**అమరావతికి నేరుగా ప్రయాణించేలా ప్రణాళిక**

**వేయికోట్లతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం**

విజయవాడ,సెప్టెంబర్1 : విజయవాడ నుంచి అమరావతికి మరో రాజబాటకు అడుగులు పడుతున్నాయి.. కృష్ణా నదిపై అంతర్జాతీయ ప్రమాణాలతో , సిగ్నేచర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.. కేవలం రాకపోకలకు మాత్రమే కాకుండా.. అమరావతికి, ఐకానిక్ ల్యాండ్‌మార్క్‌గా నిలిచేలా ఈ వంతెనను తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది.. 1000 కోట్ల ప్రతిపాదనతో రెడీ అవుతున్నట్లు సమాచారం. ఇప్పటివరకు విజయవాడ నుంచి, అమరావతిలోకి రావాలంటే ,వారధి లేదా, ప్రకాశం బ్యారేజీ మీదుగా రాజధాని ప్రాంతానికి చేరుకోవాలి. పెరుగుతున్న వాహనాలతో, ఈ బ్రిడ్జిలపై ప్రయాణ సమయంలో, తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటివరకు అయితే కొంత పర్లేదు గాని.. మరొక రెండు మూడు సంవత్సరాలు గడిస్తే , అమరావతిలో పూర్తిస్థాయిలో రాకపోకలు ప్రారంభమైతే, ఈ రెండు బ్రిడ్జిలు మీద రాకపోకల వల్ల ట్రాఫిక్ తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో.. వెయ్యి కోట్లతో భారీ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నడుం బిగించింది. ఈ బ్రిడ్జి నిర్మాణంతో విజయవాడ నుంచి రాజధాని అమరావతికి రాకపోకలను మరింత సులభతరం చేయడంతో పాటు.. రాజధాని అభివృద్ధిలో ఈ బ్రిడ్జిని కీలక మౌలిక వసతిగా మార్చాలని ప్రభుత్వం భావిస్తుంది. రాజధాని అవసరాలతో పెరిగిన ట్రాఫిక్ తో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు, ఇబ్బందులు తొలగించడంతోపాటు, పర్యాటక ప్రాజెక్టుగా కూడా దీన్ని మార్చాలన్న ఆలోచనతో అధికారులు ప్రణాళికలు వేస్తున్నారు అని సమాచారం. ప్రతిపాదిత సిగ్నేచర్ ఐకానిక్, బ్రిడ్జి ప్రకాశం బ్యారేజీ, రైల్వే బ్రిడ్జిల మధ్య ప్రాంతంలో నిర్మించేలా ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. సీతానగరం ఘాట్ వైపు నుంచి కనకదుర్గ ఫ్లై ఓవర్ దిశగా.. అక్కడి నుంచి సీడ్ యాక్సెస్ రోడ్డుతో అనుసంధానం కల్పించేలా ప్రాజెక్టును ప్రతిపాదించారు. తెలుగు సంస్కృతికి ప్రతీకగా నిలిచే కూచిపూడి నృత్య భంగిమల స్ఫూర్తితో, ఐకానిక్ డిజైన్ రూపొందించే అవకాశంపైనా చర్చ జరుగుతోంది. పర్యాటకంగా కూడా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు, ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులను, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి సమీకరించే అవకాశాలను పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం ఫీజిబిలిటీ రిపోర్ట్, డీపీఆర్ తయారీ కోసం కన్‌స్టలెంట్ ఎంపిక పక్రియ కొనసాగుతోంది. రాజధాని కనెక్టివిటీని పెంచడంతో పాటు.. అమరావతి స్కైలైన్‌లో మరో ప్రత్యేక నిర్మాణంగా ఈ బ్రిడ్జి నిలిచేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

## ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

అమరావతి,సెప్టెంబర్1 : ఆంధ్రప్రదేశ్ మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీపి కబురు అందించారు. రాష్ట్రంలో త్వరలో పెద్ద ఎత్తున అందుబాటులోకి రానున్న ఏసీ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. మొగల్తూరులో నిర్వహించిన 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తోందని పేర్కొన్నారు. సంక్షేమంతో కూడిన అభివృద్ధే తమ ప్రభుత్వ విధానమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు పింఛన్ల రూపంలోనే ప్రజలకు రూ. 73,000 కోట్లు అందించినట్లు గుర్తుచేశారు. మహిళలు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వారి కష్టాలను తీర్చేందుకే 'దీపం' పథకాన్ని తీసుకువచ్చామని వివరించారు. ఇదే సమయంలో గత వైసీపీ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మెగా డీఎస్సీని అడ్డుకోవాలనే లక్ష్యంతో ఏకంగా 350 కేసులు వేశారని ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్రంలో అభివృద్ధిని ఆపలేరని హితవు పలికారు. కేవలం ప్రజల ప్రయోజనాల కోసమే కూటమి పార్టీలు ఏకమయ్యాయని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రభుత్వం బాధ్యతాయుతంగా ముందుకు సాగుతోందని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

## 'తల్లికి వందనం' నిధుల విడుదలకు సిద్ధం

**సుమారు 2.80 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి**

**ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సాయం**

**మొదటి సంవత్సరం విద్యార్థులకు అందజేత**

అమరావతి,సెప్టెంబర్1 : ఆంధ్రప్రదేశ్‌లో 'తల్లికి వందనం' పథకం కింద డబ్బులు పడకుండా ఎదురుచూస్తున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. మరో మూడు రోజుల్లో అర్హులైన మిగిలిన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఈ నిధులను జమ చేయనున్నట్లు వెల్లడించింది. ముఖ్యంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఈ పథకం కింద ఆర్థిక సహాయం అందనుంది. వాస్తవానికి ఈ నిధులను ఆగస్టు 30వ తేదీనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా, కొన్ని సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది. ఈ నేపథ్యంలో అధికారులు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పునఃసమీక్షించారు. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల నుంచి అర్హులైన లబ్ధిదారుల జాబితాలను స్వీకరిస్తున్నారు. ఈ జాబితాల పరిశీలన పూర్తయిన వెంటనే ఆర్థిక శాఖ నేరుగా ఖాతాల్లోకి నగదును జమ చేయనుంది. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.80 లక్షల మంది విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారు. గతంలో అర్హత ఉండి కూడా వివిధ కారణాలతో నిధులు అందని వారికి సైతం ఈ దఫాలోనే నగదు జమ చేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కాంగ్రెస్ అరాచకానికి పాల్పడుతుంది

**అందుకు రాంచందర్ రావు అరెస్ట్ నిదర్శనం**


**కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారు**

**బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్**

న్యూఢిల్లీ,సెప్టెంబర్1 : తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు అరెస్టు చేయడాన్ని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్రస్థాయిలో తప్పుబట్టారు. ఈ అణచివేత చర్య కాంగ్రెస్ ప్రభుత్వ దివాలాకోరుతనానికి, నియంతృత్వ వైఖరికి అద్దం పడుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ కార్యకర్తల దాడికి గురైన నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళుతున్న రాంచందర్ రావును పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం అత్యంత హేయమని నితిన్ నబీన్ అన్నారు. కాంగ్రెస్ శ్రేణులు భౌతిక దాడులు, అరాచకాలకు పాల్పడుతున్నప్పుడు ప్రేక్షక పాత్ర వహించిన పోలీసు యంత్రాంగం... బాధితులకు అండగా నిలిచేందుకు వెళుతున్న ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడం ఏ రకమైన ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చెప్పే మాటలన్నీ కేవలం ప్రజలను మభ్యపెట్టే నాటకాలని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న ఈ దౌర్జన్యాలు, ప్రతిపక్షాలపై దాడులకు తెలంగాణ ప్రజలు రాబోయే రోజుల్లో తగిన రీతిలో బుద్ధి చెబుతారని నితిన్ నబీన్ హెచ్చరించారు. రాంచందర్ రావు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## వెలిగొండ ఫీడర్ కెనాల్‌లో వద్ద వానరాల సందడి

అమరావతి,సెప్టెంబర్1 : వెలిగొండ ప్రాజెక్ట్ నీటి ప్రవాహంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా 'ఎక్స్'లో ఆసక్తికర పోస్ట్ చేశారు. వెలిగొండ ఫీడర్ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీటిని వానరాలు తాగుతూ దాహం తీర్చుకుంటున్న దృశ్యాన్ని సీఎం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. 'జలంతోనే.. జీవం, జీవితం' అంటూ ఈ వీడియోకు స్పందించారు. వెలిగొండ జలాలు కరవు ప్రాంతాలకు చేరడంతో ప్రజల తాగునీటి అవసరాలతో పాటు మూగజీవాలకు కూడా దాహార్తిని తీర్చడంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం వెలిగొండ ప్రాజెక్ట్ ఫేజ్-1ను సీఎం చంద్రబాబు ప్రారంభించి జాతికి అంకితం చేశారు.




# నవంబర్ 27న మైసా విడుదల

## రిలీజ్ డేట్ ప్రకటించిన మేకర్స్

కథానాయిక రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' రవీంద్ర పుల్లె తెరకెక్కిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేసింది. ఈ చిత్రాన్ని నవంబరు 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ రిలీజ్ డేట్ ప్రకటన సందర్భంగా మేకర్స్ పంచుకున్న క్యాప్షన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. సహజంగానే ఆమె దృఢమైనది.. ఎంచుకున్న మార్గంలో భయం లేనిది.. చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం ఆమె సొంతం. మునుపెన్నడూ చూడని విధంగా 'మైసా' ప్రపంచంలో రష్మికను చూసేందుకు సిద్ధంగా ఉండండి అంటూ చిత్ర బృందం సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. మునుపెన్నడూ లేని విధంగా రష్మిక ఈ సినిమాలో పూర్తిస్థాయి యాక్షన్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి. రష్మిక కథానాయిక. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న చిత్రమిది. దసరా కానుకగా అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఇటీవలే చిత్ర బృందం స్పష్టం చేసి




# మూడు సినిమాలతో మమిత బైజు హ్యాట్రిక్

'ప్రేమలు'తో ఒక్కసారిగా యూత్ క్రష్‌గా మారిన మమితా బైజు .. ఇప్పుడు ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్‌గా మారింది. తన క్యూట్‌నెస్‌తో కట్టిపడేసే ఈ మలయాళ ముద్దుగుమ్మ.. తాజాగా భారతీయ సినీ చరిత్రలోనే ఎవరూ సాధించని ఒక అరుదైన మైలురాయి చేరుకుంది. కేవలం 29 రోజుల వ్యవధిలో ఈ అమ్మడు నటించిన మూడు సినిమాలు వరుసగా రూ.200 కోట్లకుపైగా వసూలు చేసి.. హ్యాట్రిక్ కొట్టిన తొలి భారతీయ నటిగా చరిత్ర సృష్టించింది. ఎన్నో వాయిదాల తర్వాత జులై 23న వచ్చిన 'జననాయగన్' విజయాన్ని అందుకుంది. విజయ్ నటించిన చివరి చిత్రం కావడంతో భారీ అంచనాలు ఉండడంతో బాక్సాఫీస్ వద్ద ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇందులో మమిత.. విజ్జి పాత్రలో ఆకట్టుకుంది. సూర్య కథానాయకుడిగా విశ్వనాథ్ అండ్ సన్స్..: భారీ చిత్రం విడుదలైన కొద్దిరోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.240 కోట్ల గ్రాస్‌తో ఘన విజయం సాధించింది. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాలో మమిత నటన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అల్లరి చేసే పిల్లగా ఆకట్టుకున్న ఆమె.. అమ్మగానూ హృదయానికి హత్తుకునే నటనతో మెప్పించింది. బె÷-లతెహోమ్ కుటుంబ యూనిట్..: నివిన్ పౌలీతో కలిసి మమిత నటించిన ఈ మలయాళ చిత్రం ఆగస్టు 21న విడుదలై సంచలనం విజయం అందుకుంది. ఇప్పటికే రూ.200 కోట్ల మార్క్ దాటి రూ.250 కోట్ల దిశగా దూసుకుపోతోంది. దీన్నే తెలుగులో సెప్టెంబరు 4న విడుదల చేయనున్నారు.




# మారెమ్మ ట్రైలర్ విడుదల

మాస్ మహారాజ రవితేజ సోదరుడి తనయుడు మాధవ్ భూపతిరాజు ప్రధాన పాత్రలో తెరకెక్కిన విలేజ్ యాక్షన్ డ్రామా 'మారెమ్మ' ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో వచ్చిన టీజర్‌తో సినిమాపై ఆసక్తిని పెంచిన చిత్రబృందం.. ఇప్పుడు ట్రైలర్ ద్వారా కథకు సంబంధించిన మరిన్ని ఆసక్తికర అంశాలను ప్రేక్షకులకు పరిచయం చేసింది. గ్రామీణ నేపథ్యం, దైవ విశ్వాసాలు, మూఢనమ్మకాలు, యాక్షన్ అంశాలను మేళవిస్తూ ఈ సినిమాను తెరకెక్కించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. కథ విషయానికి వస్తే.. ఓ సంక్షోభంలో చిక్కుకున్న గ్రామస్తులు తమ గ్రామ దేవత మరెమ్మ తల్లిపై నమ్మకం పెట్టుకుంటారు. అయితే అమ్మవారికి సంబంధించిన పవిత్రమైన ఎద్దు అనూహ్యంగా కనిపించకుండా పోవడంతో గ్రామంలో ఒక్కసారిగా భయాందోళనలు మొదలవుతాయి. ఆ ఎద్దు అదృశ్యం కావడం వెనుక ఏదో పెద్ద కారణం ఉందని గ్రామస్తులు భావిస్తారు. ఈ పరిణామాల నేపథ్యంలో యువ కథానాయకుడిపై ఆ ఎద్దును వెతికి తీసుకురావాల్సిన బాధ్యత పడుతుంది. ఎద్దు కోసం అతడు చేసే అన్వేషణ క్రమంలో ఎన్నో ఊహించని పరిణామాలు ఎదురవుతాయి. గ్రామంలో పాతుకుపోయిన నమ్మకాలు, స్థానిక రాజకీయాలు, ఆధిపత్య పోరాటాలు అతడి ప్రయాణాన్ని మరింత ప్రమాదకరంగా మారుస్తాయి. ఈ క్రమంలో హీరో పలు హింసాత్మక సంఘర్షణల్లో చిక్కుకున్నట్లు ట్రైలర్‌లో చూపించారు.అయితే 'మారెమ్మ' కథలో అసలు మిస్టరీ ఏమిటన్నది మాత్రం ట్రైలర్‌లో పూర్తిగా రివీల్ చేయలేదు. పవిత్రమైన ఎద్దు ఎందుకు కనిపించకుండా పోయింది? దాని వెనుక ఎవరి హస్తం ఉంది? హీరో ఎదుర్కొనే సమస్యలకు, గ్రామ దేవత నమ్మకాలకు ఉన్న సంబంధం ఏమిటి? అనే ప్రశ్నలను అలాగే ఉంచుతూ ట్రైలర్‌ను ఆసక్తికరంగా కట్ చేశారు. ముఖ్యంగా గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తున్నాయి. ఉత్కంఠభరితమైన సన్నివేశాలకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరింత బలాన్ని చేకూర్చింది.




# టాక్సిక్‌కు హాఫ్ స్టార్ రేటింగ్

## లెటర్ బాక్స్‌లో మహేశ్ బాబు తనయుడు గౌతమ్

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు కుమారుడు గౌతమ్ ప్రముఖ సోషల్ మీడియా రేటింగ్ యాప్ లెటర్‌బాక్స్ ద్వారా ఇచ్చిన సినిమా రేటింగ్‌లు ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. యశ్ హీరోగా నటించిన 'టాక్సిక్' సినిమాకు గౌతమ్ కేవలం హాఫ్ స్టార్ (0.5) ఇవ్వడం, అలాగే తన తండ్రి మహేష్ బాబు సినిమాలకే కాకుండా ఇతర స్టార్ హీరోల చిత్రాలకు ఇచ్చిన రేటింగ్‌లు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. గౌతమ్ లెటర్‌బాక్స్ ప్రొఫైల్ ప్రకారం.. అతను ఇప్పటివరకు వివిధ భాషలు మరియు జోనర్లకు చెందిన 400లకు పైగా సినిమాలను వీక్షించినట్లు తెలుస్తోంది. అయితే ఇతరులతో సంబంధం లేకుండా, సినిమాల కంటెంట్‌ను బట్టి స్వతంత్రంగా రేటింగ్‌లు ఇవ్వడం ఈ డిబేట్‌కు ప్రధాన కారణమైంది. తన తండ్రి మహేష్ బాబు నటించిన కల్ట్ క్లాసిక్స్ 'పోకిరి' మరియు '1: నేనొక్కడినే' సినిమాలకు గౌతమ్ 5 నక్షత్రాల రేటింగ్ ఇవ్వగా, 'బ్రహ్మోత్సవం' చిత్రానికి కేవలం 1 స్టార్ మాత్రమే ఇచ్చాడు. అలాగే 'నిజం', 'వంశీ' చిత్రాలకు 2 చొప్పున రేటింగ్ ఇచ్చాడు. కేవలం టాలీవుడ్ మాత్రమే కాకుండా పాన్-ఇండియా మరియు హాలీవుడ్ సినిమాలపై కూడా గౌతమ్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. 'బాహుబలి 2' చిత్రానికి 5 స్టార్లు ఇవ్వగా, 'పెళ్లిచూపులు', 'సీతారామం' సినిమాలకు 4.5 రేటింగ్ ఇచ్చాడు. మరోవైపు, యశ్ 'టాక్సిక్' చిత్రంతో పాటు విజయ్ దేవరకొండ 'లైగర్' మూవీకి కూడా అర నక్షత్రం రేటింగ్ ఇవ్వడం విశేషం. ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి 2.5 రేటింగ్ ఇచ్చాడు. ఇక సినిమా కుటుంబానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ, బంధుప్రీతికి తావు ఇవ్వకుండా సినిమాలోని కంటెంట్ ఆధారంగా నిజాయితీగా రేటింగ్‌లు ఇస్తున్నాడని కొందరు నెటిజన్లు గౌతమ్‌ను ప్రశంసిస్తుంటే, మరికొందరు సెలబ్రిటీ కుటుంబాల నుంచి ఇలాంటి బహిరంగ రేటింగ్‌లు రావడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. సెలబ్రిటీల పిల్లలు అయినంత మాత్రాన వారి వ్యక్తిగత అభిప్రాయాలు, సినిమా రుచి ఇతరులలాగే ఉండటంలో తప్పులేదని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.




Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056